# తమసోమా జ్యోతిర్గమయ

నవల

- శారద





శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 79



# ప్రారంభం

**పూర్ణిమ కళ్ళు విప్పార్చుకుని పేపరు వైపు చూసింది.** ఒక్క మాట కూడా అర్ధం కావటంలేదు.చుట్టూ చూసింది. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ప్రాక్టికల్ పరీక్షలు. అందరూ లేచి స్టాండుల దగ్గరకెళ్ళి కెమికల్స్ టెస్ట్ ట్యూబులో కలిపి ఫలితాలు పేపర్లో కెక్కిస్తున్నారు. తనకి కనీసం కెమికల్స్ పేర్లు అర్ధం కావటం లేదు. ఏమయింది తనకి? తను తప్పు పేపరు తీసుకొందా?

ఏదైతే అదయిందని లేచి స్టాండు దగ్గరకెళ్ళి పేపరులో వున్న రసాయనాలకోసం వెతకసాగింది. ఒక్క సల్ఫ్యూరిక్ ఆసిడ్ దొరికింది. ఇది అవసరం వుందా? పేపరులోకి చూసింది. చేయి తగిలి బాటిల్ కింద పడింది! ఆసిడ్ అంతా నేల పాలు. ఓ మై గాడ్! కెవ్వున అరచింది.

………

ఉలిక్కిపడి కళ్ళు తెరిచి చూసింది పూర్ణిమ. తనెక్కడుందో అర్ధం కాలేదామెకి ఒక్క క్షణం. ఇంతసేపూ జరిగింది కలా! కల అంత స్పష్టంగా లాజికల్ గా వుండదు. ఊరికే మనసలా భ్రాంతికి లోనైంది ఎందుకో. గడియారం వంక చూసింది. టైం నాలుగవుతుంది. పిల్లలొచ్చే వేళయింది. లేచి టీ పెట్టుకోవటానిక్కూడా మనసొప్పక పక్కకి తిరిగి అలాగే పడుకుంది.

ఇవాళ ఎందుకో మనసూ శరీరమూ అలసటగా అనిపించి మధ్యాహ్నం సెలవు పెట్టి ఇంటికొచ్చింది. బయట ఆకాశంలో కమ్మిన మేఘాలను చూస్తూ, పుస్తకం చదువుతూ కాస్త కన్నంటుకున్నట్టుంది. మనసు ఎప్పుడో జరిగిపోయిన సంఘటనలని తవ్వి తలచుకుంటుందెందుకో!

ఇహ తప్పదనిపించి లేచి మొహం కడుక్కుని ఇల్లు ఊడ్చి శుభ్రం చేసుకునే ప్రయత్నంలో పడింది మెల్లిగా. ఇదైంతరువాత వంటా, తరువాత సంజూ హోం వర్కూ, భోజనాలూ, మళ్ళీ వంటిల్లు సర్దుకోవటం, బట్టలు వాషింగ్ మెషీన్లో వేయటం, నిద్ర, మళ్ళీ రేపు ఆఫీసు! ఇంతే బ్రతుకు. మెషీన్ల తో పని చేసీ చేసీ తనే మెషీన్లాగ అయిపోయిందేమో అనిపిస్తుంది ఈ మధ్య.

ఒక రకమైన విసుగూ, విరక్తీ చుట్టు ముట్టుతున్నట్టుంది ఈ మధ్య తనని. తన చుట్టూ వున్న వారికి తనందించే సేవల మీదే కానీ తన మీద ఏ మాత్రమూ ప్రేమాభిమానాలు లేవన్న అనుమానం. ఎడతెగని ఆలోచనలు. ఈ ఆలోచనలని ఆపటానికి ఏదైనా ధ్యానం లోనో మెడిటేషన్ కోర్సు లోనో చేరదామంటే రోజులో వున్న ఇరవై నాలుగ్గంటలనీ తాకట్టు పెట్టేసింది తను. ఇంకొక గంట సేపు సమయం ఎక్కణ్ణించి వస్తుంది? కుటుంబం అవసరాలు చూడటనికీ, ఆర్ధిక పరిపుష్టి కోసమూ రోజంతా వెచ్చించిన తరువాత తనకేం మిగిలింది? ఏం మిగలబోతుంది? ఆలోచనల్లోనే యాంత్రికంగా ఒక దాని తర్వాత ఇంకొకటి పని చేస్తూనే వుంది.

తలుపు చప్పుడయ్యింది. గబగబా తలుపు తోసుకుని వచ్చింది నీహారిక, "హాయ్ మాం!" అంటూ. తను జవాబిచ్చిందో లేదో కూడా చూడలేదు. గదిలోకి వెళ్ళి లేప్ టాప్ తెరచి ఫేస్ బుక్కులో మెస్సేజీలు చూసుకోసాగింది. "దీనికి ఇంటికొచ్చేసరికి అమ్మ కనపడకపోయినా పర్వాలేదు కానీ, లేప్ టాప్ కనపడకపోతే ఊపిరాగిపోతుంది!" అనుకుంటూ గ్లాసులో పాలు పోసి తీసికెళ్ళింది.

పక్కనే కూర్చుని "ఏమిటి విశేషాలు నీహా?" పాల గ్లాసందిస్తూ అడిగింది. పరధ్యానంగా తల్లి వైపొక సారి చూసి, "ఏముంటాయి, ఏమీ లేవు." మళ్ళీ లేప్ టాప్ లోకి వెళ్ళి పోయింది.

"లెక్కల్లో మార్కులొచ్చాయా?"

"వచ్చాయమ్మా! ఎప్పట్లానే ఏ ప్లస్ వచ్చింది." తల్లి ఆ గదిలోంచి వెళ్ళి పోతే బాగుండునన్న అసహనం నీహా గొంతులో. చిన్నప్పుడు "స్కూల్ నించి వచ్చేసరికి నువ్వింట్లో లేకపోతే నాకు ఏడుపొస్తుందమ్మా" అని వెక్కిళ్ళు పెట్టిన నీహా యేనా అని అనుమానం వస్తుంది.

దాన్నలాగే వదిలి వంటింట్లోకెళ్ళి వంట పని చూసుకోవటం మంచిది.

మళ్ళీ బెల్లు! ఈ సారి సంజూ. "అమ్మా! అర్జెంటుగా నన్ను స్పోర్ట్స్ షాపుకి తీసికెళ్ళు , ఇన్ వన్ అవర్స్ టైం" బూట్లూ సాక్సూ విప్పి అవతలికి విసిరేస్తూ అన్నాడు.

"అబ్బో! ఏమిటో అంత అర్జంటు. ముందు షూసు గూట్లో పెట్టి సాక్సు వాషింగ్ మెషీన్లో వేయి!"

వాడికీ పాలు గ్లాసులో పోసి అందిస్తూ అడిగింది. పాలు తాగుతూ ఏదో చెప్తున్నాడు సంజూ. మళ్ళీ ఆలోచనల్లోకి జారిపోతుంది. ఇదొక చెడ్డ అలవాటైపోయింది. తల విదిలించుకుంది.

"అలాగే! కొంచెం వంట పని చేసుకుని నిన్ను షాపు కి తీసికెళ్తాలే."

"హలో హనీ! ఆకలిగా వుంది. వంటయిందా?" శివా లోపలికొచ్చాడు. ఎప్పుడూ తనని ఏ ప్రశ్నలూ ఎవరూ అడగని చోటుకెళ్ళీ దాక్కోవాలి ఎప్పటికైనా!

********

రాత్రి ఎనిమిదిన్నర. లైబ్రరీ నించి తెచ్చిన పుస్తకం, ఎప్పణ్ణించో చదవాలనుకున్నది, తెరిచి మొదలు పెట్టింది. కళ్ళు నిద్రలో కూరుకు పోతున్నాయి. ఇదేమైనా జబ్బేమో!లేకపోతే ఇంత తొందరగా ఇంత నిద్ర ఎందుకు ముంచుకొస్తుంది? దాదాపు ఆర్నెల్లుగా ఇంతే! ఏదో నీరసం, నిరాసక్తత.

పక్కకి తిరిగి చూసింది. శివా హాయిగా పుస్తకం చదువుతూ సంగీతం వింటూ రిలాక్స్ అవుతున్నాడు. తనెందుకలా వుండలేక పోతుంది? ఎప్పుడూ అలసట, చిరాకు, కోపం వస్తున్నాయెందుకు.

ఆ రోజు ఆఫీసులో చదివిన సైన్సు జర్నల్ లోని వ్యాసం గుర్తొచ్చిందామెకు. నలభైల్లో పడ్డ స్త్రీలకి డిప్రెషన్ మొదలైన సైకలాజికల్ డిజార్డర్స్ వచ్చే అవకాసం ఎక్కువని వుందా వ్యాసంలో. తనకీ ఏదైనా డిప్రెషన్ లాటి జబ్బు ముసురుకుంటుందేమో.

"శివా!"

"ఊమ్మ్..:

"నాకెందుకో ఈ మధ్య ఆరోగ్యం సరిగ్గా వుండటం లేదు. మనసంతా దిగులుగా వుండి అలసటా, కోపం ఎక్కువౌతున్నాయి."

"అదేమీ లేదు! పని చేసి అలిసిపోతున్నావంతే. నాలుగు రోజులు లీవు పెట్టి రెస్టు తీసుకో. అదే సర్దుకుంటుంది. అన్నట్టు నాన్న గారిని డాక్టరు దగ్గర కెళ్ళ మని చెప్పాం. వెళ్ళారో లేదో ఫోన్ చేసి కనుక్కున్నావా?"

మళ్ళీ అతని మాటలు వినిపించటం మానేసాయి. ఎప్పుడూ ఇంతే! తను అలిసిపోతుందని ఒప్పుకుంటాడు. అందుకు సెలవు పెట్టి రెస్టు తీసుకో అంటాడే కానీ, నేనూ పనిలో సహాయం చేస్తాననే మాట చచ్చినా అనడు. నాలుగు రోజులు రెస్టు తీసుకుంటుంది. తరువాతా? మళ్ళీ ఇదే ఉరుకులూ పరుగులూ, ఊపిరి సలపనంత పనీ, ఇంట్లో బయటా చాకిరీ. తనకి ఏ అనారోగ్యమైనా, దానికి విరుగుడు ఆ అనారోగ్యం గురించి ఆలోచించకపోవటమే అనుకుంటాడు. తన గురించి తను ఆలోచించుకోవటం మొదలు పెడితే తన తల్లి తండ్రుల సేవలోనో, పిల్లల పనుల్లోనో లోటు జరుగుతుందనా?

అత్త మామలు ఇంకా ఒంట్లో శక్తి వుండటం మూలాన ఇదే ఊళ్ళో సొంత ఇంట్లో ఉంటున్నారు. ఇంకొక నాలుగైదేళ్ళయితే వాళ్ళూ తమతో వుండక తప్పదు. శివా ఒక్కడే కొడుకు వాళ్ళకి. అప్పుడు ఇంతకు రెండింతలు చాకిరీ! అలాగని వాళ్ళని ఇంటికి రావొద్దనేంత కుసంస్కారి కాదు తను. భయంతో కళ్ళ మీదకొస్తున్న నిద్ర తేలి పోయింది.

ఎవరైనా ఒక్కరు, ఒక్కళ్ళంటే ఒక్కళ్ళు, నువ్వు పడుతున్న కష్టం నాకు తెలుసు, ఇదిగో, నేనూ ఒక చెయ్యందిస్తాను, రోజంతా ఇంటిల్లిపాదికీ అమర్చి అలసిపోయావేమో, ఇదిగో, ఈ పాట వింటూ కళ్ళు మూసుకుని పడుకో, అంటూ, తనని లాలిస్తూ, ఒక్క మనిషి దొరికితే. అసలిలా మాటి మాటికీ సెల్ఫ్-పిటీతో కన్నీళ్ళెందుకొస్తాయో ఎవరైనా డాక్టర్ని అడగాలి. ఎప్పటికో నిద్ర పట్టింది.

*******

రోజూలాగే అయిదింటికి అలారం మోగింది. మెలకువ వచ్చినా లేవాలనిపించలేదు పూర్ణిమకి. "ఇంకొక్క పది నిముషాలు," అనుకుంటూ కళ్ళు మూసుకుంది. రాత్రి తొందరగా పడుకునే అలవాటు మూలాన తెల్ల వారు ఝామునే లేవటం అలవాటూ, ఇష్టమూ ఆమెకి.

ఉన్నట్టుండి నిన్న మధ్యాహ్నం వచ్చిన కల గుర్తొచ్చి నవ్వొచ్చింది. అబ్బా! అప్పుడే పద్దెనిమిదేళ్ళయి పోయిందా తను ఎమ్మెస్సీ చదివి? నిన్నో మొన్నో అన్నట్టుంది. తమ పెళ్ళయ్యే పదిహేడు సంవత్సరాలు. పదిహేనేళ్ళ కూతురుంది తనకి. ఇంకో రెండేళ్ళలో తనకి కాలేజి కెళ్ళే కూతురు! . తలచుకుంటే కొంచెం దిగులుగా, కొంచెం థ్రిల్లింగ్ గా అనిపించింది.

మెల్లిగా బద్ధకాన్నొదిలించుకొని లేచింది. స్నానం, కాఫీ ముగించి రోజువారీ పనుల్లో పడింది, "ది రేస్ బిగిన్స్" అనుకుంటూ.

ఆరింటికి రాజమ్మ వొచ్చింది, "అంట్లెయ్యమ్మా" అనుకుంటూ. పిల్లలు లేచి స్నానం కోసం దెబ్బలాటలూ, హోం వర్కు పుస్తకాలు వెతుకులాటలూ, "అయాం రన్నింగ్ లేట్, అమ్మా, నా లంచ్ డబ్బా యేదీ?" అరుపులూ, అంతా మామూలే!

శివా లేచి తన పనులు పూర్తి చేసుకొని నీహా లెక్కల హోం వర్కు చెక్ చేస్తున్నాడు. అదవగానే వంటింట్లోకొచ్చి, "బ్రేక్ ఫాస్టు నేను రెడీ చేస్తాలే, నువ్వెళ్ళి ఆఫీసుకి రెడీ కా!" అన్నాడు.

అమ్మయ్య, అంటూ బట్టలు మార్చుకోవటానికెళ్ళింది. చీర కట్టుకొని జడ వేసుకుంటుండగా రాజమ్మ వొచ్చింది గదులూడ్చుకుంటూ.

“అదేం చీర? కొంచెం మంచి చీర కట్టుకోరాదు?" నిర్మొహమాటంగా సలహా ఇచ్చింది.

" ఈ చీర కేం తక్కువయింది రాజమ్మా? శుభ్రంగా ఇస్త్రీ చేసే వుందిగా?" ఇస్త్రీ కాటన్ చీర సరి చేసుకుంటూ అంది పూర్ణిమ.

“రోజూ టీవీ చూడట్లే? ఎసువంటి చీరలు గడుతున్నరాళ్ళు ? సదువుకొని మంచి ఉద్యోగం జేస్తుంటివి. కొంచెం జరీ చీర కట్టుకోరాదు?"

రాజమ్మ మాటలకి బాగా నవ్వొచ్చింది.

"టీవీలో లాటి చీరలు కడితే నా ఉద్యోగం పీకేస్తారు రాజమ్మా!"

డైనింగ్ టేబిల్ దగ్గరకెళ్ళి శివా తయారు చేసిన టోస్టు తింటూ, “మీకు ఆలస్యం కావటంలే? బ్రేక్ ఫాస్ట్ తిని బయల్దేరండి. అక్కడే లంచ్ డబ్బా పెట్టాను,” అంది.

“అయిపోయింది. జస్ట్ డ్రస్ మార్చుకొని వెళ్ళాలంతే!” పేపర్ చూస్తూ, కాఫీ నోట్లో పోసుకుంటూనే వెళ్ళిపోయాడు శివ.

“బై అమ్మా! థేంక్స్ ఫర్ ది షూ!” చెంప మీద ముద్దు పెట్టి పరిగెత్తాడు సంజూ.

“అమ్మా! ఇవాళ ఫిజిక్సులో నేను డెఫినెట్ డింకీ! ఎంత చదివినా, ఐ ఫీల్ ఐ హేవ్ నాట్ డన్ ఎనఫ్,” జడ అల్లుకుంటూ ఏడుపు మొహం తో అంది నీహారిక.

"యూ ఆర్ ఫైన్! బాగా చదివావు నీహా! బీ కాన్ఫిడెంట్. డోంట్ వరీ!" లోపల్నించి శివా గొంతు.

“విష్ మీ లక్ అమ్మా!” తల్లి మెడ చుట్టు చేతులు వేసి అంది.

“గుడ్ లక్ బేబీ ! బై. జాగ్రత్తగా వెళ్ళి రా. ” చెంపలు సవరిస్తూ నుదుటి మీద ముద్దిచ్చింది. బయట స్నేహితురాళ్ళ అలికిడి విని బయటికి పరిగెత్తింది నీహారిక. టై సరి చేసుకుంటూ వచ్చాడు శివా.

“బై హనీ!” కారు తాళాలు తీసుకొని వెళ్ళిపోయాడు.

తనకి ఆఫీసు దగ్గరే కాబట్టి అందరూ వెళ్ళక తాళాలూ, తలుపులూ చూసుకొని బయల్దేరుతుంది.

****************

ఒక పెద్ద రీసెర్చి లేబోరెటొరీలో కెమిస్ట్రీ విభాగంలో సైంటిస్టుగా పని చేస్తోంది పూర్ణిమ. డిపార్ట్మెంట్ ఇచ్చిన క్వార్టర్సులో వుండటంతో, ఆఫీసుకి కాలనీకి నడిచే డిపార్ట్మెంట్ బస్సులో వెళ్ళి వస్తుంది. ఇంకో ప్రభుత్వ రంగ సంస్థలో మేనేజరుగా పని చేస్తున్న శివా కారులో వెళ్తాడు. పిల్లలకి స్కూలూ అదే కాంపస్ కావటంతో హైదరాబాదు నగరంలోనైనా, ట్రాఫిక్ భూతం బారిన పడకుండా రోజులు గడుస్తున్నాయి.

రిటైరయ్యింతర్వాత ఈ కాలనీలోంచి వెళ్ళినప్పుడు అవుతుంది, మా పని! ఇంటికి తాళం వేస్తూ అనుకుంది పూర్ణిమ. బస్టాపులోనే కనిపించింది సీత. తన లేబ్ లోనే ఇంకొక విభాగంలో సైంటిస్టు.

“నిన్న మధ్యాహ్నం టీకి రాలేదే?”

“కొంచెం తల నెప్పి గా వుండి ఎర్లీ గా ఇంటికెళ్ళాను!”

"చీర బాగుంది!"

“థేంక్స్! అయినా ఏం బాగులే! మా రాజమ్మకి నచ్చలేదు. ” రాజమ్మ కామెంటు గురించి నవ్వుతూ చెప్పింది.

“వీకెండ్ ఏమిటి ప్రోగ్రాం?”

“నథింగ్ స్పెషల్! వీలైతే అమ్మా నాన్నల దగ్గరికి వెళ్దామనుకుంటున్నాను. నీకు?”

“నేను గుడి కెళ్దామంటున్నాను. కృష్ణ సినిమాకెళ్దామంటున్నాడు.”

ఎలాగూ వాళ్ళింట్లో కృష్ణ కుమార్ మాట నెగ్గదనీ, సీతదే పై చేయి అనీ తెలుసు పూర్ణిమకి.

“రెండిటికీ వెళ్ళండి, పోనీ!”

“ఆయనవన్నీ దొంగ మాటలు. వాళ్ళ చెల్లాయీ తమ్ముడూ కూడా అదే సినిమాకి, అప్పుడే వెళ్తున్నారు. అందుకే ఈయనకి ఎప్పుడూ లేనిది సినిమాకెళ్ళాలని అంత ఇంటరస్టు.”

యిన్-యాంగ్ లాగా ప్రతీ మనిషి మనసులోనూ నలుపూ తెలుపూ కోణాలుంటాయేమో. సీత చాలా మంచిది. మధ్య తరగతి కుటుంబంలో పుట్టి కష్టపడి పెద్ద చదువులు చదివింది. చిన్ననాటి స్నేహితుణ్ణి చిన్న ఉద్యోగమని కించ పర్చకుండా మనస్ఫూర్తిగా పెళ్ళాడింది. అంతే కాదు, అతనికి వెన్ను దన్నుగా వుండి పట్టుదలగా డిపార్ట్ మెంటల్ పరీక్షలు రాయించి, ప్రోత్సహించీ, పెద్ద పదవిలో కూర్చో పెట్టింది.

కష్ట పడందే ఏదీ రాదని నమ్మే సీత, భర్తకీ, పిల్లలకీ అదే నేర్పింది. కానీ,ఆమెకి అత్త మామలన్నా, ఆతని మిగతా బంధువులన్నా ఎక్కళ్ళేని అసహనం, చిరాకూ, కోపమూ. బయటి వారికెంతో సహృదయంతో సాయం చేసే సీత సొంత అత్త మామలతో ప్రవర్తించే తీరు విచిత్రంగా వుండటమే కాక, చాలా అన్యాయం అనిపిస్తుంది.

“నీకు వాళ్ళు నచ్చకపోతే పోనీ! కానీ ఆయనని కూడా వాళ్ళతో మాట్లాడొద్దనటం అన్యాయం కాదా సీతా?” అంటే ఒప్పుకోదు. తనదేమీ తప్పులేదని ఒప్పించటానికి ఎంతో నేర్పుతో వాదనని నిర్మించుకుంటుంది.

“నీకు తెలియదు పూర్ణిమా! ఇంటర్మీడియేట్ చదువు అయిపోగానే ఉద్యోగంలో పెట్టారు ఆయనని. నేను పట్టుబట్టి పరీక్షలు రాయించబట్టి ఇవాళ మంచి పొజిషన్లో కొచ్చారు గానీ, లేకపోతే ఇంకా అలాగే టైపు మిషను టకటకలాడించుకుంటూ వుండేవారు. పెద్ద వాళ్ళు తాము కష్టపడి పిల్లలని పైకి తేవాలి,కానీ, పిల్లల కష్టంతో తమ బాధ్యతలు తీర్చుకోవాలనుకోకూడదు. అలాటి వాళ్ళంటే నాకసహ్యం,” అంటుంది తీవ్రంగా.

"నీ వాదనలో నిజమున్నా, అంత గాఢంగా మనుషులని జడ్జ్ చేయటం మంచిది కాదేమో ఆలోచించు. వాళ్ళ పరిస్థితి ఏమిటో, ఎందుకలా అనుకున్నారో!", నచ్చ చెప్పటానికి చాలా సార్లే ప్రయత్నించింది పూర్ణిమ. అయినా సీత వినదు. అసలు సీతకి తన వాదన తప్ప మిగతా అందరి ఆలోచనలూ తప్పే అనిపిస్తాయి.

ఏ విషయంలోనూ భర్తకీ, పిల్లలకీ కూడా అభిప్రాయాలుంటాయనీ, అవి తనకనుకూలంగా లేకపోయినా వాటిని కూడా గౌరవించాలనీ ఆమెకనిపించదు. ఎప్పుడైనా ఆదివారం రాత్రి పూర్ణిమా వాళ్ళింటికొచ్చినా, తనకి వెళ్ళాలనిపించినప్పుడు లేచి నిలబడి, భర్త వైపూ పిల్లల వైపూ చూసి, "ఇక వెళ్దాం పదండి!" అంటుంది. పిల్లలెప్పుడైనా, "అమ్మా! ఆట మధ్యలో వున్నాం. ఇంకొంచెంసేపు వుందాం," అన్నా వినిపించుకోదు.

"వస్తోంది, నీ ఫ్రెండు, టక్కులాడి," మోచేత్తో సీత పొడిచేసరికి ఈలోకంలోకొచ్చింది పూర్ణిమ. అందంగా జీన్సు పాంటు పైన ఎర్రని కుర్తీ వేసుకుని నవ్వుతూ వీళ్ళ వైపే వస్తుంది రూపిణి.

"ఛీ! అలాగనకు, ఆ అమ్మాయి చాలా మంచిది."

రూపిణి పటేల్ గుజరాతీ అమ్మాయి. తమ లేబ్ లోనే హెచ్.ఆర్. విభాగంలో పని చేస్తుంది.

"హాయ్ పూర్ణిమా! శుక్రవారం సాయంత్రం సంగీతం ప్రోగ్రాం మరిచిపోవుగా! హలో సీతా!" పలకరించింది ఇద్దరినీ.

"ష్యూర్. తప్పకుండా వస్తాను."

ఇంకెవరో స్నేహితులు కనిపిస్తే వెళ్ళిపోయింది రూపిణి.

"ఏమిటీ? ఏదో ప్రోగ్రాం అంటుంది ఏమిటి?"

"ఏం లేదు. తన ఇంట్లో శుక్రవారం రాత్రి తను పాట కచేరీ చేస్తుంది. వినటానికి రమ్మంది."

"ఇద్దరు పిల్లలతో, ఆఫీసు పనితో మనకు దేనికీ టైము చిక్కదు. తను చూడు! ఎంతైనా హెచ్.ఆర్. పనే హాయి! ఎంత సేపూ లిప్స్టిక్కు వేసుకోవటం, గోళ్ళకు రంగు వేసుకోవటం, ఇకిలిస్తూ మాట్లాడటం తప్ప వేరే పనేం వుంది?"

"మరీ అంత తేలికగా తీసిపడేయకు. ఆ అమ్మాయిలా మనం ఎప్పుడూ చిరునవ్వుతో కాం గా, స్నేహంగా మాట్లాడగలమా? లేబ్ లో వాళ్ళు, బయటి వాళ్ళూ అడిగే అడ్డమైన ప్రశ్నలకీ నవ్వుతూ సమాధానాలివ్వగలమా? అసలంత అందంగా, ఎప్పుడూ ప్లెజెంట్ గా వుండేటట్టు డ్రస్ చేసుకోగలమా? అవన్నీ కూడా చాలా ముఖ్యమైన స్కిల్సే తెలుసా? ఏదీ, నిన్నో నన్నో అపాయింట్ చేయమను ఆ రోల్ లో, చూద్దాం!"

"అవునులే నువ్వనదీ నిజమే! అయినా నీకందరూ మంచి వాళ్ళనే అనిపిస్తారు." విసుక్కుంది ఎప్పట్లానే. ఎంత అభిప్రాయ భేదాలున్నా, ఇద్దరిదీ పదిహేనేళ్ళ స్నేహం వల్ల ఒకరంటే ఒకరికి చాలా ఇష్టం.

బస్సు దిగి ఇద్దరూ ఆఫీసువైపు నడవసాగారు. లిఫ్ట్ లోంచి బయటికొచ్చి ఎవరి దారిని వాళ్ళెల్లిపోయారు, "పన్నెండింటికి లంచ్ టైం లో కలుద్దామనుకుంటూ."

కంప్యూటారు ఆన్ చేసి మెయిల్ చూసుకుని, పనిలో పడిపోయింది పూర్ణిమ. లేచి లేబ్ కోటు తగిలించుకుని లేబ్ కి బయల్దేరింది.

**"రేపే శుక్రవారం!** మరచిపోకుండా ఇంటికి త్వరగా రండి. రూపిణి ఇంట్లో పాట కచ్చేరీకి వెళ్ళాలని గుర్తు వుందిగా?" జ్ఞాపకం చేసింది పూర్ణిమ.

"అబ్బా! శుక్రవారం రాత్రా? అలిసిపోయి వుంటాం. హాయిగా అన్నం తిని పడుకోక ఎందుకొచ్చిన బెడద?" తను ఊహించినట్టే అన్నాడు శివ.

"కాదండీ! ఎప్పుడూ ఇంటిపనీ ఆఫీసు పనీ, తప్ప మనసుకి రిలాక్సింగ్ గా వుండే పనులేమీ చేయటం లేదు. కాస్త అలా నలుగుర్లోకి వెళ్ళి పాట కచేరీ వింటే మనసు నెమ్మదిగా వుంటుంది."

"అయితే ఇంట్లో బోలెడు సీడీ లు వున్నాయి. వినే నాథుడు లేక బూజు పేరుకుంటుంది. అవి వినొచ్చు కదా?" విసుగ్గా అన్నాడు.

"అది లైవ్ పెర్ఫార్మెన్సు లాగుండదు. పిల్లలు ఎటూ రారు. కాలనీలోనే కదా? మనిద్దరం వెళ్ళొద్దాం, ప్లీజ్!"

"సరేలే!" నిరాసక్తంగానే అన్నాడు.

*******************

శుక్రవారం సాయంత్రం ఇంటికి రాగానే గబ గబా వంట చేసేసింది. నిజానికి పూర్ణిమకి సంగీతంతోటీ, అందులోనూ శాస్త్రీయ సంగీతంతోటీ అసలే పరిచయం లేదు, ఏదో కాలేజీలో వున్నప్పుడు కూనిరాగాలు తీయటం తప్ప. కానీ తనకంటూ ఏదైనా అభిరుచి, మనసుని నెమ్మదింప చేసేది కల్పించుకోవాలని నిశ్చయించుకుంది. అందుకే ఎలాగైనా ఈ కచేరీకి వెళ్ళాలనీ, ఆ అట్మాస్ఫియారూ, కంపెనీ ఎలా వుంటుందో చూడాలనీ కుతూహలంగా వుంది.

ఏడింటికంతా పని పూర్తి చేసుకుని మెత్తటి నూలు చీర కట్టుకుని శివాతో పాటు బయల్దేరింది. కార్లో వెళ్దామన్న అతని ప్రతిపాదన తోసేసి, "నాలుగు వీధులవతలే వాళ్ళిల్లు. ఈ మాత్రం నడవలేమా! బయట చల్లగా, హాయిగా వుంది కూడా", అంది.

సణుక్కుంటూనే బయల్దేరాడు శివ. పిల్లలిద్దరికీ జాగ్రత్తలు చెప్పి బయల్దేరారు. నిజంగానే బయట మెత్తటి వెల్తురు హాయిగా పరచుకోనుంది.

ఆఫీసు కబుర్లేవో చెప్తున్నాడు శివ. అతనికి తన ఆఫీసూ, వీకెండు స్నేహితులతో ఆడుకునే టెన్నిసూ, చిన్న చిన్న ఇంటి వ్యవహారాలూ తప్ప మాట్లాడటానికింకేమీ దొరకవు.

"అబ్బా! ఇహ మీ ఆఫీసు ముచ్చటలు చాలు. ఇంకేవైనా మాట్లాడండీ!"

"అయితే నువ్వే మీ ఆఫీసు విషయాలు చెప్పు."

"మనిద్దరికీ, ఆఫీసులు, కుటుంబాలూ తప్ప మాట్లాడుకోవటానికింకేమీ లేకుండా అవుతుందీ మధ్య. అదంత మంచిది కాదేమో!"

"అయితే ఒక ముఖ్య విషయం చెప్తా విను. ఇవాళ ఈ చీరలో నువ్వు చాలా బాగున్నావు," సీరియస్ గా అన్నాడు శివ.

"నేనెప్పటిలాగే వున్నాను. కొంచెం సేపు చల్ల గాలిలో నడిచేసరికి మీ మూడ్ బాగయిందంతే!"" నవ్వుకుంటూ రూపిణి ఇంటి గేటు తెరచి లోపలికెళ్ళా రిద్దరూ.

"హాయ్! ప్లీజ్ కమిన్! మిస్టర్. శివా! వాటె సర్ప్రయిజ్! సో గ్లాడ్ యౌ హేవ్ కం!" రూపిణి ఇద్దరినీ లోపలికి తీసికెళ్ళి ంది.

చాలా మంది ఉత్తర భారతీయులూ, ఒకరిద్దరు దక్షిణ భారతీయులూ అప్పటికే వచ్చి కూర్చుని వున్నారు. పెద్ద హాలులో ఒక మూలగా తివచీ పరచి, దాని మీద ఒక తబలా, ఒక తంబూరా సిద్ధంగా వున్నాయి.

"ఇతను లలిత్! ఇవాళ తబలా వాయిస్తాడు. " సన్నగా, పొడుగ్గా, ఫ్రెంచి గడ్డంతో వున్న అతనిని రూపిణి పరిచయం చేసింది.

"తను పూర్ణిమ. నేను పని చేసే లేబొరేటొరీలో పెద్ద సైంటిస్టు!" అతనికి పూర్ణిమని పరిచయం చేసింది.

"పెద్ద కాదు కానీ, మామూలు సైంటిస్టుని," నవ్వుతూ అంది పూర్ణిమ. అతనూ మొహమాటంగా నవ్వాడు.

"తనలాగే అంటుంది. బట్ షీ ఈజ్ బ్రిలియెంట్!" ప్రొటెస్టు చేసింది రూపిణి.

"మన సంగతి వదిలేయి," అని అతని వైపు తిరిగి, "మీరేం చేస్తుంటారు?" అడిగింది అతనిని.

"నేను ఇక్కడ ఎస్.బీ.ఐ.లో మేనేజరుని! అదిగో అక్కడ దూరంగా మాట్లాడుతుంది నా వైఫ్, హారతి," అన్నాడతను.

"ప్రోగ్రాం ప్రారంభించే వేళవుతుంది, మళ్ళీ కలుద్దాం!" వెళ్ళి తివాచీ మీద కూర్చున్నాడతను.

సరిగ్గా ఎనిమిదింటికి కచ్చేరీ మొదలైంది. దాదాపు రెండూ గంటలసేపు, ఏ పనీ లేకుండా అలా హాయిగా కూర్చుని సంగీతం వింటుంటే హాయిగా అనిపించింది పూర్ణిమకి. రూపిణి పాడిన హిందుస్తానీ సంగీతం అంతగా అర్థం కాకపోయినా, వినటానికి చాలా సూదింగ్ గా అనిపించింది. లలిత్ కూడా బాగానే వాయించాడనిపించింది. శివా ఏం చేస్తున్నాడా అని మగవాళ్ళ వైపు చూసింది. తీవ్రంగా మొబైల్ ఫోనులో మెసేజీలు చదువుకుంటున్నాడు. కొంచెం సేపైనా మనసు దేనిమీదా నిలవదెందుకో ఈ మనిషికి!

కచ్చేరీ కాగానే బయల్దేరదామన్నాడు శివ.

"నో! నో! కొంచెం టీ తాగి అందరినీ పలకరించి వెళదాం." రూపిణి చుట్టూ మూగి అభినందిస్తున్న వాళ్ళని చూస్తూ అంది పూర్ణిమ.

ఇద్దరూ మొహమాటంగా ఒక పక్కకి నిలబడ్డారు..

"చాలా బాగా పాడావు. నీ కంఠం చాలా శ్రావ్యంగా వుంది," చెప్పింది పూర్ణిమ.

"థాంక్స్! లలిత్ ఎలా వాయించాడు?"

"బాగుంది, కానీ నేనెక్కువగా నీ పాట మీదే దృష్టి పెట్టాను. స్పీడుగా వాయించినప్పుడు నాకు చాలా నచ్చింది."

"రండి, అక్కడ మా వారు అజిత్ టీ చేసి అందరికీ ఇస్తున్నారు. మీరు కూడా తాగదురుగాని."

"మేమెళ్ళి తెచ్చుకుంటాంలే రూపిణీ, నువ్వు మిగతా వాళ్ళతో మాట్లాడుతూ వుండు," ఇద్దరూ టీ కొరకు వంటింట్లోకెళ్ళారు. టీ తాగి బయట పడ్డారిద్దరూ.

"పిల్లలని కూడా తీసుకు రావాలి ఇంకోసారి. ఎంత సేపూ కంప్యూటరూ, వీడియో గేంసూ తప్ప ఇంకో వ్యాపకం లేదు వాళ్ళకి!", అనుకుంటూ ఇంటికొచ్చి పడుకుంది.

*********************

మర్నాడు శనివారం సాయంత్రం గుళ్ళో ఒక్కతే కూర్చుని కళ్ళు మూసుకుని కూర్చుని వుంది పూర్ణిమ.

"హల్లో!"

ఉలిక్కి పడి కళ్ళు తెరిచింది. అరుణ్! పక్క సెక్షన్ లో పని చేసే ఇంజినీరు. తనకంటే పదేళ్ళు జూనియర్. ఈ మధ్యే తమ కంపెనీలో చేరాడు. అప్పుడప్పుడూ హలో అనుకోవటం తప్ప పెద్ద పరిచయం లేదు. ఎవరో కొలీగ్ గృహప్రవేశం సందర్భంగా అతని తల్లి రేవతినీ, తండ్రి రాజారావునీ కలిసిన గుర్తు!

"హలో! ఏమిటిలా?" అడిగింది ఏమనాలో తోచక.

"ఏమీ లేదు. ఊరికెనే! మీ వాళ్ళేరీ? ఒంటరిగా వున్నారే?"

"ఒంటరిగా వుందామనే వొచ్చాను!"

"ఓ! ఆర్యూ ఆల్రైట్?"

పరాయి మనిషి ముందు అలా బయట పడ్డందుకు సిగ్గు పడి పోయింది.

"ఇంతకీ మీ అమ్మా నాన్నా ఏరీ?" చుట్టూ చూస్తూ అడిగింది.

"వాళ్ళ కొరకే ఎదురు చూస్తున్నాను. ఇవాళ ఏదో పూజ చేయించాలని ఆఫీసు నించి ఇటే రమ్మంది అమ్మ. అదిగో! వాళ్ళు కూడా వచ్చేసారు."

"బాగున్నావా పూర్ణిమా?" పలకరించింది అరుణ్ వాళ్ళ అమ్మ రేవతి.

"బాగున్నానండీ!" చెప్పి తనూ లేచింది పూర్ణిమ, వాళ్ళతో పాటు దర్శనానికి.

దర్శనం చేసుకుని, హారతి కళ్ళకద్దుకుని బయటికొచ్చి కాసేపు కూర్చున్నారు.

"ఈ సంవత్సరమైనా వీడికీ జబ్బు తగ్గి ఒక ఇంటివాడైతే వచ్చే సంవత్సరానికి గుళ్ళో దేవుడికి కల్యాణం చేయిస్తాము," చెప్పింది రేవతి.

జబ్బా? అరుణ్ కేం జబ్బు?బాగానే వున్నాడే! వింతగా చూసి అదే అడిగిందావిడని.

"అయ్యో! ఏం చెప్పనమ్మా.." ఇంకేదో అనబోయి దగ్గరికొస్తున్న కొడుకుని చూసి మాటలాపేసిందావిడ. దగ్గరికొచ్చి తల్లి చేతిలో కొబ్బరి చిప్ప అందుకుని పక్కనే కూర్చున్నాడు అరుణ్.

"మీరు ఇంటికెలా వెళ్తారు? నేను నా కార్లో డ్రాప్ చేస్తాను రండి," అన్నాడు.

"అదేమీ అవసరం లేదండీ.మా ఇల్లీ పక్కనే, నడుచు కుంటూ వెళ్తాను. అసలు మీరే మా ఇంటికి రండి, ఒక కప్పు కాఫీ తాగి వెళ్ళురు గాని."

"నాకేం అభ్యంతరం లేదు. ఈయనేం అంటారో అడిగొస్తాను," రేవతి లేచి వెళ్ళింది.

అరుణ్ వంక పరీక్షగా చూసింది పూర్ణిమ. ఒంటి మీద ఏ జబ్బు ఛాయలూ లేవు. అందంగా, పొడవుగా, మామూలుగా వున్నాడు. కొంచెం ఈ మధ్య చిక్కినట్టున్నాడంతే. మరేమిటి జబ్బు? అడిగితే ఏమనుకుంటాడో.

ఉన్నట్టుండి తన వైపు తిరిగి, "జీవితం గురించి మీ అభిప్రాయం ఏమిటి? అసలు మనమంతా ఎందుకు బ్రతుకుతున్నామో మీకేమైనా తెలుసా?" అన్నాడు. ఆ ప్రశ్నకేం సమాధానమివ్వాలో ఆమెకి అర్ధం కాలేదు. ఏం చెప్పాలో ఆలోచిస్తుండగానే రేవతి తిరిగొచ్చింది. "ఆయన సరేనన్నారు," అంటూ. అందరూ బయల్దేరారు.

********

"ఇతను మా కొలీగ్, అరుణ్, వాళ్ళ అమ్మా నాన్న గారు," పరిచయం చేసి వంటింట్లోకెళ్ళింది పూర్ణిమ. రేవతీ ఆమె వెనకాలే వెళ్ళింది. మగవాళ్ళంతా కబుర్లతో హాల్లోనే కూర్చున్నారు.

అరుణ్ కేం జబ్బో అడగాలనుకుంది, కానీ సభ్యత కాదని ఊరుకుంది.

"కాఫీతో సరిపెడతావా ఏమిటి? వాళ్ళని రాత్రికి భోజనానికి ఉండమను," శివ లోపలికొచ్చి లోగొంతుకతో అన్నాడు.

"ఇప్పుడు మళ్ళీ వంట చేయాలయితే!"

"వంటేమీ వద్దు. బయటనించి టేక్-అవే తెస్తాను.వాళ్ళనీ వుండమందాం. నీకు కొంచెం కంపెనీ వుంటుంది."

"అలాగే."

మగవాళ్ళూ పిల్లలూ హోటల్ నించి భోజనం తేవటానికెళ్ళారు. రేవతీ పూర్ణిమా మాట్లాడుకుంటూ కూర్చున్నారు. ఆవిడ మళ్ళీ అరుణ్ గురించేమీ మాట్లాడలేదు. అతనడిగిన విచిత్రమైన ప్రశ్న గురించే ఆలోచిస్తూ పడుకుంది పూర్ణిమ.

************

"మధ్యాహ్నం కాఫీకి గానీ లంచి కి గానీ వస్తారా?"

సోమవారం పొద్దున్నే తన ఈ-మెయిల్ లో మెసేజీ చూసి ఆశ్చర్య పోయింది పూర్ణిమ .

“అలాగే! పన్నెండింటికి భోజనానికొస్తాను” జవాబిచ్చి పనిలో పడింది. పన్నెండింటికి కంప్యూటర్ ఆఫ్ చేసి లంచ్ బాక్సు తీసుకుని కేంటీన్ కెళ్ళింది.

“బాగున్నావా అరుణ్?”

“అయాం ఫైన్. మొన్న గుళ్ళో నేనడిగిన ప్రశ్నకి జవాబు ఆలోచించారా?” ఆత్రంగా అడిగాడు.

“నిజానికి నాకు నీ ప్రశ్న అంతగా అర్థం కాలేదు.”

“నిజమే లెండి, నా మాటలూ ప్రశ్నలూ అన్నీ తిక్క తిక్కగా వుంటాయి. వాటినెవ్వరూ పెద్దగా పట్టించుకోరు," ఒక లాటి నిరాశ అతని గొంతులో.

“నో! నో! పట్టించుకోకపోవటం కాదు. నిజంగానే ఎంత ఆలోచించినా నీ ప్రశ్న ఏమిటో నాకంతు బట్టలేదు.”

“ఈ ప్రశ్న నేను చాలా మందిని అడిగాను. దీనికే కాదు, ఇంకా చాలా ప్రశ్నలడిగినా ఎవ్వరూ జవాబివ్వరు. నా వంక పిచ్చి వాణ్ణి చూసినట్టు చూసి నవ్వి వూరుకుంటారు!”

“ఇంకా ఏమేం ప్రశ్నలు?” కుతూహలంగా అడిగింది.

“చాలా ప్రశ్నలూ సందేహాలే వున్నాయి. పుట్టలోంచి పాములు బయటికొచ్చినట్టు అవి అలా బయటికొస్తూనే వుంటాయి. ఏ ప్రశ్నలూ లేని వాళ్ళని చూస్తే నాకు చాలా అసూయగా వుంటుంది. మనమెందుకు పుట్టాం? ఎక్కడికి వెళ్తాం? అసలెందుకు చచ్చిపోవాలి? నేనెవరిని? నా జన్మ ఉద్దేశ్యం ఏమిటి? ఇలా చాలా ప్రశ్నలెందుకో నన్ను బాగా డిస్టర్బ్ చేస్తూ వుంటాయి. మీరెప్పుడైనా ఇలాటి వాటి గురించి ఆలోచించారా?”

“ఆలోచించాలనే వుంటుంది. కానీ టైమే వుండదు.” నవ్వింది.

“అంటే?”

“ఏముంది? నేనేమైనా యంగ్ బాచిలర్నా ఏమిటి? పెళ్ళై, ఇల్లూ వాకిలీ వున్న ఆడదాన్ని. ఇంటి పనీ, పిల్లలని సవరించుకోవటం, పైగా కొంచెం పోటీ వుండే వృత్తీ, అన్నీ కలిపి ఇరవై నాలుగు గంటలూ సరిపోకుండా వుంది. ఇక ఫిలసాఫికల్ ప్రశ్నలగురించి ఆలోచించే తీరికా, ఓపికా ఎక్కడుంటాయి?”

“మరి అలా వున్నందుకూ, ఎప్పుడూ చిన్న చిన్న సమస్యలు తీర్చుకోవటంలోనే రోజులన్నీ గడిచిపోతున్నందుకూ మీకేమీ బాధగా వుండదా?”

“ఎందుకుండదు? కొన్నిసార్లు చాలా ఫ్రస్ట్రేటింగ్ గానే అనిపిస్తుంది. కానీ, బహుశా ఆడదాన్నవటం వల్ల అలా ఇతరుల అవసరాలు తీర్చటంలో నా సమయం అంతా గడిచిపోవటం చాలా సహజంగా అనిపిస్తుందేమో! ఇతరులని సంతోషపెట్టాలనే

తాపత్రయం వుండటం ఆడదాని జెనెటిక్ కోడింగ్ లోనే వుంది అని ఆ మధ్య ఒక పేపరు లో చదివాను. అందుకే ఇల్లూ వాకిలీ చూసుకోవటం చిన్నతనంగా, టైం వేస్టుగా ఏమీ అనిపించదు," ఓపిగ్గా వివరించింది.

"మీరన్నది నిజమే! మా అమ్మ కూడా ఇల్లు కొంచెం మురికిగా అయినా, మేమొక్క పూట తిండి సరిగ్గా తినకపోయినా చాలా హైరానా అవుతుంది," నవ్వాడు.

నవ్వినప్పుడు ఇంకా చిన్నగా అయిన అతని కళ్ళనూ, కళ్ళ చివర్ల పడ్డ ముడతలనీ చూస్తూ "ఈ అబ్బాయి చాలా అందగాడు," అనుకుంది పూర్ణిమ అప్రయత్నంగా. అంతలోకే అలా అనుకున్నందుకు సిగ్గు పడి ఆలోచనలని మళ్ళించింది.

"నేనిలా అప్పుడప్పుడూ మీతో మాట్లాడొచ్చా?"

"తప్ప కుండా! అందులో అడగాల్సిందేముంది?"

"చాలా మంది నా మాటలనీ, కంపెనీని బోరుగా అనుకుంటారు."

నవ్వొచ్చిందామెకు.

"అదేం లేదు. నీ మాటలు నాకేమీ బోరుగా లేదు. "

"నిజంగానా? ఇదే మొదటి సారి నేనా మాట వినటం. నా స్నేహితులు నేనేదైనా చెప్పటం మొదలు పెట్టగానే మొహాలు చిట్లిస్తారు," చిన్న పిల్లాడిలా అన్నాడు.

నవ్వేసి, " అయాం ష్యూర్ యూ ఆర్ మిస్టేకెన్! ఇక బయల్దేరుదామా? నాకు టైమయ్యింది," లేచింది.

"మళ్ళీ ఎప్పుడొస్తారు లంచికి?" అతని ప్రశ్న విని ఉక్కిరి బిక్కిరయ్యింది ఏం చెప్పాలో తోచక.

"శుక్రవారం?" అతనే అన్నాడు.

"ఎక్సెలెంట్! వస్తాను."

***********************

కెఫెటేరియా నించి కేబిన్లోకొచ్చి కూర్చున్నా ఇంకా పని మీద మనసు లగ్నం చేయలేకపోతుంది. లేచి కాసేపు సీత దగ్గరకెళ్ళి కూర్చుంటాను అనుకుని కింద ఫ్లోర్ లో కెళ్ళింది పూర్ణిమ. లేబ్ లోపలికెళ్ళి గ్లాస్ తలుపు మీద చప్పుడు చేసింది. ఏదో డాటా వైపు తదేకంగా చూస్తున్న సీత తలెత్తి చూసింది. నవ్వి లోపలికి రమ్మని చేయూపింది.

"ఇవాళ లంచ్ తినటానికి కిచెన్లోకి రాలేదే?" తలెత్తకుండానే అడిగింది సీత. ఒక్కసారి తడబడింది పూర్ణిమ.

"కెఫెటేరియా కెళ్ళాను."

"ఒక్క క్షణం! ఈ డాటా లో ఒక చిన్న పాట్టర్న కొసం చూస్తున్నాను. అది దొరకగానే నీతో మాట్లాడతాను."

"నో ప్రాబ్లం! ఐ విల్ వెయిట్."

రెండు నిమిషాలయ్యాక పేపర్లూ, కళ్ళద్దాలూ పక్కన పడేసింది సీత.

"ఇప్పుడు చెప్పు, ఏమిటి వీకెండ్ కబుర్లు?"

"ఏమీ లేవు! షాపింగు, పిల్లల హోం వర్కులూ, ఇల్లు శుభ్రం చేసుకోవటం, అంతే! ఇంకేముంటాయి?" నిరాసక్తంగా అంది పూర్ణిమ.

"అంతేలే! నిన్న టీవీలో సినిమా చూసావా?"

"సినిమా కాదు కానీ, శుక్రవారం రూపిణి పాట కచ్చేరీ కెళ్ళాను. చాలా బాగా పాడింది తను. మళ్ళీ సారి నువ్వు కూడా రావాలి!"

"అబ్బా! పాటలంటే నాకు బోరు. అందులో ఆ సంగీతాలవీ నాకు అర్ధం కావు."

"తిండి తినటానికి వంటొచ్చి వుండాలా? పాట వినడానికేమిటి? నీకసలు బద్ధకం." "ఏదో నవ్వులాటకి అన్నాలే. ఈ సారి నీతో పాటు తప్పకుండా వస్తా, సరేనా?" నవ్వేసింది సీత.

"మీ బాసు ప్రమోషన్ లిస్టులో వుండలనా రోజూ ఈ మధ్య సూటులో ఆఫీసుకొస్తున్నాడు?" పూర్ణిమ ప్రశ్నతో మామూలు ఆఫీసు ధోరణిలో పడ్డారు.

"అవునవును, సైంటిఫిక్ పబ్లికేషన్లు వున్నా లేకపోయినా ఎలాగోలాగ మెట్లు ఎగబాకుతూనే వుంటాడు," నవ్వుకున్నారు.

"అసలు మా ఆఫీసులో యెంత అవుట్ డేటేడ్ సాఫ్ట్ వేర్ వుంటుందో తెల్సా? వీళ్ళ చెత్త ట్రిప్పులకి బడ్జెట్ లోటుండదు కానీ, సాఫ్ట్ వేర్ లైసెన్సులకి మాత్రం ఎక్కళ్ళేని బడ్జెట్ సమస్యలూ వస్తాయి."

"సాఫ్ట్ వేర్ అంటే గుర్తొచ్చింది. మొన్న ప్రోగ్రాంలో ప్రాబ్లం ఫిక్స్ చేసావా?"

"ఆహా చెయ్యటమూ అయింది! అది మళ్ళీ మొత్తం చేయాలని అనుకోవటమూ అయింది."

"వెరీ సాడ్! సరే, మరి నేనొస్తా. ఇప్పటికే మా లేబ్ లో జనం నేను తప్పి పోయాననుకుంటున్నారేమో!"

"రేపు పొద్దున్న కలుద్దాం! బై", పడేసిన పేపర్లందుకుంటూ అంది సీత.

సీతలో ఆ ప్రొఫెషనలిజమూ, తన వృత్తిమీద ఆమెకుండే కార్యదీక్ష చాల నచ్చుతాయి పూర్ణిమకి. ఎన్నోసార్లు ఆఫీసు పనిలోనో, రాజకీయాలతోనో నిరాశగా అనిపించినా ఇద్దరూ ఒకరితోఒకరు మాట్లాడుకొని రీచార్జ్ అవుతారు.

లేబ్ లో కొచ్చి పనిలో పడింది.

"మీతో గడిపిన గంటసేపు నాలో నాలుగు రోజులనించీ సుగంధాలని నిపింది, మధ్యాహ్నం లంచి కొస్తారు కదూ?"

శుక్రవారం పొద్దున్నే ఈ మెయిల్ లో మెసేజీ చూసుకుని కొంచెం ఇబ్బంది పడింది పూర్ణిమ. ఈ అబ్బాయి మనసులో వేరే ఏమైనా ఉద్దేశ్యాలున్నాయా ఏమిటి? ఆమె ఆలోచనలో పడింది. ఛా! తన గురించి ఈ వయసులో తప్పుడు ఆలోచనలు ఎవరు చేస్తారు. సర్ది చెప్పుకుంది.

మధ్యాహ్నం కెఫెటేరియాలో అరుణ్ ని కలిసింది పూర్ణిమ. కొంచెం పాలిపోయిన మొహంతో చికాగ్గా వున్నాడెందుకో.

"హలో అరుణ్! ఏమిటి డల్ గా వున్నావు?"

"ఏం లేదు. కొంచెం ఆఫీసులో వత్తిడి గా వుందంతే. అన్నట్టు ఈ చీర మీకు చాలా బాగుంది."

ఒక్క క్షణం అతని మొహాన్ని పరిశీలించింది ఏ ఉద్దేశ్యంతో అన్నాడా అని. అతని మొహం చాలా అమాయకంగా మామూలుగానే వుంది. నిట్టూర్చింది.

"థేంక్స్!"

"నాకీ నీలం రంగంటే చాలా ఇష్టం."

చాలా సేపు ఆఫీసు విషయాలే చెప్పాడు. అతను చెప్తున్న విషయాలని విని ఆశ్చర్య పోయినా కొంచెం కొంచెం అతని సమస్య అర్థమవుతున్నట్టనిపించింది.

అతను విపరీతమైన ఆత్మ న్యూనతతో బాధ పడుతున్నాడు. తనకి తెలివి లేదనీ, తనని ఎవరూ ప్రేమించరనీ, తనని అందరూ పనికి రాని వాడి కింద జమ కడుతున్నారనీ, చాలా అపోహలే వున్నాయతనకి. అయితే ఆ అపోహలకి ఆధారం ఏమిటో మాత్రం అర్థం కాలేదు.

ఆ రోజు రాత్రి శివతో చెప్పింది ఆ అబ్బాయి విచిత్రమైన భయాల గురించి. అంతా విని శివ, "ముందు నువ్వు కొన్ని రోజులు కేవలం అతను చెప్పేది ఏమీ వ్యాఖ్యలు చేయకుండా విను. అలా మాట్లాడుతుంటే అతని ఆలోచనలని అతనే విశ్లేషించుకుంటాడు. అతనికే అతని అభిప్రాయాలు తప్పని అర్థం అవుతుంది," అన్నాడు.

*******************

శివ సలహా ప్రకారం క్రమం తప్పకుండా అరుణ్ ని కలుస్తూ అతని మాటలు వింటోంది పూర్ణిమ, "ఈ మధ్య నువ్వు నాతో లంచ్ చేయటం లేదు" అని సీత గోల పెడుతున్నా కూడా.

ఆతని మాటలనీ ప్రవర్తననీ అర్థం చేసుకోవడానికి దాదాపు రెండు మూడు నెలలుపట్టిందామెకి. అప్పటికి అర్థం అయిందామెకి, అతను ఒక రకమైన డిప్రెషన్ తో బాధ పడుతున్నాడనీ, అదీ చాలా తీవ్ర స్థాయిలో వుందనీ.

"నేను సైకియాట్రిక్ కన్సల్టేషన్ లో వున్నాను తెలుసా?" అని ఉన్నట్టుండి అడిగితే నివ్వెరపోయింది. అందుకేనన్నమాట ఆ నిరాశా, ఆత్మ న్యూనత. ఆమెకి మనసంతా జాలితో నిండి పోయింది.

"నేను చాలా తెలివి తక్కువ వాణ్ణి. నాలాటి వాళ్ళు ఈ పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోలేక కింద పడిపోతూ వుంటాము. నేను చచ్చిపోతానేమో," దుఃఖంతో అతని గొంతు పూడుకుపోయింది ఒకరోజు మాటల్లో.

“లేదు అరుణ్! నీకేం కాలేదు. శరీరానికి అప్పుడప్పుడూ జబ్బు చేసినట్టే, కొన్నిసార్లు మెదడుకీ జబ్బు చేస్తుంది. మెదడులో వాటంతటవే పుట్టాల్సిన రసాయనాలు పుట్టకపోవటం వల్ల వచ్చే మూడ్ డిజార్డర్, అంతే. మంచి మందులు వాడుతున్నావు కదా? తగ్గిపోతే ఈ నెగెటివ్ ఆలోచనలన్నీ మాయమయి పోతాయి.”

డిప్రెషన్ గురించి తను ఇంటర్నెట్ లో చదివిన సమాచారమంతా గుర్తు తెచ్చుకుంటూ చెప్పింది అనునయంగా.

అంతలోనే తెలివిగా, అంతలోనే అమాయకంగా, అంతలోనే మంచివాడిగా, అంతలోనే మూర్ఖంగా వుండే అతని ప్రవర్తన చాలా సార్లు ఇబ్బంది పెట్టింది.

“ఇవాళ మధ్యాహ్నం కేంటీన్ కి లంచికొస్తారా” అని రిక్వెస్టు చేసి రాకుండా తనొక్కతీ కేంటీన్లో అర గంట ఎదురుచూసి, “ఎందుకు రాలేదని” అడిగితే, “మరచిపోయాను” అని నిర్లక్ష్యంగా అన్నప్పుడు మాత్రం కోపం పట్టలేకపోయింది.

“చూడూ! నేను చాలా బిజీగా వుంటాను. అయినా ఏదో నీ మీద జాలితో, నీకు సహాయం చేద్దామని ఆరాట పడుతున్నాను. ఇంకేప్పుడూ ఇలా నా టైం వేస్ట్ చేయకు,” తీవ్రంగా మందలించి వచ్చింది.

“మీరు నన్ను ఎక్స్ ప్లాయిట్ చెయ్యాలని చూస్తున్నారా?” ఉన్నట్టుండి అడిగాడొక రోజు. ముందు తెల్లబోయింది. ఆ తర్వాత కోపం ముంచుకొచ్చింది. చెంప ఛెళ్ళుమనిపిద్దామనుకుంది. కానీ అతని ఆలోచనలమీద అతనికెలాటి నియంత్రణా లేదని గుర్తొచ్చి తమాయించుకుంది.

“ఎందుకలా అనుకుంటున్నావు?” సౌమ్యంగా అడిగింది.

“మొన్న ఎందుకు బాంకుకి వెళ్ళటానికి కార్లో లిఫ్టు అడిగారు?” చిన్నపిల్లాడిలా అన్నాడు.

“నిజంగా అర్జంటుగా బాంకుకి వెళ్ళాల్సొచ్చి. అసలిది చెప్పు ముందు. నిన్నెవ్వరూ ఏ సహాయమూ అడగకపోతే, నిన్నెవ్వరూ నమ్మరనీ, నిన్ను గౌరవించరనీ బాధపడతావు. ఏదైనా సహాయం అడిగితే అనుమానంగా చూస్తావు. అసలు నీ చుట్టూ వున్న వాళ్ళనించి నీకేం కావాలి అరుణ్?”

“…………………”

“ అయితే ఒకటి గుర్తుంచుకో. నీకు చుట్టూ వున్న మనుషుల దగ్గర్నుంచి ఏం ఆశిస్తున్నావో అదే నువ్వూ వాళ్ళకివ్వాల్సి వుంటుంది.”

“అంటే?”

“అంటే, నీకు ఇతర్లనించి నమ్మకమూ గౌరవమూ కావాలనుకో, ముందు నువ్వు ఇతర్లని నమ్మి గౌరవించాల్సి వుంటుంది. నువ్వు పక్క మనిషిని అడుగడుగునా అనుమానిస్తూ, పక్క మనిషి నీ మీద నమ్మకముంచాలంటే అది అయ్యే పని కాదు. నువ్వు ప్రపంచానికేది ఇస్తే నీకదే తిరిగొస్తుంది. ఇప్పుడు చెప్పు, ప్రపంచం నించి నీకేం కావాలో.”

“నాకేం కావాలో, నేనెవరినో నాకేమి తెలియటం లేదు పూర్ణిమా!” ఉన్నట్టుండి చేతుల్లో మొహం దాచుకొని బావురుమన్నాడు.

కంగారు పడింది పూర్ణిమ. ఆమె మనసంతా జాలితో నిండి పోయింది.

“పోనిలే అరుణ్! నీకు మనసు బాగాలేదు. ఇప్పుడు ఆలోచనలేమీ వొద్దు. వదిలెయ్యి. కంట్రోల్ యువర్ సెల్ఫ్, ప్లీజ్! చూడు! కేంటీన్లో అంతా మన వైపే చూస్తున్నారు."”

“అయాం సారీ. అసహ్యంగా చిన్న పిల్లాడిలా బిహేవ్ చెస్తున్నాను.” చుట్టూ చూసి సిగ్గు పడి మొహం తుడుచుకున్నాడు.

“ దట్స్ ఆల్ రైట్. ఈ విషయాలన్నీ తర్వాతెప్పుడైనా మాట్లాడదాం, సరేనా!” మెల్లిగా అతన్ని మామూలు మనిషిని చేయటానికి ప్రయత్నించింది. ఆ రోజంతా ఆమెకి చాలా దిగులుగా భయంగా అనిపించింది, "అసలీ అబ్బాయి ఎప్పటికైన మామూలుగా అవుతాడా లేదా," అని.

************************

చలికాలం ముసురుకొని ఉక్కు కౌగిట్లో అందర్నీ బంధించి గజ గజలాడిస్తుంది. చుట్టూ వున్న వాతావరణం లాగే మనసంత ఒక రకమైన దిగులుతో గ్లూమీ గ వుంది.

వంట చేస్తూ ఆలొచనలో వుంది పూర్ణిమ. గత నాలుగైదు నెలలుగా తన మానసిక స్థితి తలచుకుంటే నమ్మలేకుండా వుందామెకు. ఎప్పుడూ వుండే అలసటా, చిరాకూ, కోపం మాయమయ్యాయి. ఎప్పుడూ లేనిది ఆఫీసుకెళ్ళాలంటే ఉత్సాహంగా ఉంటోంది.

రోజూ ఉదయం వెళ్ళే సరికి అరుణ్ దగ్గర్నించీ వచ్చే ఈ మెయిల్లూ, అతను తన కొరకు ఎదురు చూడడం, కలిసి భోజనం చేయడం, కాఫీ కెళ్ళడం అన్నీ చాలా సంతోషాన్నిస్తున్నాయి. తన ఉనికీ, స్నేహమూ తనకేమీ కాని ఇంకొక మనిషికి అంత బలాన్ని ఇచ్చి ఉత్సాహం నింపగలదని ఆమె ఎప్పుడూ అనుకోలేదు. ఆ ఊహే ఆమె ఈగోని చాలా తృప్తి పరుస్తూంది.

ఇంతకు ముందులా నీహారిక తోటీ, శివా తోటీ సమయం గడపాలన్న తాపత్రయం లేదు. నీహారిక కయితే తల్లి తననిలా ఇగ్నోర్ చేసి తన పనులు తను చేసుకోవటం, తనదైన ప్రపంచంలో మునిగిపోవటం కొంచెం కూడా నచ్చలేదు.

తన ఆలోచనలన్నీ  అరుణ్ చుట్టే  అసంకల్పితంగా తిరుగుతున్నాయన్న విషయాన్ని ఆమె గుర్తు పట్టింది కూడా. అది కొన్నిసార్లు ఆమెని ఒకరకమైన అపరాధ భావనకి లోను  చేస్తోంది.

నిద్రలో పీడకలొచ్చి ఉలిక్కి పడి భయంతో తల్లి చేయ పట్టుకున్న చంటి బిడ్డలా తన చేయి పట్టుకుని వదలనంటున్నాడు. ఎందుకు తనమీద అంతటి నమ్మకమూ, అభిమానమూ పెంచుకున్నాడో మరి.

"అతని సంగతి సరే! నువ్వెందుకు అతనితో స్నేహం చేస్తున్నావో తెలుసా?" మనసునించి ప్రశ్న వచ్చేసరికి తడబడింది.

"కిందపడ్డ మనిషికి సానుభూతితో చేయందించి లేపినట్టే నేనతనికి సహాయం చేయటం కోసమే అతని స్నేహాన్ని ప్రోత్సహిస్తున్నాను," ఎప్పట్లాగే ఆమె తన మనసుకి సంజాయిషీ ఇచ్చుకుంది. అందగాడూ, యువకుడూ కాకుండా వుండి వుంటే తనంత సానుభూతితో వ్యవహరించేదా? నిర్దాక్షిణ్యంగా ఆమె అంతరంగం ఆమెని అడుగుతూనే వుంది, ఆమె జవాబివ్వకుండా తప్పించుకుంటూనే వుంది. ఇదే మొదటిసారి, ఆమె తన అంతరాత్మ ముందు గిల్టీగా తల దించుకోవడం.

********

ఉన్నట్టుండి మొబైల్ ఫోన్ లో మెసేజీ అలర్ట్ రావటం తో వంటింట్లోంచి బయటికొచ్చింది. "నన్ను క్షమించు. నువ్వు ఇంత సహాయం చేస్తున్నా, నా చేయి వదలకుండా పట్టుకున్నా, బ్రతకాలనే ఆశ అడుగంటి పోతుంది. ఇందులో నీ తప్పు కానీ, మా అమ్మా నాన్నల తప్పు కానీ ఏమీ లేదు. నేనే బ్రతకటానికి యోగ్యత లేని వాణ్ణి. గుడ్ బై." అరుణ్ మెసేజీ చూసి గుండాగి పోయినంత పనైపోయింది పూర్ణిమకి.

ఈ అబ్బాయి ఏం అఘాయిత్యం చేస్తున్నాడో. ఇంట్లో అమ్మా నాన్నా పెళ్ళికెళ్ళారనీ, రేపు రాత్రికి కానీ రారనీ చెప్పాడు మధ్యాహ్నం. ఇంట్లో ఒంటరిగా ఏం చేస్తున్నాడో ఏమో! ఎలా ఆపాలి! శివా ఏం చేస్తున్నాడో చూద్దామని బెడ్ రూంలోకెళ్ళింది. స్నానం చేస్తున్నట్టున్నాడు.

బాత్రూం తలుపు మీద దబ దబా బాదింది, "త్వరగా బయటికి రండి," అంటూ. ఆమె గొంతులో వున్న టెన్షన్ చూసి బయటకొచ్చాడు శివ, ఏమయిందంటూ. మౌనంగా మొబైల్ ఫోన్ అందించింది.

"ఓ గాడ్! వుండు. నువ్వు కంగారు పడకు.నేను చూస్తాను సంగతేమిటో."

వెంటనే అరుణ్ నెంబరుకి ఫోన్ చేసాడు శివ. నాలుగైదు రింగులైనా ఫోనెత్తకపోయేసరికి నరాలు తెగిపోయేంత టెన్షన్. ఆఖరికి ఫోనెత్తిన ధ్వని!

"హలో అరుణ్!"

"హలో" ఎక్కడో నూతిలోంచి వస్తుంది స్వరం.

"అరుణ్! ఆర్యూ ఆల్రైట్? పూర్ణిమ చాలా కంగారు పడుతోంది."

"అయాం వెరీ సారీ. మిమ్మల్ని కంగారు పెట్టటానికి నేనా మెసేజీ ఇవ్వలేదు. నిజంగానే నాకు బ్రతకాలని లేదు," అవతలినించి వెక్కిళ్ళతో ఏడుస్తున్న శబ్దం.

మెల్లిగా మంద్ర స్వరంతో అన్నాడు శివ, “సరే! నీ ఇష్టం. ఇప్పుడు మాత్రం ఏమీ ఆలోచించకు. మేమిద్దరం మీ ఇంటికొస్తాం. ఈ రాత్రి మాతోనే వుందువుగాని.”

“నో, నో! మిమ్మల్ని ఇబ్బంది పెట్టటం నా కిష్టం లేదు. అయాం ఒకే. రేపు తప్పకుండా పూర్ణిమని ఆఫీసులో కలుస్తాను.” గిల్టీగా అన్నాడు.

“సరే అలాగే కానీ.అయితే ఒక్క మాటివ్వాలి.”

“చెప్పండి, ఐ ప్రామిస్.”

“రాత్రి ఏ వేళయినా సరే దిగులనిపిస్తే మాకు ఫోన్ చేయాలి. సరేనా?”

“సరే.”

“మందులేసుకొని పడుకో మరి.” శివ గొంతులోని కమాండ్ కి లొంగిపోయాడు.

**************

“అతను దేనికంత దిగులు పడుతున్నాడు?”

“అతనిది మామూలు మూడీనెస్ కాదు. అతను క్లినికల్ డిప్రెషన్ తో బాధపడుతున్నట్టున్నాడు.”

“ఏమిటీ?” శివా గొంతులో ఆశ్చర్యం.

లేచి లేప్టాప్ తెచ్చి తను మూడ్ డిజార్డర్ ల గురించి సేకరించిన సమాచారాన్ని చూపించింది.

సాధారణంగా అందరమూ కొన్నిసార్లు సంతోషంగా, కొన్నిసార్లు దిగులుగా వుంటాము. అయితే మితిమీరిన దిగులునూ, ఆత్మ హత్యలక్కూడా దారితీసే దుఃఖాన్నీ సైకలాజికల్ డిజార్డర్ (మానసిక వ్యాధి) గా గుర్తిస్తారు డాక్టర్లు. ఈ దిగులు నెలలూ, సంవత్సరాల తరబడీ మనిషిని కృంగాదీస్తుంది. దిగులుగా వుండడానికి పెద్ద కారణాలు కూడా వుండవు. కారణలు వెతుక్కుని మరీ ఈ దిగులు మనసులో ఎక్కి కూర్చుంటుంది.

వైద్య పరిభాషలో చెప్పాలంటే మెదడు తనకి కావాల్సిన రసాయనాలని (న్యూరో ట్రాన్స్మిట్టర్లు) తనే తయారు చేసుకోవటంలో విఫలమైనప్పుడు సాధారణంగా వుండే ఉత్సాహమూ, సంతోషమూ, సంతృప్తీ మొదలైన భావనలు మాయమఔతాయి. దాంతో మనిషికి ఏ పనీ చేయబుద్ధికాని ఒకలాటి నిస్తేజమూ, నిర్వేదమూ ఏర్పడతాయి. దాంతో మెదడులో సంతోషాన్ని కలగజేసే రసాయనాలు ఇంకా తగ్గిపోతాయి. అదొకరకమైన విష వలయంలోకి వెళ్ళి పోతాడు రోగి.

ప్రపంచ వ్యాప్తంగా, ఎక్కువగా అభివృద్ధి చెందిన దేశాల్లో దాదాపు ముప్ఫై శాతం యువతీ యువకులు డిప్రెషన్ బారిన పడి పండంటి జీవితాలని వృధా చేసుకుంటున్నారు. ఆంటీ- డిప్రెసెంట్లు వాడుతూ, సైకో థెరపీలు చేస్తున్నా, ఈ వ్యాధి గుణమవడం కొంచెం కష్టమే.

"అందులో మన దేశం లాటి చోట్ల సైకియాట్రిస్టు ని సంప్రదించడం అన్నది పరువు తక్కువ విషయంగా కూడా భావిస్తారు." చదువుతూ బాధగా అంది పూర్ణిమ.

ఆ రోజు భోజనాల దగ్గరా, వంటిల్లు సర్దుతున్నంత సేపూ శివా ఎన్నడూ లేనంత మౌనంగా వున్నాడు. పిల్లలు వాళ్ళ గదిలోకి వెళ్ళింతర్వాత అడిగింది శివాని, పూర్ణిమ,

"అరుణ్ కి సహాయం చేస్తూ నేనేమైనా పొరపాటు చేస్తున్నానా?"

కాసేపు ఏమీ మాట్లాడలేదు శివ. ఆమె వైపు చూసాడు.

"కావాలని తప్పులు చేసే మనస్తత్వం కాదు నీది. చేసే ప్రతీ పనినీ ఎంతో విశ్లేషించుకుంటే కాని చేయవు. కానీ మనసు సరిగ్గా లేని అబ్బాయితో జాగ్రత్తగా వుండు, మరి. అసలే నువ్వు కూడా చాలా సున్నితమైన మనసున్నదానివి. ఏదైనా చిక్కుల్లో ఇరుక్కుంటావేమోనని కొంచెం అనీజీనెస్. అంతే."

"అయితే అతన్ని దూరంగా వుంచనా?"

"ఇప్పుడు కాదులే. ఇంకొద్ది రోజులవనీ. లేదా ఆఫీసులో ఒంటరిగా మాట్లాడడం కాకుండా అప్పుడప్పుడూ మనింటికి రమ్మను. అప్పుడు నువ్వొక్కదానివే కాకుండా మన ఇంటిల్లిపాదితో స్నేహంగా వుండి కోలుకుంటాడేమో."

"అవును! అది మంచి అయిడియా. శనివారమో ఆదివారమో రమ్మంటాను."

***********************

అర్ధరాత్రి టెలిఫోన్ మోతకి విసుగ్గా కళ్ళు తెరిచింది పూర్ణిమ. శివా వంక చూసింది. గాఢ నిద్రలోవున్నట్టున్నాడు. ఇప్పట్లో ఫోన్ ఎత్తడు. తనే విసుక్కుంటూ లేచింది.

"హలో పూర్ణిమా!" అవతల రాజారావు గొంతు. ఆమె జవాబివ్వకముందే, "అరుణ్ మీ యింటి నుంచి బయల్దేరాడా? ఇంతవరకూ ఇంటికి రాలేదు." ఆదుర్దాగా అన్నాడు.

ఆ రోజు అరుణ్ ని రాత్రి డిన్నర్ కి పిలిచింది. ఎనిమిదింటికి అందరూ కలిసి భోజనం చేసింతరువాత వెళ్ళి పోయాడు అరుణ్. ఇంటికెళ్ళకుండా ఎక్కడికెళ్ళినట్టు?

"ఇంకా ఇంటికి రాలేదా? ఇక్కడ నించి ఎప్పుడో తొమ్మిదింటికే బయల్దేరి వెళ్ళి పోయాడు."

"ఇంకా ఇంటికి రాలేదు. మొబైల్ ఫోన్ కూడా ఆఫ్ చేసి వుంది."

వెనకాల రేవతి ఏడుపు వినిపిస్తోంది సన్నగా. ఎక్కడికెళ్ళాడు? ఏం చేస్తున్నాడు? ఒళ్ళు జలదరించింది పూర్ణిమకి.

శివానిని నిద్ర లేపింది పూర్ణిమ.

"ఇక్కడ తొమ్మిదింటికే బయల్దేరిన అరుణ్ ఇంకా ఇల్లు చేరలేదట. నాకేదో భయంగా వుంది."

సంగతేమిటో అర్ధం కావడానికి అతనికి అయిదు నిముషాలు పట్టింది.

“సరే! నేను వాళ్ళింటికెళ్ళి చూస్తాను, అవసరమైతే పోలీస్ కంప్లయింట్ ఇద్దాం. నువ్వు తలుపేసుకో.” లేచి షర్టు వేసుకుంటూ అన్నాడు.

ఆమెకి ఇంకా ఏమీ పాలుపోవటంలేదు.

“రాజారావు గారూ, శివా మీ యింటికి బయల్దేరాడు. ఏం చేయాలో ఆలోచిద్దాం, భయపడకండిమళ్ళీ వాళ్ళకి ఫోను చేసి యాంత్రికంగా చెప్పి ఫోన్ పెట్టేసింది.

పది నిమిషాల్లో వెనక్కొచ్చాడు శివా. ఆశ్చర్యపోయింది, పూర్ణిమ.

“అప్పుడే వచ్చేసారే?” అడిగింది తలుపు తిస్తూ.

“అతనిక్కడే వున్నాడు! సందు చివర్న తన కారాపి, కార్లో కూర్చుని యేడుస్తున్నాడు.” శివా చెప్పాడు నిస్పత్తువగా.

“ఏమిటీ?”

“లోపలికొస్తున్నాడు కారు పార్క్ చేసి. కొంచెం వేడిగా పాలో కాఫీయో ఇవ్వు. నేను వాళ్ళ నాన్నతో మాట్లాడతాను.”

మెల్లిగా లోపలికొచ్చాడు అరుణ్. ఏడ్చి ఏడ్చి మొహమంతా ఎర్రబడింది. తల దించుకుని కూర్చున్నాడు.

“ఏమయింది అరుణ్? ఇక్కడేం చేస్తున్నావు? అమ్మా నాన్నా యెంత కంగారు పడుతున్నారో తెలుసా? అసలు ఇంటికెళ్ళాకుండా ఇక్కడేం చేస్తున్నావ్?” ఎంత సౌమ్యంగా అడుగుదామనుకున్నా కోపంగా వుంది ఆమె గొంతు.

“అయాం సారీ! ఇంకోసారెప్పుడూ నిన్ను డిస్టర్బ్ చేయను. మీ ఇంటినించి వెళ్ళింతరువాత చాలా భయం వేసింది.”

“భయమా? ఎందుకు?”

“మీరు నలుగురూ ఎంత తెలివిగా చురుగ్గా వుంటారు! మీ ఇంట్లో వుంటే వెలుగుతున్న లైట్ల మధ్య కూర్చున్నట్టుంటుంది. మీలాటి తెలివైన వాళ్ళు వుండే ప్రపంచంలో నాలాటి వాళ్ళెల్లా నెగ్గుకొస్తారు? అసలు భగవంతుడిలా కొందరిని తక్కువగా ఎందుకు పుట్టిస్తాడు?”

అతని మాటలకి ఏమనాలో తోచలేదు వాళ్ళిద్దరికీ.

“సరే! కొంచెం ఈపాలు తాగి రిలాక్స్ అవు. నిన్ను ఇంటి దగ్గర దింపేస్తాను. నీ కారు రేపు తీసికెళ్ళొచ్చు.”

తలుపు చప్పుడైంది. రాజారావు వచ్చి అరుణ్ ని తీసుకొని వెళ్ళిపోయారు.

---------------------------

బస్టాపులో నించోనున్నారు, సీతా, పూర్ణిమా.

"ఈ మధ్య కలవటమే తగ్గిపోయింది మనిద్దరం," చూడగానే అంది సీత.

"అవును! నువ్వెందుకూ టైమింగ్సు మార్చావు?"

"పిల్లలిద్దరూ హిందీ ట్యూషనులో చేరారు. ఇద్దరూ పొద్దున ఏడున్నరకి ట్యూషనుకీ, అట్నుంచటే స్కూలుకీ వెళ్ళి పోతున్నారు. పొద్దున్నే పనంతా అయిపోవటంతో ఆఫీసుకి తొందరగా వొచ్చి తొందరగా వెళ్ళి పోతున్నా!"

"అందరూ ఫిజిక్సూ లెక్కలూ కెమిస్ట్రీ లకి ట్యూషనుకెళ్తుంటే మీ వాళ్ళే మిటి హిందీకి ట్యూషను?" నవ్వింది పూర్ణిమ.

"ఆ సంగతి అడక్కు! లెక్కలూ కెమిస్ట్రీ నేను చెప్తాను. ఫిజిక్సు వాళ్ళకి బానే వొచ్చు. ఎటొచ్చీ హిందీలోనే మార్కులు చూస్తే కళ్ళు తిరుగుతున్నాయి. నాకూ, ఆయనకీ ఇద్దరికీ హిందీ రాదాయె! అందుకే ఇలా కాదని ట్యూషనులో పెట్టాను!"

ఒక్కసారి కొంచెం గిల్టీగా అనిపించింది పూర్ణిమకి. తనకీ మధ్య పిల్లల చదువు పట్టించుకునే ఓపికే ఉండటం లేదు. ఇవాళ సాయంత్రం ఇంటికెళ్ళగానే తీరిక చేసుకుని ఇద్దరి పుస్తకాలూ తిరగెయ్యాలి, గట్టిగా అనుకుంది.

“నువ్వేంటి, ఈ మధ్య అరుణ్ తో లంచిలో కనిపిస్తున్నావు. ఏదైనా కొత్త ప్రాజెక్టు కొలాబొరేషనా?” అడిగింది సీత.

“అదేం లేదు. అసలతనూ నేనూ పనిచేసేది వేర్వేరు ఫీల్డుల్లో. అయితే అతనేదో సమస్యలో ఇరుక్కుని సహాయం కావాలన్నాడు. అందుకని నేనూ శివా కొంచెం హెల్ప్ చేస్తున్నాం, అంతే. “

“ఏమిటి ప్రాబ్లెం?” కుతూహలంగా అడిగింది సీత.

ఇరుకున పడ్డట్టనిపించింది పూర్ణిమకి. సాధారణంగా ఆమెకి మనుషుల వెనక వాళ్ళ గురించి మాట్లాడటం ఇష్టం వుండదు. అందులో వ్యక్తిగత సమస్యలు చర్చించటం ఇంకా ఇష్టం వుండదు. ఇప్పుడు సీత తో ఏం చెప్పి తప్పించుకోవాలి.

“ఆ… యేవో కుటుంబాల్లో వుండే మామూలు సమస్యలే. అంత ముఖ్యమైనదేమీ కాదు. ఏదో పెళ్ళి సంబంధాల గొడవ. అన్నట్టు రెండ్రోజులనిండీ అడగాలనుకొని మర్చిపోతున్నాను. మీ లేబ్ నించి కొంచెం స్పెక్ట్రోస్కోపీ డాటా కావాలి. ఎరేంజి చేయగలవా?”

“ష్యూర్! దేనికి? ఎలాటి డాటా కావాలి? మా దగ్గర వున్నదా లేదా కొత్త ఎక్స్పెరిమెంటు చేయాలా? “ తననుకున్నట్టే లేబొరేటరీ ప్రసక్తి రాగానే సీత మిగతా విషయాలన్నీ మర్చిపోయింది. ఇద్దరూ పని విషయాలూ, రాయాల్సిన పేపర్లూ మాట్లాడుకున్నారు.

“నీతో ఒక విషయం చెప్పాలని చాలా రోజులనించి అనుకొంటూ మరచి పోతున్నాను. “ వున్నట్టుండి గొంతు తగ్గించి అంది సీత.

“ఏమిటి? “

“ఎదురుగుండా, రోడ్డూ కటువైపు నిలబడి ఐ-పాడ్ చదువుతున్నాడు, అతనెవరో తెలుసా? “

కాసేపు అతన్నెక్కడో చూసినట్టనిపించి ఆలోచించింది పూర్ణిమ. గుర్తొచ్చింది!

“ తెలుసు. ఒక్కసారి కలిసాను. రూపిణి వాళ్ళింట్లో తబలా వాయించాడు. అతని పేరు..... ఏదో వుంది! గమ్మత్తైన పేరు! ఆ! గుర్తొచ్చింది. లలిత్! బేంకులో పని చేస్తున్నాడు. ఎందుకు నీకు అతను తెలుసా? “

“తెలియదు కానీ, ఈ మధ్య నాలుగైదు సార్లు మీ ఫ్రెండు రూపిణినీ అతనినీ కలిసి చూసాను, బైక్ మీద వెళ్తుంటే!“ ఆమె కంఠం అదోలా ధ్వనించింది.

“అవును, వాళ్ళిద్దరూ స్నేహితులు అనుకుంటాను. దాన్లో వింతేముంది? “

“ ఏమో లే! ఎందుకో వాళ్ళ వాలకం నాకంత నచ్చలేదు. “ మొహం చిట్లిస్తూ అంది సీత.

ఏమనలేదు పూర్ణిమ. కాసేపు ఆలోచించింది సీత. మళ్ళీ తనే అంది.

“ ఒక ఆడా-ఒక మగా కలిసి బైక్ మీద కలిసి కూర్చున్నంత మాత్రాన తప్పు పట్టే మనిషిని కాను. కానీ, వాళ్ళ ప్రవర్తనలో ఏదో అర్ధం కానిది వుంది. “

“అంటే? “

“చూడు! మామూలుగా ఆఫీసు నించి ఇంటికో, ఇంటినుంచి ఆఫీసుకో లిఫ్ట్ ఇస్తున్నాడనుకో, ఇక్కడ బస్టాపులో ఎక్కించుకుని దించి వెళ్ళడం దేనికి? ఇంటి దాకా దిగబెట్టొచ్చుగా? ఇక్కడ దిగబెడతాడు, ఇక్కణ్ణించి ఆవిడ నడుచుకుంటూ వెళ్తుంది! ఏదో ఇంట్లో వాళ్ళనించి దాచి పెడుతున్నట్టు. “

వాళ్ళు మాటల్లో వుండగానే వొచ్చింది రూపిణి. అలంకరణ ఎప్పట్లాగే వున్నా మొహం అదో రకమైన అందంతో వెలిగిపోతోంది. నవ్వు మొహంతో ఏదో చెప్తూ లలిత్ వెనక బైక్ మీద కూర్చుని వెళ్ళిపోయింది. నిజంగానే వాళ్ళ బాడీ లాంగ్వేజీ స్నేహితుల కంటే గాఢమైన చనువునే సూచిస్తుంది.

నిట్టూర్చింది పూర్ణిమ. ఆమెకి కొంచెం బెంగగా అనిపించింది. రూపిణి చాలా హుందాగా ప్రవర్తించే స్త్రీ. టీనేజీలో వుండి కాలేజీలో చదువుతూ, హాస్టల్లో వున్న కూతురుంది ఆమెకి. ఇప్పుడీ స్నేహంతో కాపురంలో కలతలు తెచ్చుకుంటుందా? అంతలోకే నవ్వొచ్చింది, తన ఆలోచనలెంత దూరం ప్రయాణిస్తున్నాయో చూసి.

***********

ఇంటికెళ్ళగానే అనుకున్నట్టు కాఫీ తాగి పిల్లల పుస్తకాలు చూడాలని, సంజూని నీహారికనీ పిలిచింది పూర్ణిమ.

” లే సంజూ! కంప్యూటర్ మీది నించి లేచి మేత్స్ టెక్స్ట్ బుక్ తీసుకొని రా! .”

గునుస్తూనే వెళ్ళి పుస్తకాలు పట్టుకొచ్చాడు సంజూ. వాడి నోట్ బుక్కు చూసి కళ్ళు తిరిగినట్టయ్యింది ఆమెకి.

” ఏంట్రా ఈ లెక్కలు? అసలు టీచరు క్లాసుకొస్తుందా రాదా? ఇవన్నీ ఇలా తప్పులయ్యాయేంటీ? కోపంగా అడిగింది.”

”మేత్స్ వదిలేయ్! ఇంగ్లీషు చూడు, ఎన్ని మార్కులొచ్చాయో! ” గంతులేస్తూ అన్నాడు.

”ఇంగ్లీషు సరే! లెక్కలు రాకపోతే నన్నో నాన్ననో అక్కనో అడగాలి కాని ఇలా నోటి కొచ్చినట్టు రాస్తావా? ఇన్నిన్ని తప్పులుంటే అసలు మీ టీచరు దిద్దనేలేదేమిటి? ”

"నిన్నే అడిగానమ్మా! కానీ నువ్వా రాత్రంతా అరుణ్ అంకుల్ తో ఫోన్లో మాట్లాడుతున్నావు. ఆ తర్వాత అరుణ్ అంకుల్ వాళ్ళ అమ్మా నాన్నతో మనింటికి డిన్నర్ కొచ్చారు. నాన్నేమో వూళ్ళో లేడు."

నిజమే, ఒక విషయం మీద శ్రద్ధ చూపిస్తే ఇంకోటి చేయి జారిపోతుంది.

అరుణ్ తో స్నేహం, అతన్ని ఆదుకోవటం, అతనికి మానసిక స్థైర్యం ఇవ్వటం లాటివి రోజులో కొంత భాగం ఆక్రమించేసరికి, ఇంటి పనీ, పిల్లల చదువూ, ఆఫీసూ వెనకపడుతున్నాయి. తనకెందుకొచ్చిన గొడవ!తన పన్లన్నీ తన కంట్రోలులోకి తెచ్చుకోవాలి ముందు.

" సరే! ఇప్పుడు అన్నీ క్లియర్ చేసుకుందాం. ఒక్కొక్క చాప్టరులో నీకు రాని లెక్కలన్నీ గుర్తు పెట్టు. వారానికొక్కటి చొప్పున చేసేద్దాం, సరేనా? "

"నాట్ టుడే! ప్లీజ్! క్రికెట్ ఆడుకోవాలి. ఆదివారం మేచ్ కూడా వుంది. " తల్లి మెడ చుట్టూ చేతులేసి ఊగుతూ గారాబంగా అన్నాడు.

"ఆరో తరగతి కొచ్చి అమ్మతో ముద్దులు చేస్తూ, సిగ్గు లేదురా నీకు! అన్నట్టు అక్కగారింకా రావటం లేదే? " కొడుకుని ముద్దు పెట్టుకుంటూ అంది.

"నువ్వు ముద్దులు పెడ్తూ నన్నంటావెందుకు? ఐ డోంట్ లైక్ యువర్ ముద్దులు! " చెంప తుడిచేసుకుంటూ అన్నాడు పదకొండేళ్ళ సంజూ. నవ్వుతూ సోఫా లోంచి లేచింది పూర్ణిమ.

"క్రికెట్ ప్రాక్టీసునించి వచ్చాక లెక్కలు అర గంటైనా చేయకపోతే వూరుకునేది లేదు, తెలిసిందా? " అంటూ వంటింట్లోకి వెళ్ళింది.

"ఇవాళ తొందరగొచ్చినవమ్మ? " వంటింట్లో అంట్లు తోముతున్న రాజమ్మ పరామర్శించింది.

"అవును రాజమ్మా. ఆఫీసులో మధ్యాహ్నం సెలవు పెట్టాను. బయట కొంచెం పని చూసుకొని తొందరగా వొచ్చేసాను. అందుకే హాయిగా వుంది. "

"మా పిల్లోడు కూడా మీ లెక్కనే బాగా చదువుకొని మీ ఆఫీస్లనే వుద్యోగం చేస్తడంట " రాజమ్మ గొంతులో కించిత్ గర్వం.

రాజమ్మ కొడుకు అశోక్ అక్కడే స్కూల్లో చదువుతున్నాడు. రాజమ్మ భర్త రమణయ్య లేబొరేటరీలో అటెండరు. రెండేళ్ళ కింద వున్నట్టుండి ఒక రోజు విరుచుకొని పడిపోయి మరిక లేవలేదు. కావాలంటే అతని వుద్యోగం పదో తరగతి చదువుతున్న కొడుక్కిస్తానన్నారు యాజమాన్యం.

"చక్కగా చదువుతున్న పిల్లవాణ్ణి ఇప్పుడు అటెండరు చేయకపోతే ఏం మునిగిపోదులే, కావాలంటే నువ్వే నాలుగిళ్ళల్లో పనిచేసుకొని వాణ్ణి చదివించు. సెంట్రల్ స్కూల్ కావటంతో ఫీజులు కూడా లేవు " అని పూర్ణిమా, సీతా అంతా సలహా



కౌముది

ఇవ్వటంతో తనే పని చేసి వాణ్ణి చదివిస్తోంది రాజమ్మ. సాయంత్రం ఆరింటిలోపల వున్న నాలుగిళ్ళల్లో పని ముగించి, తన ఇంటి ముందు కూరగాయలూ, పూవ్వులూ కూడా అమ్ముతుంది రాజమ్మ.

"అది చాలా మంచి ఆలోచన రాజమ్మా! ఎంత, ఇంకొక నాలుగేళ్ళల్లో చదువైపోయిందనుకో. ఉద్యోగం చూసుకున్నాడంటే నీ కష్టాలు గట్టెక్కినట్టే! "

" అమ్మా! నీకే ఫోన్!" నీహారిక ఫోన్ తెచ్చి ఇచ్చింది.

"నువ్వు మేత్స్ బుక్కు తీసుకొని రానే లేదింకా!" ఫోన్ తీసుకుంటూ అంది పూర్ణిమ. నీహారిక విననట్టే వెళ్ళిపోయింది.

"పూర్ణిమా!" అరుణ్ వాళ్ళమ్మ రేవతి గొంతు వినిపించింది కంగారుగా.

"చెప్పండి! ఏంటిలా ఫోన్ చేసారు?"

"ఏం లేదమ్మా. అరుణ్ ని ఇవాళ ఆస్పత్రిలో చేర్పించాం."

" ఆస్పత్రిలోనా? ఏందుకు? ఏమయింది? " అయోమయంగా అడిగింది. ఆ వేళంతా అరుణ్ దగ్గర్నించి ఫోనూ, మెయిలూ లేకపోతే, ఎందుకో అనుకుంది.

"నిన్న ఎప్పట్లాగే సైకియాట్రిస్టు అప్పాయింట్మెంట్ కి వెళ్ళాం. ఆ తర్వాత ఆయన మా ఇద్దర్నీ పిలచి, వాణ్ణి హాస్పిటల్ లో సైకియాట్రీ వార్డులో అడ్మిట్ చేయక తప్పదన్నారు. "

ఆవిడ గొంతులో నొక్కి పట్టిన కన్నీళ్ళు. ఇరవై ఆరేళ్ళ కొడుకుని మెంటల్ హాస్పిటల్ లో చేర్పిస్తే ఆ తల్లి మనసెలా వుండి వుంటుందో పూర్ణిమ ఊహకందలేదు.

"ఒక్క సారి నువ్వు వీలైతే వచ్చి చూస్తావా? " మళ్ళీ ఆవిడే అడిగారు.

"తప్పకుండానండి! శివా రాగానే ఇవాళో రేపో వస్తాను. అరుణ్ ఎలా వున్నాడు? "

"ఏమో నాకేం తెలియటం లేదు. వాడేమో చచ్చిపోతానంటూ ఒకటే ఏడుపు! అసలీ జబ్బేమిటో, ఇది వాడికే ఎందుకు వచ్చిందో, దాన్లో నాదేమన్నా బాధ్యత వుందో నాకర్థం కావడంలేదు. "

"మీరలాగేం అనుకోకండి. చాలాసార్లు జీవితం లో జరిగే సంఘటనల్లో మన ఇష్టాయిష్టాలకి చోటుండదు. మనకందిన వాటిని అంగీకరించాలంతే. అంతకంటే మనకి వేరే చాయిస్ ఏముంది చెప్పండి? ఇలా నాకే యెందుకు జరిగింది అన్న ప్రశ్నకి సమాధానమే లేదు. "

" అవును పూర్ణిమా. సరే వుంటాను. వీలైనప్పుడు రా. "

పూర్ణిమకి మనసంతా ఒక లాటి దిగులు కమ్ముకుంది. అందమైన అరుణ్ ముఖం కళ్ళ ముందు కదిలినట్లైంది.

మళ్ళీ ఫోన్ మోగింది.

" పూర్ణిమా! "

” అరుణ్! ఎలా వున్నావు. ప్లీజ్, భయపడకు, నీకేం కాదు. ” తననితను కంట్రోల్ చేసుకోవటానికి ప్రయత్నించింది.

” పూర్ణిమా! నాకు పుర్తిగా పిచ్చెత్తింది కదూ? అందుకే నన్ను హాస్పిటల్లో అడ్మిట్ చేసారు. రేపు ఎలెక్ట్రిక్ షాక్ ఇస్తారట. వాళ్ళిదంతా సైకలాజికల్ డిజార్డర్ అనుకుంటున్నారు, కాని నిజం నాకు తెలుసు పూర్ణిమా! నేను తెలివి తక్కువ వాణ్ణి. నా మెదడు రిపేరు చేసే అవకాశం వుంటే బాగుండు.అంతే కాని, నాకు మానసిక వైద్యం చేసి యే ప్రయోజనమూ లేదు. ”

అతను ఎప్పటి లాగే అన్నాడు.

” సరే అరుణ్! నీ సమస్యేమిటో మనకంటే డాక్టర్లకి బాగా తెలుస్తుంది కదా? వాళ్ళకి వదిలేసి నువ్వు బాగా రెస్టు తీసుకో! ”

” ఇక్కడ నా మనసులో చాలా చీకటి గా వుంది పూర్ణిమా. నాకు చాలా భాయం వేస్తుంది. తెలివి లేని వాళ్ళు ప్రపంచంలో బ్రతకలేరా? నాకు తెలివి లేదు. నన్ను చచ్చిపోనివ్వరు. నాకు బ్రతకటం చేత కాదు. ” అతను వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. ఆమెకి ఏమనాలో తోచటం లేదు.

” ప్లీజ్ పూర్ణిమా! నా చేయి వదలకుండ నువ్వు పట్టుకుంటావు కదూ? నన్ను వదలకు పూర్ణిమా. నువ్వు తప్ప ఈ ప్రపంచంలో నాకింకెవరూ లేరు! నువ్వున్నావన్న ధైర్యంతోనే నేను బ్రతికున్నాను. నన్నెప్పుడూ వదలిపెట్టకు. ఒంటరిగా నేనీ ప్రపంచంలో బ్రతకలేను! ”

పూర్ణిమకి మతి పోయింది. ఏం మాట్లాడుతున్నాడు? తనేం అంటున్నాడో అతనికి తెలుస్తోందా?

” పూర్ణిమా, ఎవరినించి ఫోన్? ” శివా తలుపు తెరుచుకొని లోపలికొచ్చాడు.

అయోమయంగా చూసింది అతని వైపు.

“అరుణ్ ని ఆస్పత్రిలో సైకియాట్రిక్ వార్డులో చేర్చారట. రేవతి గారు ఫోన్ చేసి చెప్పారు.”

“అయ్యో! వాళ్ళెంత బాధ పడుతున్నారో!”

“ఒక్క సారి వెళ్ళొద్దామా?”

“అలాగే. రేపు సాయంత్రం వెళ్దాం.”

“రేపా? ఇప్పుడే వెళ్దామనుకున్నాను.”

“ప్లీజ్ పూర్ణిమా! చాలా అలసటగా వుంది. రేపు విజిటింగ్ అవర్స్ లో వెళ్దాం,” శివా విసుగ్గా అనటంతో ఇంకేం మాట్లాడలేకపోయింది.

ఆ రాత్రంతా ఆలోచనలతో కలత నిద్ర పోయింది పూర్ణిమ.మనసులో ఏదో బాధ. అంతలోకే పరాయి వ్యక్తి గురించి తన బాధలోని గాఢత చూసి ఆశ్చర్యం!

*******************

"సాయంత్రం అయిదుగంటలకల్లా ఆస్పత్రి దగ్గరకొచ్చేయి. నేనక్కడే రిసెప్షన్ లో ఎదురు చూస్తూ వుంటాను," శివా పొద్దున్నే ఆఫీసుకెళ్ళే ముందు చెప్పాడు.

"అరుణ్ అంకుల్ కి ఏమయిందమ్మా?" నీహారిక మెల్లిగా వొచ్చి అడిగింది.

"ఏం లేదమ్మా. అతని సైకలాజికల్ డిజార్డర్ మందులకి లొంగటంలేదని ఆస్పత్రిలో చేర్చారు."

"అంటే మెంటల్ హాస్పిటాలా?"

"కాదు నీహా! మామూలు హాస్పిటల్లోనే సైకియాట్రీ వార్డు లుంటాయి. పెద్ద కంగారు పడాల్సిందేమీ వుండదేమో!"

"సాయంత్రం నేనూ రానా హాస్పిటల్కి?"

"వద్దు. తమ్ముడొక్కడే ఇంట్లో వుంటాడు. నేను ఆఫీసు నించి స్టఫ్ బస్సులో వెళ్ళి , నాన్నతో కలిసి వచ్చేస్తాను. ఇద్దరూ హోం వర్కు చేసుకుంటూ వుండండి, సరేనా!"

***************

"రా, రా! రూం నెంబరు కనుక్కున్నాను, " సాయంత్రం ఆమెని ఆస్పత్రిలో చూసి ఎదురొచ్చాడు శివా. పొడవైన కారిడార్లు దాటి రూం దగ్గరకెళ్ళా రు. తలుపు రాజారావే తెరిచాడు.

"మీరా, రండి రండి! రేవతీ, పూర్ణిమ గారూ వాళ్ళొచ్చారు. అరుణ్, ఎవరొచ్చారో చూడు!"

ఒక్క ఉదుటున లేచి కూర్చున్నాడు అరుణ్. అతని మొహంలో వెయ్యి దీపాలు వెలిగినట్టుంది. నీటుగా షేవ్ చేసుకుని, పాలిపోయిన మొహంతో అయినా నవ్వు మొహంతో హాయిగా వున్నాడు. ఎప్పటిలా అతని చెంపల పైన కన్నీటి చారికలు లేవు. లేచి నిలబడి శివాతో కర చాలనం చేసి ఏవో ప్రశ్నలకి జవాబిస్తున్నాడు కానీ, అతని చూపులు మాత్రం పూర్ణిమ మొహం మీది నించి కదలటం లేదు. ఎన్నో యేళ్ళ ఎడబాటు తరవాత ఆత్మీయులని చూసినట్టు కళ్ళ నిండుగా ఆమెనీ, ఆమె చీరనీ, జడనీ, చెప్పులనీ, తడిమి తడిమి చూస్తున్నాయతని చూపులు. అతని చూపుల్లో అసభ్యత లేదు. ఆత్మీయత వుంది. అదెక్కువగా భయపెట్టింది పూర్ణిమని. అసభ్యతని అర్థం చేసుకోగలం, ఎదుర్కోనూ గలం. ఆత్మీయతని, నిజమైన అభిమానాన్ని అర్థం చేసుకునేదెలాగ?

అసలా ఆత్మీయతని శివా ఎలా అర్థం చేసుకుంటాడు. అతని వైపు తిరిగింది. అటు తిరిగి రాజారావుతో ఏదో మెడికల్ ఇన్స్యూరెన్సు గురించి మాట్లాడుతున్నాడు.

"బాగున్నావా అరుణ్?" అంటూ వెళ్ళి రేవతి పక్కన కూర్చుంది.

"మేం ముగ్గురం వెళ్ళి కాఫీ తాగుతాం!" రాజారావు పెద్దగా ప్రకటించి, "రా రా అరుణ్! అలా బయటికెళ్ళి కొంచెం కాఫీ తాగొద్దాం," అన్నాడు.

"నేను రాను, నేనిక్కడే వుంటాను," మొరాయించాడు అరుణ్.

“కమాన్, లేజీ బాయ్! కొంచెం అలా నడిచొస్తే హాయిగా వుంటుంది.” వదల్లేదు రాజారావు.

గునుస్తూనే వెళ్ళాడు అరుణ్, రాజారావు, శివా లతో కలిసి. హమ్మయ్య, అని వూపిరి పీల్చుకుంది పూర్ణిమ. “ఏమన్నారు డాక్టర్లు?” ఆత్రంగా అడిగింది రేవతిని.

“ఇవాళ పొద్దున్న ఇంకో పెద్ద స్పెషలిస్టు వచ్చి చూసాడు. ఒక రెండు నెలలు ఆఫీసుకి సెలవు పెట్టి రెస్టు తీసుకుంటే బాగుపడొచ్చన్నాడు. వారానికొకసారి కౌన్సెలర్ తో మాట్లాడాలనుకో!”

“అసలీ జబ్బెలా వొచ్చింది?” ఎన్నో రోజులనించి అడగాలనుకున్న ప్రశ్న బయటికొచ్చింది పూర్ణిమకి.

“మా పొరపాటు కొంతా, ప్రారబ్దం ఇంకొంత! హైస్కూల్లో చేర్పించినప్పుడు మిగతా పిల్లలు కొంచెం వాణ్ణి సతాయించే వాళ్ళట. వాడెప్పుడూ మాతో చెప్పలేదు. అదే సమయంలో రాజారావు ఆఫీసు ఇబ్బందుల్తో సతమతమవుతూ వుండేవారు. నాకేమో ఇంట్లో వయసు మళ్ళిన అత్తా మామలతో రోజంతా తీరేది కాదు. మరి వాడేం అనుకున్నాడో కానీ ఒక్క సారి కూడా స్కూళ్ళో పిల్లలు తనని కొడుతున్నారనీ, తనకి భయమేస్తూందనీ ఎప్పుడూ చెప్పలేదు. మొత్తం మీద ఆ స్కూల్ నించి బయటపడి ఇంజినీరింగ్ లో చేరి బాగా చదువుకున్నాడు.

ఫైనల్ ఇయర్ లో ఒక అమ్మాయి తనకి చాలా నచ్చిందని ఇంటికి తీసుకొచ్చి పరిచయం చేసాడు కూడా. వాడికంత నచ్చితే నాలుగైదేళ్ళలో ఆ అమ్మాయితోనే పెళ్ళి జరిపిద్దామని అనుకున్నాము. ఇంతలో ఆ అమ్మాయి ఇంకెవరినో పెళ్ళి చేసుకోని అమెరికా వెళ్ళిపోయింది. అప్పణ్ణించీ, “నేను తెలివి తక్కువవాణ్ణి కాబట్టే నా మీద ఎవరికీ గౌరవం వుండదు, ఎవరూ నన్ను ప్రేమించరు, అందరికీ నేను అలుసే ” అన్న ఆలోచన వాడి మనస్సులో స్థిర పడిపోయింది. ఎలా మాట్లాడినా, ఎలా వాదించినా ఆ మాటనే పట్టుకుంటాడు. మూడేళ్ళ కింద ఇక తట్టుకోలేక సైకియాట్రిస్టుకి చూపించాం. “క్లినికల్ డిప్రెషన్” అని దయాగ్నైజు చేసి వైద్యం మొదలు పెట్టారు. అప్పుడప్పుడూ తగ్గినట్టే మామూలుగా వుంటాడు. మళ్ళీ అంతలో ఏడుపు, ఆత్మ హత్య చేసుకుంటానని గోలా, మొదలు పెడతాడు. రెండు వారాల కింద మీ యింటికి భోజనానికి రమ్మన్నావు చూడు, అప్పణ్ణించి మళ్ళీ ఆగకుండా ఏడుపు! ఒక రాత్రి నిద్ర మాత్రలు మింగబోతుంటే వాళ్ళ నాన్న చూసి ఆపారు. ఆఫీసుకి సెలవు పెట్టమంటే, “అసలే తెలివి లేని వాణ్ణి, దానికి తోడూ సెలవులు కూడా పెడితే ఉద్యోగం వూడి పోతుంది,” అంటాడు! అయినా, నిన్న సైకియాట్రిస్టు వేరే దారి లేదు, కనీసం రెండు నెలలు మెడికల్ లీవు పెట్టాల్సిందేనని ఖచ్చితంగా చెప్పాడు."

“రెండు నెలల వరకూ ఆస్పత్రిలోనే వుండాలా?”

“ఏమో మరి! రేపు పొద్దున్నే చెప్తారట. పూర్ణిమా, ఇంత దిగులూ, బాధల్లో వాడెందుకో నీ మీద చాలా నమ్మకమూ అభిమానమూ పెంచుకున్నాడు. ఈ ప్రపంచంలో నువ్వొక్కదానివే తనను నమ్ముతావనీ, తనకి సహాయం చేస్తావనీ, నువ్వు గనక తన చేయి వదిలేస్తే తనకి ఇహ చావు తప్ప వేరే దారి లేదనీ అనుకుంటున్నాడు. వాడి మనసు ఎంత బలహీనమైందో వాడి నమ్మకాలంత గాఢంగా వుంటాయి. ఇదంతా నిన్నే చిక్కుల్లో నెట్టుతుందో అన్న కొత్త బెంగ మొదలైంది నాకూ రాజారావు గారికీ. వాడి ప్రవర్తనతో శివా

ఏమనుకుంటున్నారో పాపం! నీకో విషయం తెల్సా? వాడి మొహంలో నవ్వు నాలుగు రోజుల తర్వాత ఇప్పుడు నిన్ను చూసినప్పుడే వచ్చింది. నీకు ఇంట్లో ఇదంతా ఏమాత్రం చికాకులు కలిగించినా నిర్మొహమాటంగా మా దారిన మమ్మల్ని వదిలేయి. వాడికి సహాయం చేయ బోయి నీ ఇంట్లో సమస్యలు తెచ్చుకోకమ్మా!!" రేవతి పూర్ణిమ చేయి పట్టుకుని అంది. పూర్ణిమకేం మాట్లాడాలో తోచలేదు.

కాఫీ తాగిన మగవాళ్ళు లోపలికొచ్చారు. వచ్చి పూర్ణిమ పక్కనే కూర్చున్న అరుణ్, "ఆఫీసులో అంతా యెలా వున్నారు?" అంటూ మామూలుగానే వున్నాడు. కాసేపు కూర్చుని, "రెస్టు తీసుకో అరుణ్! అంతా బాగవుతుంది," అని ధైర్యం చెప్పి బయల్దేరారు, శివా పూర్ణిమా.

రాజారావు వాళ్ళతో పాటే బయటికొచ్చాడు.

"చాలా థాంక్స్, మీ ఇద్దరికీ! మీరిచ్చే మోరల్ సపోర్టుకీ, మీ ఇద్దరి స్నేహానికీ అరుణ్ చాలా విలువ ఇస్తాడు. అయితే మీకు వాడి స్నేహం ఏమాత్రం ఇబ్బంది అనిపించినా, మొహమాటం లేకుండ వాణ్ణి దూరం జరిపేయండి. ఎదుగుతున్న పిల్లలతో మీ ఇంట్లో వాడివల్ల ఎలాటి కలతలూ, అభిప్రాయభేదాలూ రావటం నాకూ, రేవతికీ ఇష్టం లేదు." సూటిగా అన్నాడు రాజారావు.

"నో, నో! నాటెటాల్. అందరం కలిసి కొంచెం చేయందిస్తే అరుణ్ తొందర్లోనే కోలుకుంటాడు. మీరు ధైర్యంగా వుండాలి!" శివా రాజారావుకి ధైర్యం చెప్పి బయల్దేరారిద్దరూ. దార్లో ఇద్దరూ మౌనంగానే వున్నారు, ఎవరి ఆలోచనలతో వారు కుస్తీ పడుతూ.

శివాకి భార్య మీద పూర్తి నమ్మకం, గౌరవం. అరుణ్ పట్ల కూడా అతనికి సదభిప్రాయమే వుంది. అందమైన వయసులో జబ్బు బారిన పడ్డాడన్న జాలి కూడా వుంది. పరాయి ఆడవాళ్ళతో వెకిలి వేషాలు వేసే మానసిక స్థితి కానీ, మనస్తత్వం కానీ లేవనీ అతనికి తెలుసు. అయినా ఏదో చికాకు, అసహనం.

మానసికంగా మగవాడికి బలం ఇచ్చేది ఆడదేనన్న విషయం శివాకి బాగ తెలుసు. ఆ స్త్రీ తల్లీ కావచ్చు, చెల్లీ కావచ్చు, స్నేహితురాలో, ప్రేయసో కావచ్చు. అరుణ్ సమస్య, మొత్తానికే దెబ్బ తిన్న అతని ఆత్మ విశ్వాసం. తనకు భగవంతుడిచ్చిన తెలివి తేటలతో తనే మాత్రమూ బ్రతకలేనని అతని నమ్మకం. దెబ్బ తిన్న అతని ఆత్మ విశ్వాసాన్ని ఎవరైనా మళ్ళీ కోలుకునేలా చేస్తే తప్ప అతను కోలుకోలేడు. అది చేయటం మంచి పనే అని తెలిసినా, తన భార్యే ఆ పని చేయటం అతనికి ఒంటికి కారం రాసుకున్నట్టుంది. అలా అని ఆమెని మొత్తంగా ఆపటానికి జన్మతహ వచ్చిన మంచి తనమూ అడ్డు పడుతున్నాయి. పైగా భార్యను అనుమానించి అవమానించటమన్నది అతని వ్యక్తిత్వంలోనే లేదు. ఈ రెండిటి మధ్యా నలిగిపోతున్నాడు శివా.

పూర్ణిమ మనసులోనూ ఆమెకే అర్థం కాని సంఘర్షణ జరుగుతోంది. అమాయకంగా అరుణ్ తన మీద పెంచుకుంటున్న అభిమానమూ, ఆప్యాయతా ఆమెకి మామూలుగానే సంతోషాన్నిస్తుంది. "నా కుటుంబ సభ్యులకే కాదు, నేను అవసరమైతే పరాయిలక్కూడా చేయూత నిచ్చి ఆదుకోగలను, నాకేమీ కాని వాళ్ళక్కూడా నేనంటే ప్రేమే" అన్న భావం ఆమెకి చాలా సార్లు గర్వంగా కూడా అనిపిస్తోంది. ఆమెకి అరుణ్ పట్ల తన మనసులో వున్న భావం కూడా అంతు పట్టట్లేదు. జాలా? ఆప్యాయతా? స్నేహమా?

ప్రేమా? అసలు దానికొక పేరు ఇవ్వాలంటేనే రుచించటంలేదు. మనిషికీ మనిషికీ మధ్య వుండే సంబంధానికి తప్పకుండా ఒక నిర్వచనమూ, పేరు వుండితీరాలా? ఈ ప్రశ్నలన్నీ తొలుస్తున్నాయి ఆమెని.

"అరుణ్ కి పెళ్ళైతే కాస్త బాగవుతాడేమో!" వున్నట్టుండి అన్నాడు శివా.

"ఏమో! ఈ పరిస్థితిలో అతన్నెవరు చేసుకుంటారు?" పూర్ణిమ నిరాశగా అంది.

ఆలోచనల్లోనే ఇల్లు చేరుకున్నారిద్దరూ.

********************

"నీతో అర్జంటుగా మాట్లాడాలి. మధ్యాహ్నం ఇద్దరం కాఫీకెళ్దామా?" మర్నాడు సీత కి మెయిలు వేసింది పూర్ణిమ.

"పన్నెండున్నరకొస్తాను. లంచ్ చేద్దాం." జవాబొచ్చింది సీత దగ్గర్నించి.

******

"చెప్పు. ఎందుకు రమ్మన్నావ్?" సీత కుతూహలంగా అడిగింది. ఇద్దరూ బస్టాపులో కనీసం రెండురోజులకొకసారి కలుసుకుంటారు. చాలా సార్లు శని ఆది వారాల్లో కూడా కలుస్తారు. అందుకని ఇలా "అర్జంటుగా మాట్లాడాలి" అని పూర్ణిమ పిలవటం ఆశ్చర్యంగా వుందామెకు.

సీత చాల మంచి మనిషయినా, కొంచెం జడ్జ్ మెంటల్. అందుకే సీతతో చాలా విషయాలు చర్చించటం ఇష్టం వుండదు పూర్ణిమకి. అయినా చాలా నమ్మకస్తురాలు, అన్నిటినీ మించి ఇద్దరిదీ ఇరవై యేళ్ళ స్నేహం. వ్యక్తిగత సమస్యలూ చర్చించుకునే చనువూ, నమ్మకమూ వున్నాయి ఇద్దరికీ.

సీతతో మాట్లాడితే తన ఆలోచనల్లోనూ క్లారిటీ వస్తుందేమోనన్న ఆశ వుంది పూర్ణిమకి. అందుకే వివరంగా తను ఇరుక్కున్న పరిస్థితి చెప్పిందామెకి. అరుణ్ కున్న సైకలాజికల్ డిజార్డర్, అతనికి కొంచెం మానసిక స్థైర్యాన్నివడంకోసం అప్పుడప్పుడూ తను అతన్ని కలిసి మాట్లాడడం, దరిమిలా అతను తనమీద పెంచుకున్న నమ్మకమూ, ఆప్యాయతా, శివా ఇరిటేషనూ, పిల్లల అయోమయమూ, అన్నీ వివరించింది.

"ఇంతకీ నేను చేస్తున్న దాన్లో తప్పేమైనా వుందంటావా?" ఆఖర్న అడిగింది.

సీత ఏమీ అనకుండా ఆలోచిస్తూ వుండిపోయింది. కొంచెం సేపాగి మళ్ళీ తనే అంది పూర్ణిమ.

"నాకైతే నేను ఏది చేసినా తప్పే అనిపిస్తుంది. ఒక చిన్న పిల్లాణ్ణి ఎమోషనల్ గా నా మీద ఆధార పడేలా చేసి బలహీనంగా చేస్తున్నానేమో, దీంతో నా ఇంట్లో లేని పోని సమస్యలు తెచ్చుకుంటున్నానేమో అనిపిస్తుంది. అప్పుడు మెల్లిగా నా చేయినీ మనసునీ విడిపించుకోవాలని అనుకుంటాను. ఇంకొన్నిసార్లేమో, ఒక మనిషికి నేనివ్వల్సిన ధైర్యం అంత అవసరమైనప్పుడు అంత స్వార్థంగా ఎలా వుండగలను, అని పిస్తుంది. ఇందులో ఏది రైటో, ఏది తప్పో, ఏది మంచో, ఏది చెడో నాకర్థం కావడం లేదు." పూర్ణిమ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

సీత అర్థమైనట్టు తలాడిచంది.

"నిజం పూర్ణిమా. చాలా సార్లు మనకి మన ముందున్న దార్లలో ఏది సరైనదో ఏ మాత్రం ఊహకందదు. ఒక పని చేయి. ఇదే పరిస్థితి తారుమారై, శివా నువ్వున్న పరిస్థితిలో వుంటే నువ్వెలా రియాక్టవుతావో ఊహించుకో. అప్పుడు నీకేం చెయాలో కొంచెం ఐడియా రావొచ్చు."

"అంటే?"

"అంటే, ఎవరో ఒక అమ్మాయి, నీకంటే బాగా చిన్నదై, అందంగా వుండి, నిజంగా పరిస్థితి బాలేక శివాని సహాయం కోరిందనుకో. శివా, నీతో చెప్తూనే ఆమెకోసం చాలా సమయాన్నీ, శక్తినీ వెచ్చిస్తున్నాడనుకో, అప్పుడు నీ రియాక్షనెలా వుంటుంది?"

పూర్ణిమ ఆలోచనలో పడింది. ఏదో చెప్పబోయింది. సీత ఆపింది. "ఆగు. నువ్వు నాకు జవాబు చెప్పాల్సిన అవసరం లేదు. నీకు నువ్వే నిజాయితీగా ఆలోచించుకో. అప్పుడు ఈ సమస్యకి నువ్వేం పరిష్కారం ఆలోచించినా అది రైటే అవుతుంది."

నిజమే, తనేం చేస్తుంది? పూర్ణిమ ఊహించుకోవటానికి ప్రయత్నిస్తుంది. తనూ శివాకి ఆ అమ్మాయికి సాయ పడటానికి సహకరిస్తుంది బహుశా. కానీ, ఆ అమ్మాయి ఎక్కువగా శివా తోనే మాట్లాడుతూ, అతని మీద అభిమానం, ఆరాధనా పెంచుకుంటే? ఆమెకి మనసంతా చేదుగా అయింది. కానీ, ఆడా మగా ఒకరికొకరు సహాయం చేసుకున్నంతమాత్రాన ఆ సంబంధాన్ని శంకించేంత సంస్కారం లేనిదా తను? ఇది "సంబంధాన్ని శంకించటమా" లేకపోతే కేవలం భాగస్వామి మీద పొసెసివ్ నెస్సా? ఆలోచన ముడిపడటం లేదు. సీత ఆమెని మౌనంగా వదిలేసింది.

వున్నట్టుండి, సీత ఆమె చేతి మీద తట్టింది. ఏమిటన్నట్టు చూసింది పూర్ణిమ? సీత మొహం నిండా ఆశ్చర్యం. అటు చూడన్నట్టు సైగ చేసింది, ఒక మూలకి చూపిస్తూ. తల తిప్పి చూసింది పూర్ణిమ. ఎవరికీ కనబడని ఒక మూల ఒంటరిగా కూర్చొనుంది, రూపిణి. తల వంచుకొని, కాఫీ కప్పులోకి చూస్తోంది. ఆమె కళ్ళల్లోంచి ధారా పాతంగా నీళ్ళు. చేతిలో టిష్యూ పేపరుతో తుడుచుకుంటున్నా ఆగకుండ కన్నీరొస్తూంది. చుట్టూ వున్న అందరూ చూస్తారన్న ధ్యాసైనా లేకుండా దేనికోసం అంత బాధ పడుతోంది?

"పద, వెళ్ళి అడుగుదాం.ఏం ప్రాబ్లమో ఏమో, పాపం!" అంటూ సీత లేచి రూపిణి వైపు నడిచింది.

"ఆగు సీతా! ఇప్పుడొద్దు!" మధ్యలోనే సీతని అందుకొని, చేయి పట్టుకోని ఆపింది పూర్ణిమ.

"ఎందుకని?" ఆశ్చర్యంగా అడిగింది సీత.

"తను ఒంటరిగా వుండాలనుకుంటూందో ఏమో! ఇప్పుడు మనం పలకరిస్తే బాగుండదు. వదిలేయ్. తర్వాత మామూలుగా ఎప్పుడైనా కనిపించినప్పుడు అడుగుదాం."

"అంతేనంటావా?"

"అందులోనూ, ఆఫీసు కేంటీన్ లో! వద్దు! రేపు బస్టాపులోనో, కాలనీలో ఎక్కడైనా కనిపించినప్పుడో కాజువల్గా అడుగుదాం."

"అయితే సరే, పద, వెళ్దాం!"

****************

శనివారం మధ్యాహ్నం పడుకొని పుస్తకం చదువుకొంటున్న పూర్ణిమ కాలింగ్ బెల్లు మోతకి లేచింది. శివా కంప్యూటరు మీద ఏదో పని చూసుకుంటున్నాడు. పిల్లలు స్నేహితులతో సినిమాకని వెళ్ళే సరికి కాస్త తీరిగ్గా వుంది ఆ వేళ.

తలుపు తీసి, గుమ్మం బయట రూపిణిని చూసి ఆశ్చర్యపోయింది పూర్ణిమ.

"మీరా! రండి రండి! హౌ సర్ప్రయిజింగ్!" లోపలికి ఆహ్వానించింది.

"సారీ, వేళ గాని వేళ డిస్టర్బ్ చేసానా? నేను వచ్చే వారమంతా ఆఫీసుకి రాను. మీతో చిన్న పనుండి ఇంటికొచ్చాను. ఇంట్లో వుంటారో లేదోనని భయపడుతూ వచ్చాను."

"అయ్యో, ఇందులో సారీ యేముందండి! పని లేకుండా ఊరికే అయినా మా ఇంటికి రావొచ్చు. కూర్చోండి."

శివా కూర్చున్న గది తలుపులు వేసి హాల్లోకొచ్చింది.

"కొంచెం మంచి నీళ్ళు తేనా?"

"యస్, ప్లీజ్!"

మంచి నీళ్ళిచ్చి కూర్చుంది పూర్ణిమ. పరిశీలనగా చూసింది రూపిణి కేసి. మొహం కొంచెం కళ తప్పి దిగులుగా వుంది. బాగులోంచి ఏవో కాగితాలు తీసి,

"ఇవి ఏవో మీ లేబొరటొరీ కి సంబంధించిన కాగితాలు. నిన్న మీ బాస్ సంతకాలు చేసి మీకిమ్మన్నాడు. అప్పటికే మీరంతా వెళ్ళిపోయారు. నేనేమో మళ్ళీ ఆఫీసుకి రావడానికి వారం పదిరోజులు పట్టొచ్చు. అందుకే ఇవి మీకివ్వడానికొచ్చాను."

"ఓ! థాంక్ యూ! " కాగితాలు తీసి తన లేప్ టాప్ బేగులో సర్దుకుంది పూర్ణిమ.

కాసేపు మౌనం.

"చెప్పండి, ఏమిటి విశేషాలు? అన్నట్టు , ఈ మధ్య మీ ఇంట్లో కచ్చేరీలేవీ అవుతున్నట్టు లేదే?"

"అవునండీ! కొంచెం వీలు చిక్కటం లేదు."

"కొంచెం టీ పట్టుకు రానా?"

"టీ వొద్దు కానీ, అలా పార్కు దాకా నడిచొద్దామా? బయట వాతావరణం చాలా బాగుంది."

"తప్పకుండా! రెణ్ణిమిషాల్లో బట్టలు మార్చుకొస్తా!"

శివాకి చెప్పి ఇద్దరూ ఇంటినుంచి బయటపడ్డారు.

****

“నేను మిమ్మల్నొక విషయం అడగాలనుకుంటున్నాను!” పూర్ణిమ చివరకి ధైర్యం తెచ్చుకుంది.

“మీరడగబోయేది నాకు తెలుసు. వారం రోజుల కింద మీరూ, సీత గారూ కేంటీన్లో నన్ను ఏడుస్తూంటే చూసారు.”

ఏమనాలో తోచలేదు పూర్ణిమకి.

పార్కులో కెళ్ళి మూలగా బెంచీ మీద కూర్చున్నారు.

“చెప్పండి, రూపిణీ! అంతా బాగే కదా? ఈ మధ్య డల్ గా కూడా అనిపిస్తున్నారు. ఏం జరిగిందని అంత బాధ పడుతున్నారు?”

చాలా సేపు ఆలోచనలు కూడదీసుకుంది రూపిణి.

“మీకు లలిత్ గుర్తున్నాడా?”

“మీ ఇంట్లో తబలా వాయించేదూ...”

"అతనే! అతనితో నా పరిచయం గమ్మత్తుగా జరిగింది. ఏదో కార్యక్రమంలో అతను తబలా వాయిస్తే విన్నాను. అయితే ఆ కార్యక్రమం నాకంతగా నచ్చలేదు. ఎవరో అతనితో ఈ సంగతి చెప్తే నాతో మాట్లాడడానికొచ్చాడు. ఇక్కడే స్టేట్ బాంకిలో పనిచేస్తాడని తెలిసి ఆశ్చర్యపోయాను. మొత్తం మీద ఇద్దరం స్నేహితులమయ్యాం. సంగీతం గురించే గంటలు గంటలు మాట్లాడుకునేవారం. నా భర్త అజిత్ ఎప్పుడూ కంపెనీ పని మీద టూర్లు తిరుగుతూంటాడు. నాకు వీలైనప్పుడు నేనూ కూడా వెళ్ళేదాన్ని. కానీ కొన్నాళ్ళ తర్వాత ఆఫీసులో సెలవులు దొరకక మానేసాను. ఉన్న ఒక్క కూతుర్నీ రెండేళ్ళకింద రెసిడెన్షియల్ కాలేజీలో చేర్పించాం. ఇంట్లో ఎప్పుడూ ఒక్కదాన్నీ! మానసికంగా ఒంటరితనం!

అసలు మా వైవాహిక జీవితంలో నేనెప్పుడూ ఒంటరి దాన్నేనేమో. అజిత్ మంచివాడే కానీ, చాలా ముభావి. మనసులో ప్రేమని ఎలా వ్యక్తం చేయాలో కూడ తెలియనట్లుంటాడు. అసలు ప్రేమని వ్యక్తం చేయాలన్న విషయమైనా తెలుసో తెలియదో. నేను తనతో టూర్ వస్తానన్నా, రానన్నా అతని రియాక్షను ఒకేలాగుంటుంది. నన్ను పాడొద్దనడు, నా పాట విని పరవశించీ పోడు. అతనితో పెళ్ళి వల్ల ఒక రకమైన ఒంటరితనం నన్నావహించుకుంది.

అలాటి సమయాల్లో సంగీత సాధనతోనే మనసు నింపుకునేదాన్ని. యేడాది కింద లలిత్ తో పరిచయం నాకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. ఇద్దరం గంటల తరబడి సంగీత సాధన చేసే వాళ్ళం. నేను గొంతెత్తి పాడితూ వుంటే ఎన్ని గంటలైనా తబలా వాయించగలననే వాడు. ఎప్పుడు మా స్నేహం ప్రేమలోకి దిగిందో నాకు తెలియనే లేదు. నేను పాడుతున్నప్పుడు లలిత్ కళ్ళల్లో పొంగే ఆరాధనా, నేను మంచి చీర కట్టుకోగానే లలిత్ కళ్ళల్లో కనబడే ప్రశంసా, నాకెంత సంతోషాన్నిస్తాయో చెప్పలేను. ఏదో పోగొట్టుకున్నది తిరిగి దొరికినంత సంతోషం. ఇప్పుడు నాకసలు అజిత్ తో టూర్లకి వెళ్ళాలన్న వుత్సాహమే లేదు. అఫ్కోర్స్, నేను తననించి మానసికంగా

దూరమౌతున్నానన్న విషయం అజిత్ గుర్తించే వుండి వుంటాడు. కాని, ఉదాసీనంగా ఊరుకున్నాడు. అన్నిటికంటే నన్నా సంగతి ఎక్కువ బాధ పెట్టింది తెలుసా!"

కొంచెం సేపు ఆగి ఊపిరి పీల్చుకుంది రూపిణి.

"ఆర్నెల్ల కింద లలిత్ తో నాకున్న అనుబంధాన్ని గురించి నేను సీరియస్ గా ఆలోచించటం మొదలు పెట్టాను. దాదాపు అజిత్ కి విడాకులిచ్చేద్దామనుకున్నా కూడా. మనసుకి సంతోషానిచ్చేదొకళ్ళైనప్పుడు, ఇంకొకళ్ళతో వుండడం ఎంత దుర్భరం కదా? అందుకే లలిత్ తో కూడా చెప్పాను. అతను కనక హారతికి విడాకులిచ్చేటట్టయితే నేనూ అజిత్ కి విడాకులిస్తానని. లలిత్ కూడ సరేనన్నాడు."

"వాళ్ళకి పిల్లల్లేరా?"

"లేరు."

"మరయితే సమస్య ఏమిటి?"

రూపిణి కళ్ళు నీళ్ళతో నిండుకున్నాయి.

"లలిత్ మనసు మార్చుకున్నాడు."

"...."

"పిల్లలు కూడా లేని భార్యని వదలలేననీ, విడాకులు తీసుకోవడం కుదరదనీ అన్నాడు."

రూపిణి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

కొంచెం సేపు ఆమెన లాగే ఏడవనిచ్చింది పూర్ణిమ. మనసులో బరువంతా దిగేదాకా ఏడవడం తప్పు చేయగలిగేదేముంది?

"నన్ను చూస్తే అసహ్యం వేస్తుందా?" కళ్ళు తుడుచుకోని అడిగింది రూపిణి. నవ్వింది పూర్ణిమ.

"అసహ్యమా? ఎందుకు?"

"పెళ్ళయి, పదహారేళ్ళ కూతురున్న తల్లిని. ఇంకో మగవాడి ఆకర్షణలో ఎలా పడిపోయానో! తలచుకుంటే నాకే నా మీద అసహ్యం వేస్తుంది. "

"తప్పొప్పుల మధ్య వుండే గీత అంత స్పష్టంగా వుండదు కదా! సరే, జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడేం చేయాలనుకుంటున్నారు?"

"ఏమో తెలియటం లేదు. అన్నిటికంటే లలిత్ స్నేహం లేకుండా నాకు దుర్భరంగా వుంది. ఈ వయసులో ఒక మగవాడి కాంప్లిమెంట్ల కోసం, అప్రీసియేషన్ కోసం నా మనసింత కొట్టుకుపోవడం ఏమిటి? అంత చెడ్డదాన్నా నేను?"

"అది బలహీనతే అవుతుంది కానీ, చెడ్డతనమెందుకవుతుంది? బహుశా ఆడా-మగా మధ్య ఆకర్షణకీ, ప్రేమకీ వయసుతో సంబంధం లేదేమో. ఇటీజే ప్రిమిటివ్ ఇన్స్టింక్ట్. మీ మనసులో ఘర్షణా, అశాంతీ అజిత్ తో ఎప్పుడైనా చెప్పారా?"

"అజిత్ తో ఏం చెప్పినా అభావంగా ఒక చూపు చూడడం తప్ప ఏ ప్రతిస్పందనా వుండదు. అది నాకింకా అవమానంగా అనిపిస్తుంది. దానికంటే నన్ను ఈడ్చిపెట్టి చెంప దెబ్బ కొట్టినా, లలిత్ ని నరికేస్తానని రంకెలేసినా అర్థం చేసుకునేదాన్ని. ఐ డోంట్ మీన్ ఎనీథింగ్ టు హిం!"

"...."

"చిన్నప్పుడే మా అమ్మా నాన్నా ఏక్సిడెంటు లో పోయారు. ఒక్క అన్నయ్య తప్ప ఎవరూ లేరు. చాలా, చాలా ఒంటరిగా అనిపిస్తోంది."

ఏడుపు ఆగిపోయినా రూపిణి గొంతులో విషాదం జాలిగా వుంది.

"కొన్ని రోజులు మీ అన్నయ్య దగ్గరకె కెళ్ళి వుండొస్తే? ఒంటరిగా వుంటే మీ ఆలోచనల్లో స్పష్టతా, మనసుకి శాంతీ దొరకొచ్చు. "

"బహుశా అంతే చేస్తానేమో. మా అన్నయ్య అహ్మదాబాదులో వుంటాడు. ఎలాగూ వారం రోజులు సెలవు పెట్టాను. ఇంకొక వారం పొడిగిస్తాను."

"అలా చేయండి! ఏదైనా, మిమ్మల్ని మీరు అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి, రూపిణీ. డొంట్ బీ హార్ష్ ఆన్ యువర్సెల్ఫ్. "

ఇద్దరూ లేచి ఇంటి ముఖం పట్టారు.

"థాంక్స్ పూర్ణిమా! మీతో మాట్లాడింతర్వాత, మనసు కొంచెం తేట పడింది."

"ఫర్వాలేదు! వుంటా మరి!"

*****************

సినిమానించొచ్చిన పిల్లలు అన్నాలు తిని పుస్తకాలు ముందేసుకున్నారు.

"అమ్మా! ఇప్పుడు నువ్వు నా ఫిజిక్స్ హోం వర్క్ చూసే తీరాలి!" నీహారిక తల్లితో చెప్పి పుస్తకాలు తెచ్చుకుంది.

"సరే! వస్తున్నా!" వంటిల్లు సర్దుతూ అంది పూర్ణిమ.

"ఏమంటోంది మీ ఫ్రెండు?" టేబిల్ తుడుస్తూ అడిగాడు శివా.

"ఏవో మాములు సంగతులంతే!"

బయటికి వెళ్ళి నీహారిక పుస్తకం తెరిచి లెక్క చూడసాగింది పుర్ణిమ.

కాసేపు ఇద్దరూ ఆ ప్రపంచంలో మునిగిపోయారు. ఫోన్ మోగింది!

"నో! అమ్మా, ఆ ఫోన్ నీకే అయినా అటెండవద్దు, ప్లీజ్! ఇవాళ ఈ లెక్కలు చేసేయాలి," అంటూనే వుంది నీహారిక. సంజూ ఫోన్ చేత్తో పట్టుకుని, "అమ్మా, నీకే ఫోన్!" నవ్వుతూ ఇచ్చాడు.

"తొందరగా ముగించి లెక్క చెప్తాలే, డోంట్ వరీ!" నవ్వుతూ కూతురితో అని, ఫోనందుకుంది.

"పూర్ణిమా?" అవతల అరుణ్ గొంతు వినబడింది.

"హలో అరుణ్, చెప్పు! ఎలా వున్నావ్?"

"బానే వున్నాను. అయాం మిసింగ్ యూ! వచ్చే వారం ఇంటికి పంపేస్తారట. అప్పుడొకసారి మీ ఇంటికి రావొచ్చా?" ఆశగా అడిగాడు.

"అలాగే వొద్దువుగాని. ఇప్పుడు కొంచెం బిజీగా వున్నా అరుణ్! రేపెప్పుడైనా మాట్లాడుకుందాం, సరేనా?"

"ఓ! సారీ! డిస్టర్బ్ చేసానా? రేపు మాట్లాడతాలే. నీహారికా, సంజూలెలా వున్నారు? శివా ఏం చేస్తున్నారు?"

"అంతా బాగున్నారు. నీహా హోం వర్కుతో బిజీగా వున్నాను."

"సరే! బై!" పెట్టేసాడు.

రాత్రంతా ఆలోచనలతో నిద్ర పట్టలేదు పూర్ణిమకి.

"ఆయాం మిస్సింగ్ యూ" అంటూన్న అరుణ్ గొంతు పదే పదే వినిపిస్తూ చాలా ఆందోళనకి గురి చేసిందామెని. అరుణ్ ఆస్పత్రి నించి డిశ్చార్జి అవుతాడింకొద్ది రోజుల్లో. అప్పుడేమవుతుంది? తనేం చేయాలి? అతన్ని దూరంగా వుంచడం అలవాటు చేయాలా? చేస్తే ఏమవుతుంది? తట్టుకుంటాడా? ఇప్పట్లాగే వుంచితే ఏమవుతుంది? ఒక్క ప్రశ్నకీ తనకి జవాబు తట్టడం లేదు. ఎవరినైనా అడగాలన్నా తోచడం లేదు. ఎవరినడగడం? ఆలోచనలతో కలత నిద్ర పోయింది.

**************

"ఈ మధ్య నాకసలు లేబ్ కే వెళ్ళాలనిపించడం లేదు."

మర్నాడు బస్టాపులో పరధ్యానంగా వున్న పూర్ణిమ సీత మాటలతో ఈ లోకం లోకొచ్చింది.

"ఏం? ఏమయ్యింది?"

"ఏదో ఒక చికాకు! మా లేబ్ లో పని చేసినా కష్టమే, చేయకపోయినా కష్టమే."

"అది మీ ఒక్క లేబ్ లోనే కాదు. ఎక్కడైనా అంతే!"

"అవుననుకో! అయితే నీకు లేని కష్టం నాకొకటుందమ్మా! దాని పేరే ఎస్.ఆర్.కే!"

నవ్వింది పూర్ణిమ. ఎస్.ఆర్.కే అని అందరూ ముద్దుగా పిలుచుకునే శివరామకృష్ణ సీత టీం లో ఏడాది కింద చేరాడు. ఏమాత్రం టీం స్పిరిట్ చూపించకుండా, ఎడ్డెమంటే తెడ్డమనే అతనితో ఎలా పని చేయించుకోవాలో, ఎలా అతన్ని దారికి తేవాలో సీతకి అర్థం కావడంలేదు.

"ఇప్పుడేమంటాడు?" పూర్ణిమ అడిగింది, మళ్ళీ ఏం సమస్య తెచ్చాడో అని!

"మా టెక్నీషియన్లిద్దరు ముగ్గురు ఈ మధ్య బెంగుళూరులో ఒక కాన్ఫరెన్సు కి వెళతాననీ అడిగారు. ఈ కాన్ఫరెన్సు కి వెళ్తే వాళ్ళకి ఎంతో ప్రోత్సాహంగా వుంటుందని నేను సరే అన్నాను. ఇప్పుడే ఎస్.ఆర్.కే కి ఒక కొత్త ఎక్విప్మెంటు కావల్సొచ్చింది! రెండిటికీ బడ్జెటు సరిపోదు. కాన్ఫరెన్సు ప్రపోజల్ వెనక్కి తీసుకుంటే డబ్బులు మిగులుతాయి, రీసెర్చికి ఎక్విప్ మెంటు ముఖ్యం కానీ, టెక్నీషియన్లు కాన్ఫరెన్సులకెళ్ళడం కాదు కదా, అని మడత పేచీ పెట్టాడు. అతని మాటల్లో నిజమున్నా, అది టెక్నీషియన్లకి అన్యాయం కదా? ఎంతసేపూ వాళ్ళని రీసెర్చికి వాడుకోవడమే కాకుండా వాళ్ళకీ కొంచెం అవకాశాలిస్తే వాళ్ళూ పైకొస్తారు కదా? కానీ అతన్ని కన్విన్స్ చేయడం అసాధ్యం. ఏం చేయాలో అర్థం కావడం లేదు, " నిట్టూర్చింది సీత.

చిన్న కేడర్లో జేరి, మెల్లిగా ప్రమోషన్ల మీద సైంటిస్టయిన అతనికి తనకంటే వయసులో చిన్నదయి క్వాలిఫికేషన్లో పెద్దదయిన బాసు టీం లో వుండడం ఇదే మొదటిసారి. అందులోనూ ఆడ బాసు అనే సరికి అతనికి నిప్పుల మీద కూర్చున్నట్టుంది.

పెద్ద పెద్ద సంస్థలలో ఇది చాలా మామూలు. ఆడవాళ్ళని హెచ్.ఆర్ లోనూ, ఉపాధ్యాయ వృత్తిలోనూ చూసినప్పుడు కలగని అసహనం పెద్ద సైంటిస్టు పొజిషన్లో చూసినప్పుడు కలుగుతుంది చాలామందికి. ఆ స్త్రీ తమకంటే ఎక్కువ చదువుకుని, పై అధికారి కూడా అయితే అసలే మింగుడు పడదు. ఆమెకీ తెలివితేటలుండొచ్చుననీ, కష్టం మీదే ఆ స్థాయికి చేరుకుందని నమ్మకం వుండదు.

"ఆ... ఆడవాళ్ళకేముంది, కొంచెం అందంగా నవ్వి, కాసేపు కబుర్లు చెప్తే చాలు, ప్రమోషన్లూ అన్నీ తొందరగా వచ్చేస్తాయి," అన్న ఒక చులకన భావం వాళ్ళ ప్రవర్తనలో కనబడుతూనే వుంటుంది. అందువల్ల ఆ పై అధికారి తన కిందివాళ్ళతో నిర్మోహమాటంగా, కొంచెం ఫర్మ్ గా వుండకా తప్పదు. అంతే కాదు, తాను పైకి రావడం వెనక ఎంతో స్వశక్తి వుందని ఇతర్లని నమ్మించడానికి చాలా పడాల్సొస్తుంది ఆ స్త్రీలకి. సహజంగా తమ టీం మెంబర్లనించీ అదే ఎక్స్పెక్టు చేస్తారు. దాంతో టీం సభ్యులకి ఇంకా చిరాకెత్తి పోతుంది. సీతా అదే పరిస్థితిలో చిక్కుకుంది, ఎస్.ఆర్.కే రాకతో. అంతకు ముందు ఆమె కిందంతా చిన్న చిన్న టెక్నీషియన్లు ఒకరిద్దరే కావడంతో పెద్ద సమస్యలుండేవి కాదు.

సీత ప్రతిపాదించిన ప్రతీ ప్రయోగాన్నీ అతను నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తాడు, ఒక రకమైన వెటకారపు నవ్వుతో. సీత చదివిన ప్రతీ పేపరునీ తప్పు పడతాడు. చెప్పిన చిన్న పనిని కూడా చేయకపోగా, ఆ పని చేయల్సిన అవసరం లేదని నిరూపించడానికే ప్రయత్నిస్తాడు. వెంటనే తానొక కొత్త ఎక్స్పెరిమెంటుని ప్రతిపాదిస్తాడు కూడా. అప్పుడు సీత వ్యతిరేకిస్తే చైల్డిష్ గానూ,

ఒప్పుకుంటే ఓడిపోయినట్టుగానూ వుంటుంది. టెక్నీషియన్ల ముందు ఆమెతో పెద్ద వాదన వేసుకుంటాడు. అన్ని రకాలుగా ఆమెని అవమానించడమే తన ధ్యేయమన్నట్టు ప్రవర్తిస్తాడు. ఆమె చిరాకు పడితే వెనక మిగతా మగవాళ్ళతో కలిసి,

"ఆడవాళ్ళ పీ.ఎం.ఎస్ తో అప్పుడప్పుడూ చిరాగ్గా ప్రవర్తిస్తూ వుంటారు. మనమే చూసీ చూడనట్టు వూరుకోవాలి," అంటాడు.

ఇహ ఇతనితో పని కాదని సీత అతన్ని మొత్తంగా పక్కన పెట్టేసి తన పనంతా తానే చూసుకోవడం మొదలు పెట్టింది. దాంతో, "నా మేనేజరు నాకేమీ పని ఇవ్వకుండా నా కెరియర్ ను ఎదగకుండా చేస్తుంది," అని గోల పెట్టాడు. రీసెర్చి లీడరు సీతని మీటింగుకి పిలిచి సంజాయిషీ అడిగాడు.

"నేనే పని చెప్పినా అతనికి నచ్చదు. అందుకే అతనికి పని ఇవ్వడం మానేసాను." వివరించింది సీత.

"నేను నచ్చదనలేదు. మీరు ప్రపోజ్ చేసే ఎక్స్పెరిమెంటు పని చేయదని చెప్తున్నానంతే!" ఎస్.ఆర్.కే అతి తెలివి చూపించాడు.

"అది తేల్చుకోవడానికే నేను ఆ ఎక్స్పెరిమెంటు చేస్తున్నాను." శాంతంగా అంది సీత.

రీసెర్చి లీడరు ఇద్దరికి అప్పటికి సర్ది చెప్పి పంపించాడు. నిజానికి ఆయనకి చెప్పి అతన్ని వేరే టీం కి బదిలీ చేయించడం పెద్ద కష్టమైన పనేమీ కాదు. కానీ, సీత దాన్ని ఓటమి లా భావిస్తుంది.

"ఏ మాత్రం సహకరించని మనిషిని నా దారికి తెచ్చుకోని పని చేయించుకోగలగాలి కానీ, గ్రూపు మార్పించడం చేతకాని తనమవుతుంది. అందులో అతనికి ఆడవాళ్ళ మీద వున్న అభిప్రాయాలు మార్చకపోతే మనకి ఇంతింత చదువులూ తెలివితేటలూ వుండి ఏం ప్రయోజనం!" కోపంగా అంది పూర్ణిమతో.

"అవుననుకో! అయితే మరీ ఆ మనిషి నీ మానసిక శాంతిని హరించి వేస్తుంటే నువ్వు మాత్రం పనెలా చేసుకుంటావు? అందుకే ఆర్.ఎల్ అతన్ని గ్రూపు మారుస్తానంటే మెదలకుండ ఊరుకో!"

"అప్పుడు మిగతా టెక్నీషియన్లకి లోకువైపోనూ? అసలు నాకిక ముందు మంచి స్టాఫ్ దొరుకుతుందా?"

అదీ నిజమే! ఆలోచిస్తూ నిలబడింది పూర్ణిమ.

"అన్నట్టు రూపిణి రెండు మూడు వారాల దాకా రాదట కదా? పాపం ఆమె సమస్యేమిటో మనం అడగనే లేదు!" వున్నట్టుండి అంది సీత. రూపిణి తమ ఇంటికొచ్చిన సంగతి చెప్పాలో వొద్దో తేల్చుకోలేకపోయింది పూర్ణిమ. అదృష్టవశాత్తూ బస్సు వచ్చేసరికి మాటలు ఆగిపోయాయి. "ఏమిటో! ఎవరిని కదిలించినా ఏవో ఒక సమస్యలు, కదూ? ఎవ్వరమూ పుర్తిగా మనశ్శాంతితో బ్రతుకుతున్నట్టు లేము!" బస్సు దిగి లేబ్ వైపు నడుస్తూ అంది సీత.

*************

రెండు వారాల తర్వాత,

ఆఫీసునించొచ్చి కాఫీ తాగుతూ కూర్చుంది పూర్ణిమ. పిల్లలు పరీక్షలైపోయి సెలవలకి అమ్మా వాళ్ళింటికెళ్ళడంతో ఇల్లంతా ఖాళీగా వుంది. ఎప్పుడూ వుండే ఉరుకులూ పరుగులూ లేకుండా కాస్త తీరిగ్గా అనిపించిందామెకి. కప్పు సింకులో పడేసి ఈ మెయిలు తెరిచి చూసింది. పిల్లల దగ్గర్నించి వచ్చిన మెయిలు చూసి ఒక్కసారి దిగులేసింది. ఎప్పుడూ పిల్లల్ని ఒంటరిగా ఎక్కడికీ పంపలేదు. వాళ్ళని వదిలి ఉండడం ఇదే మొదటిసారి. పెద్దయి తనని ఒదిలి వెళ్ళిపోతే తనెలా వుంటుందో! ఆలోచనే విచిత్రంగా వుంది. బహుశా ఇంకొక అయిదేళ్ళలో తను పిల్లలు లేని ఒంటరితనానికి అలవాటు పడడం మొదలుపెట్టాలేమో! ఉన్నట్టుండి మెయిల్ అలర్ట్ చూసింది. రూపిణి దగ్గర్నించి ఈ-మెయిలు చూసి ఆశ్చర్యపోయింది.

ప్రియమైన పూర్ణిమా,

బాగున్నావా? నేనిక్కడ అహమదాబాదులో మా అన్నయ్యా వాళ్ళింట్లో హాయిగానే వున్నాను. వీలైనంతవరకూ ఎలాటి ఆలోచనలూ పెట్టుకోకుండా సంగీతం పాడుతూ వున్నాను. నా గురించీ, నా జీవితం గురించీ, అన్నిటికంటే ఈ జన్మలో నాకున్న పెద్ద బంధం, నా కూతురు రమ్య గురించీ ఆలోచించాను. అదే లేకపోతే నేను అజిత్ ని కూడ వదిలేసి నా ఒంటరితనాన్ని నాకిష్టమైన ఏకాంతంగా మార్చుకుని వుండేదాన్ని.

ఇక్కడికి వచ్చింతర్వాత లలిత్ దగ్గర్నించి క్షమించమని అడుగుతూ ఒకటి రెండు మెయిల్లు వచ్చాయి. విచిత్రంగా అతని మీదికంటే నామీదే నాకు ఎక్కువ కోపం వస్తుంది. చిన్న పిల్లని కాను. అంత వల్నరబుల్ గా ఎలా అయ్యాను? అన్నిటికంటే, లలిత్ నాతో, "నీకూ నాకూ మధ్య సంగీతం ఏర్పరచిన సంబంధం ఎప్పటికీ తెగిపోనిది. నీకంటే మంచి స్నేహితులు నాకెవ్వరూ లేరు. మనం ఎప్పటికీ స్నేహంగానే వుందాం," అనడం మహా చిరాగ్గా వుంది. అయితే వింతేమిటో తెల్సా? నేనా ఈ-మెయిల్ కి బదులు కూడ రాసాను.

ఎంత ప్రయత్నించినా ఈ వ్యామోహం నించి తప్పించుకోలేకపోతున్నాను చూడు! మనం చేయాల్సిందేమిటో మనకి తెలియడమూ, మనం నిజంగా అలా చేయడమూ, రెండూ వేర్వేరు విషయాల్లాగున్నాయి కదూ?

అజిత్ ఒక్కసారి ఫోన్ చేసి "క్షేమంగా చేరావా?" అనడిగాడు, అంతే. కనీసం వెళ్ళేప్పుడుఎందుకు దిగులుగా వున్నావని కూడా అడగలేదు. పరీక్షలైపోగానే ఇక్కడకే వస్తానని రమ్య అంది. నేను ఈ వేసవి అంతా ఇక్కడే వుండి, స్కూలు తెరిచింతర్వాత రమ్యని హాస్టల్లో దిగబెట్టి హైదరాబాదు వస్తాను. అందుకే లీవు ఇంకా పొడిగించాను. జీతం వస్తే రానీ, పోతే పోనీ అని చెప్పాను మన డివిజన్ హెడ్డుతో!

సరే, ఆ విషయాలు పోనీ. అక్కడంతా ఎలా వుంది? పనంతా మామూలుగానే సాగుతోందా? సీత ఎలా వున్నారు? వీలైతే ఒక ఈ-మెయిలు వేయండి.

వుంటా మరి, రూపిణి.

ఈ-మెయిలు మూసేసి ఆలోచనలో పడింది పూర్ణిమ. రూపిణిని తలచుకుంటే జాలేసింది. వ్యక్తిగత జీవితంలో ఒంటరితనం ఎంత శాపం! చాలా సార్లు మన జీవితాల్లో కొన్ని క్రైసిస్ లు మన మనసుల్లో, జీవితాల్లో వుండే చీకటి కోణాలని మనకే ఎత్తి చూపించడానికి వస్తాయేమో! తన జీవితంలో క్రైసిస్-

కాలింగ్ బెల్ మోతతో ఉలిక్కిపడింది.

శివా వొచ్చినట్టున్నాడు.లేచి వెళ్ళి తలుపు తీసింది.

"హలో!సర్ప్రయిజ్! " నవ్వుతూ తలుపవతల నిలబడి వున్నాడు అరుణ్. చిరునవ్వుతో విచ్చుకుంది పూర్ణిమ మొహం.

"అరుణ్! నువ్వా! రా, లోపలికి! ఎలా వున్నావ్?" గబ గబా మాట్లాడుతూ లోపలికెళ్ళింది.

"బాగానే వున్నాను. ఇవాళ పొద్దున్నే ఆస్పత్రి నించి డిశ్చార్జి చేసారు. పొద్దుణ్ణించీ నిన్ను చూడాలని ప్రాణం కొట్టుకుపోయింది తెలుసా? మీరంతా ఎలా వున్నారు? పిల్లలేరీ?"

"అంతా బాగేలే! పిల్లలు మా అమ్మా వాళ్ళింటికెళ్ళారు, సెలవలని. నీ అరోగ్యం ఎలా వుంది?" మంచి నీళ్ళిస్తూ అడిగింది.

"పరవాలేదు. అయితే డాక్టరు ఇంకా ఒక రెండు నెలలు సెలవు పెట్టి రెస్టు తీసుకోమన్నాడు. అదొక్కటే నాకు నచ్చలేదు. ఇంకా సెలవు అంటే ఆఫీసులో ఏమంటారో అని భయపడ్డాను. అయితేజీతం లేకుండా సెలవు ఇవ్వడానికి ఒప్పుకున్నారు లే."

"కాఫీ తేనా?"

"కాఫీ వొద్దు! భోజనమే చేస్తాను. అప్పుడొకసారి చపాతీలు, వంకాయ కూర చేసావు చూడు. అది చేద్దాం, ఇద్దరం కలిసి! అసలా పాడు ఆస్పత్రి నించి బయటపడేసరికే నేను సగం బాగయ్యాననుకో! అయితే ఇంకా కారు డ్రైవ్ చేయొద్దన్నారు. టాక్సీలో వచ్చా! నాన్న రాత్రి తొమ్మిదింటికి వచ్చి నన్ను తీసికెళ్తారు. అమ్మా నాన్నా నిన్ను చూడాలనుకుంటున్నారు కూడా!"

"అయాం సారీ అరుణ్! నేనెక్కువగా రాలేకపోయాను. ఇంట్లో పనీ, ఆఫీసులో పనీ, అసలు తీరిక చిక్కలేదు," గిల్టీగా అంది పూర్ణిమ.

"భలేదానివే! నువ్వు సారీ చెప్పడం ఏమిటి? నాకు తెలియదా పూర్ణిమా, నువ్వెంత బిజీగా వుంటావో! నువ్విచ్చిన ప్రోత్సాహం, అభిమానం వల్లనే నేను ఈ మాత్రం కోలుకున్నా, తెలుసా? ఎన్నిసార్లు నేను వేళాపాళా లేకుండా ఫోన్ చేస్తే నువ్వు పాపం ఓపిగ్గా నాతో మాట్లాడలేదు? నువ్వే విసుక్కుని నా చేయొదిలేస్తే నేనేమై పోయే వాణ్ణో! అయాం ఇండెబ్టెడ్ టు యూ!"

ఆమె చేతులు తన చేతుల్లోకి తీసుకొని అన్నాడు.

మృదువుగా చేతులు విడిపించుకుంది.

"దట్సాల్ రైట్ అరుణ్! నువ్వు మామూలుగా అయిపోతే అంతే చాలు. పద, నేను చపాతీల పిండి కలిపేంతలో, టమాటాలూ, ఉల్లిపాయలూ కోసి పెట్టు," లేచింది పూర్ణిమ. అతను ఆస్పత్రి గురించీ, మిగతా పేషెంట్ల గురించీ చెప్తున్న కబుర్లు వింటూ వంట మొదలు పెట్టింది.

మళ్ళీ కాలింగ్ బెల్.

"అదిగో! శివా వచ్చేసారు!" వెళ్ళి తలుపు తీసింది.

"ఏమిటి, వంటింట్లోంచి మంచి వాసనలొస్తున్నాయి?" బూట్లు విప్పుతూ అడిగాడు శివా.

"మీకొక సర్ప్రయిజ్! అరుణ్ వచ్చాడు. ఇద్దరం కలిసి చపాతీలూ, కూరా చేస్తున్నాం. " లోపలికెళ్తూ చెప్పింది పూర్ణిమ.

ఒక్క క్షణం చిరాకు కమ్మింది శివా మొహంలో. బట్టలు మార్చుకుని వంటింట్లోకొచ్చాడు. కానీ, అరుణ్ అమాయకమైన మొహంలో సంతోషమూ, ఆస్పత్రి వదిలేసిన ఉత్సాహమూ చూసి ఏమనలేకపోయాడు.

"నువ్వెళ్ళి కూర్చో అరుణ్. నేనూ, పూర్ణిమా కలిసి చేస్తాంలే. " షర్టు చేతులు పైకి మడిచి అరుణ్ పూర్ణిమ వెనకాలే చనువుగా వంటింట్లో తిరుగుతూంటే అతనికెందుకో అసహనంగా వుంది. అదేమీ అర్థం చేసుకోలేదు అరుణ్.

"నో, నో! మీరు ఆఫీసునించి అలిసిపోయి వచ్చారు. నేను హాయిగా లీవులో వుండి బొజ్జ పెంచుతున్నాను. నేనే సహాయం చేస్తా. వాద్దుయా సే పూర్ణిమా?"

"ఇద్దరూ నా వంటింట్లోంచి బయటికి నడుస్తే మరీ మంచిది!"

మళ్ళీ కాలింగ్ బెల్ మోగింది.ఇంకెవరై వుంటారబ్బా, అనుకుంటూ తలుపు తెరిచాడు శివా.

"శివ బాబూ! నా బిడ్డని కాపాడండి బాబో! బిడ్డ ప్రాణాలమీదికొచ్చినాది బాబో! నా బాబు నన్నన్యాయం చేస్తాడు బాబో!" గొల్లున ఏడుస్తూ రాజమ్మ శివా కాళ్ళు చుట్టేసుకుంది.

"ఏమయింది రాజమ్మా! లే, ముందు. మెల్లిగా కూర్చొని సంగతేంటో చెప్పు!" శివా మెల్లిగా ఆమెని లేపటానికి ప్రయత్నిస్తున్నాడు.

రాజమ్మ నిలబడలేకపోతుంది. దుఃఖంతో ఆమె నోట్లోంచి మాట కూడా రావడం లేదు.

"నా బాబు! ఆస్పత్రిలో వున్నాడయ్యా! ప్రాణం మీదకి తెచ్చుకున్నాడయ్యా! హయ్యో! ఇప్పుడేం జెయ్యాలి దేవుడా?"

"పూర్ణిమా, కొంచెం మంచి నీళ్ళు తే!"

బయట హడావిడికి పూర్ణిమా, అరుణ్ బయటికొచ్చారు. ముందు గ్లాసులో నీళ్ళు తాగించింది పూర్ణిమ.

"మెల్లిగా, రాజమ్మా! అశోక్ కేమయింది? పరీక్షలు బానే రాసాడు కదా? ఇంజినీరింగులో సీటు కూడా వస్తుందనుకున్నాం. మంచి నీళ్ళు తాగి చెప్పు!" పక్కనే కూర్చుని అనునయించింది పూర్ణిమ.

"ఏం చెప్పమంటావమ్మా? పొద్దున్న లేచి నేను పనికి పోయేటప్పుడు ఇంకా పండుకోనే వున్నాడు. సాయంత్రం ఇప్పుడే వస్తనని బయటికెళ్ళిండు. ఆరింటికి ఇంటికొచ్చీ రాంగనే లోపలికి పోయి తలుపేసుకున్నడు. చప్పుడినపడకపోతే ఏదో చదువుకుంటున్నడనుకున్న. ఫాన్ కు ఉరి బిగించుకున్నడమ్మా!" గొల్లుమంది రాజమ్మ.

కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి పూర్ణిమకు. మెల్లిగా రాజమ్మ తలను దగ్గరకి తీసుకొని ఓదార్చసాగింది.

"మరి ఇప్పుడెక్కడున్నాడు?" అరుణ్ అడిగాడు.

"పెద్ద గోల చేసిన సారూ! చుట్టు పక్కల అందరొచ్చి పిలగాణ్ణి కిందికి దింపిన్రు. బేహోష్ అయిండని దవాఖానకు ఉరికినం. బానే వున్నడు కాని, ఇదేం పని అని తిట్టిండు డాక్టరు. ఇవాళ రాత్రి అక్కణ్ణే వుంచుమన్నరు. ఒక సారి మీరు రండమ్మా! ఆ నర్సమ్మ పోలీసు కేసంటుంది. నాకేందో భయమైతుంది."

"పద రాజమ్మా! మేమొచ్చి ఒక సారి మాట్లాడి చూస్తాం, " చెప్పి బట్టలు మార్చుకోవడానికెళ్ళాడు శివా.

పూర్ణిమ లోపలికెళ్ళి స్టవులన్నీ ఆర్పేసి బయటికొచ్చింది. అరుణ్ ఇంకా అక్కడే పాలిపోయిన మొహంతో నిలబడి వున్నాడు.

"అరుణ్! నువ్విక్కడే వుండు. మేమిద్దరం ఒక గంట సేపట్లో వచ్చేస్తాం! లేదా నిను ఇంటి దగ్గర దింపేయమా?" పూర్ణిమ అడిగింది.

"పూర్ణిమా! నేనూమీతో వస్తా!" అరుణ్ గొంతు ఎక్కడో లోతుల్లోంచి వస్తోంది.

శివా లోపల్నించొచ్చాడు.

"ఏమయింది పూర్ణిమా?"

"అరుణ్ మనతో ఆస్పత్రికొస్తానంటున్నాడు. నేనొద్దంటున్నాను."

అసలే మానసికంగా బలహీనంగా వున్న మనిషి ఆత్మహత్యా ప్రయత్నం చేసిన పేషేంటుని చూసి ఎలా స్పందిస్తాడో ఊహించలేకపోయింది పూర్ణిమ.

"ప్లీజ్ పూర్ణిమా! అయాం ఎ బిగ్ బోయ్! ఐ కెన్ హేండిల్ ఇట్." కోపంగా అన్నాడు అరుణ్.

"పోనీ ఒక్కసారి మీ అమ్మా నాన్నలకి ఫోన్ చేసి.."

పూర్ణిమని మెల్లిగా చేయి మీద తట్టి ఆపాడు శివా.

"దట్స్ ఒకే అరుణ్. పద వెళ్దాం."

అందరూ కారెక్కి కాలనీ బయట వున్న చిన్న నర్సింగ్ హోం చేరుకున్నారు.

*************

రూం లో పడుకోని వున్నాడు అశోక్. అమాయకమైన మొహం మీద ఏడ్చినట్టు కన్నీళ్ళ చారికలు. కొడుకుని ఆ పరిస్థితిలో చూసిన రాజమ్మ తల్లడిల్లుతోంది.

రూం బయట అతని స్నేహితులున్నారు. నర్సు బయటికొచ్చి రాజమ్మని చూసి

"డాక్టరు గారు రమ్మంటున్నారు," అని చెప్పి లోపలికెళ్ళిపోయింది. రాజమ్మ తో పాటు శివా, పూర్ణిమా లోపలికెళ్ళారు.

"కూర్చోండి!"

ముందుగా రాజమ్మని చూసి ధైర్యం చెప్పడానికన్నట్టు నవ్వాడు డాక్టరు.

"ఏం భయం లేదు రాజమ్మా! అదృష్టవశాత్తూ తొందరగా చూసి తీసుకొచ్చారు కాబట్టి గండం గట్టెక్కినట్టే. మంచి నిద్ర పోవాలని మందిచ్చా, అంతే. పిల్లవాడెందుకలా చేసాడో నీకేమైనా తెల్సా?"

"అయ్యో! నాకేమెర్క సారూ! పరీక్షలైపోయినై. మంచి మార్కులొస్తై. పెద్ద కాలేజీల చేరతా అన్నడు. ఇంక మార్కులు రాలే గద సారూ?"

"ఇది మార్కుల గొడవ కాదులే! ఇది చూడండి," అని అశోక్ సెల్ ఫోన్ శివా చేతికిచ్చాడు డాక్టరు.

"అందరి దగ్గరా వుంది, నాకొకటి కొని పెట్టుమంటె ఆ ఫోను కొనిచ్చిన సారూ! ఏమున్నదా ఫోన్లో?"

ఫోన్ లో మెసేజీలు తెరిచి చూస్తున్నారు శివా, పూర్ణిమా. విషయం అర్థమైంది వాళ్ళకి.

ఎవరో ఐశ్వర్య దగ్గర్నించే అన్ని మెసేజీలు. బహుశా క్లాసు మేటయి వుండాలి. స్నేహానికీ, ఆకర్షణకీ, ప్రేమకీ తేడాలూ, అర్థాలూ తెలియని వయసులో వున్నట్టుంది. ఆ మెసేజీలు చూసి వాళ్ళకేమాత్రం ఆశ్చర్యం కలగలేదు. ఆఖరి మెసేజీ చూసి వాళ్ళకి నిజానికి నవ్వొచ్చింది.

"నిన్నూ నీ ప్రేమనీ అర్థం చేసుకున్నాను కానీ ఇంట్లో వారికి ఎదురు చెప్పలేను. నన్ను మరిచిపో! నువ్వు లేని నా బ్రతుకు తావి లేని పూవు, ఆకులు లేని చెట్టూ....."

అంటూ ప్రపంచం తెలియని అమాయకపు ఆడపిల్ల, చాలా పెద్దదాన్నైపోయానని అనుకుంటూ రాసిన బ్రేక్-అప్ మెసేజీ. ఆ మెసేజీ చూసి నిరాశతో ఆత్మహత్యా ప్రయత్నం చేసాడన్న మాట.

ఫోన్ రాజమ్మ కిచ్చేసాడు శివా, మెసేజీలన్నీ చెరిపేసి.

"ఏం లేదు రాజమ్మా! ఏదో చిన్న పిల్లల దెబ్బలాట, అంతే! వాడు లేవగానే నేను గట్టిగా మాట్లాడతా గా! నువ్వూ పుర్ణిమా బయటికెళ్ళి కూర్చొంది. నేను డాక్టరు గారితో కొంచెం మాట్లాడి వొస్తా!"

రాజమ్మా, పూర్ణిమా బయటికెళ్ళిపోయారు.

"డాక్టరు గారూ! మీ ప్రొఫెషనల్ ఆబ్లిగేషను నాకు తెలుసు. కానీ, పోలీస్ కేసు కాకుండ వుంచడానికి వీలవుతుందా? మంచి భవిష్యత్తున పిల్లవాడు. ఏదో అమాయకత్వం! ఆవేశం. ఇంకోసారి ఇలా కాకుండ నేనతనితో మాట్లాడతాను. పాపం రాజమ్మ ఒంటరి మనిషి. వాడికేమైనా అయితే తట్టుకోలేదు."

"అలాగే చేద్దాం లెండి. ఏమిటో ఈ కాలం పిల్లలు! పెద్దైపోవాలన్న ఆత్రమే కానీ, పెద్దైతే బ్రతుకులో ఎన్నో ఆటుపోట్లని తట్టుకోవాల్సొస్తుందన్న స్పృహే లేదు!" డాక్టరు బాధగా అన్నాడు.

శివా లేచి బయటికి నడిచాడు. స్నేహితులందర్నీ నర్సు పంపేసినట్టుంది. కారిడార్ ఖాళీగా వుంది.

బయట అరుణ్ ఒక్కడే బెంచీ మీద కూర్చొని వున్నాడు. ఏదో దీర్ఘాలోచనలో వున్నట్టున్నాడు. అతని పక్కనే కూర్చున్నాడు శివా.

"ఏమైంది శివా? ఎందుకలా చేసాడా అబ్బాయి?"

" వెరీ స్టుపిడ్! ఎవరో అమ్మాయిని ఇష్టపడ్డాడు. ఆ అమ్మాయి కొన్నాళ్ళు స్నేహం చేసి మానేసినట్టుంది. దాంతో..."

"బట్ హీ ఈజ్ హార్డ్లీ సెవెంటీన్!"

"అదేం మాట? సినిమాలు చూడటంలేదూ? పధ్నాలుగేళ్ళొస్తే చాలూ, ప్రేమించేయాల్సిందే!" నవ్వాడు శివా.

"ఇట్ వుడ్ బీ సో ఫన్నీ, ఇఫ్ ఇట్ వర్ నాట్ సో ట్రాజిక్! ఇంత చిన్న కారణానికి ఆత్మ హత్య చేసుకుంటారా?" అన్నాడు అరుణ్ బాధగా.

"నేనొప్పుకోను అరుణ్! కారణానికి పెద్దా చిన్నా ఏముంది? అదొక ఆటిట్యూడ్ అంతే! నీకొక కారణం పెద్దదనిపిస్తే, అశోక్ కి ఇంకొక కారణం పెద్దదనిపిస్తోంది. ఎంత పెద్దగా అంటే, బ్రతుకే నచ్చనంత. దాన్ని చిన్న కారణం అని కొట్టేయడానికి మనమెవరం?"

"అంటే?" అతనేమంటున్నాడో అర్థం కాలేదు అరుణ్ కి.

"అంటే, కారణం ఏదైనా ఆత్మహత్య అన్నది తప్పుడు నిర్ణయమే అవుతుంది! అంతే కానీ, పెద్ద కారణానికి చేసుకోవచ్చు, చిన్న కారణానికి చేసుకోకూడదని కాదు. ఆత్మహత్యకి జస్టిఫికేషనే లేదు."

ఇక అతన్ని ఆలోచించుకోనివ్వాలని లేచి అశోక్ పడుకున్న గదిలోకి నడిచాడు శివా.

*********

చిన్నగా కళ్ళు తెరిచి చూసాడు అశోక్. రాజమ్మ మళ్ళీ గొల్లుమంది.

"మా నాయనా! ఎంత పని జేస్తివిరా! నీకేమన్నయితె నేనెట్ల బ్రతుకుదురా? ఉరి పోసుకునేంత కష్టం నీకేమొచ్చిందిరా నాయనా?"

నర్సు లోపలికొచ్చింది అలికిడికి.

"హుష్! ఇది హాస్పిటలు. మీరింత గోల పెట్టకూడదు. రూములో ఎవరైనా ఒక్కళ్ళే వుండాలి. మిగతా ఇద్దరు బయటికెళ్ళండి ప్లీజ్!"

పూర్ణిమ రాజమ్మని తీసుకొని బయటికెళ్ళి కూర్చుంది.

ఒంటరిగా చీకట్లో కుర్చున్న అరుణ్ ని చుసి అటు నడిచింది పూర్ణిమ.

తల దించుకొని ఏడుస్తున్నాడు అరుణ్.

"అరుణ్! ఏమయింది? ఆర్యూ ఆల్రైట్?" గాభరాగా అడిగింది పూర్ణిమ.

కళ్ళు తుడుచుకున్నాడు అరుణ్.

"అయాం ఒకే నౌ. పూర్ణిమా, నేనెన్ని సార్లు చచ్చిపోదామని ప్రయత్నించానో తెల్సా? నాకేదైనా అయితే అమ్మా-నాన్నా..."

అతనికా ఊహతోటే ఒళ్ళు జలదరించింది.

"ఇందాక శివా అన్నాడు, ఆత్మ హత్య కి అసలు జస్టిఫికేషనే వుండదని."

"అవును అరుణ్! తమ కళ్ళముందే తమ పిల్లలు బలవంతంగా మరణించడంకంటే ఘోరమైన శిక్ష వుండదేమో అమ్మా-నాన్నలకి. ఆ తర్వాత వాళ్ళనుభవించే నరకయాతన.."

"లేదు పూర్ణిమా! ఇక నేనెప్పుడూ అలాటి ఆలోచనే చేయను. ఎన్ని మందులైనా మింగి నా ఆరోగ్యం బాగు చేసుకుంటాను. ఎలాగైనా సరే ఐ విల్ ఫైట్! నువ్వు ఎప్పటిలా నా పక్కనుంటే చాలు పూర్ణిమా! నిన్ను చూస్తే చాలు, నాకెక్కళ్ళేని ధైర్యమూ వస్తుంది. కేవలం నీ గొంతు వినడానికే నీకు బోల్డు సార్లు ఫోన్ చేస్తాను. అలాగని నీ లైఫ్ ఏదీ డిస్టర్బ్ చేయను. నీ స్నేహం తప్ప నాకింకేదీ వొద్దు పూర్ణిమా! విల్ యూ బీ ఆల్వేస్ మై ఫ్రెండ్?"

"అరుణ్! నేనెప్పటికీ నీ స్నేహితురాల్నే. అయితే, ఒక్క విషయం నీతో చెప్పక తప్పదు. వీలైనంత వరకూ మనక్కావాల్సిన ధైర్యాన్నీ, ఆశలనీ మనం లోపల్నించే తెచ్చుకోవాలి తప్ప బయట వెతుక్కోకూడదు. మనక్కావాల్సిన మానసిక శక్తి మనం లోపల్నించే తెచ్చుకోవాలి. అప్పుడే మనం నిజంగా స్వతంత్రులమైనట్టు. నువ్వా దిశగా ప్రయాణం చేయాలి. శక్తి కోసం నావైపో, ఇంకొకరివైపో చూడకుండా నువ్వే పదిమందికి శక్తినివ్వగలిగి వుండాలి. అదీ, నాక్కావల్సింది."

"థాంక్ యూ పుర్ణిమా! నువ్వు చెప్పిన దాని గురించి ఆలోచిస్తాను."

"గుడ్! ఇందాక మీ నాన్నగారు ఫోన్ చేసారు. ఆయన ఇప్పుడొచ్చి నిన్ను తీసికెళ్తారు. ఇంటికెళ్లి రెస్టు తిసుకో! సరేనా?"

************

మర్నాడు సాయంత్రం అశోక్ ని డిశ్చార్జి చేసారు. రాజమ్మనీ, అశోక్ నీ ఇంటి దగ్గర దిగబెట్టి ఇంటికొచ్చారు శివా పూర్ణిమా.

"పూర్ణిమా! కొంచెం కాఫీ ఇస్తావా? తల పగిలిపోతోంది!" అలసటగా అన్నాడు శివా.

లోపలికెళ్ళబోతూ ఫోన్ మోగడంతో ఆగింది పూర్ణిమ.

"హలో పుర్ణిమా! ఇవాళ ఆఫీసుకి రాలేదేం? నీ కోసం మీ లేబ్ కి నాలుగైదు సార్లు ఫోన్ చేసాను."

"హాయ్ సీతా! అదంతా రేపు చెప్తాలే. పెద్ద కథ. ఇంతకీ ఏమిటి సంగతి?"

"పూర్ణిమా! ఎస్. ఆర్. కే కి మాసివ్ హార్ట్ ఎటాక్! కేర్ హాస్పిటల్లో వున్నాడట. రేపు శనివారం, వెళ్ళి చూసి రావాలని వుంది కాని, ఒంటరిగా వెళ్ళాలని లేదు. కృష్ణ వూళ్ళో లేరు. నువ్వు కొంచెం తోడొస్తావా?" సీత గొంతులో డల్ నెస్ విని పూర్ణిమ ఆశ్చర్యపోయింది.

"అలాగే వస్తాను. ఎన్నింటికెళ్ళాలి?"

"మధ్యాహ్నం రెండు తర్వాత విజిటింగ్ అవర్స్. నేను మీ ఇంటికి పన్నెండున్నరకొస్తా. రెడీగా వుంటావా?"

"అలాగే సీతా! ఇంట్లో ఒక్కదానివే ఉన్నావా, పిల్లలున్నారా?"

"ఒక్కదాన్నే వున్నా! కృష్ణ కేంప్ కెళ్ళారు. పిల్లలు అమ్మా వాళ్ళింటికెళ్ళారు."

"పోనీ, ఇక్కడికొస్తావా?" సీత చాలా ఆందోళనగా వున్నట్టనిపించి, అడిగింది పూర్ణిమ.

"వొద్దులే! ఐ విల్ బి ఆల్ రైట్. రేపు కలుద్దాం. బై."

************

మర్నాడు సరిగ్గా పన్నెండున్నరకొచ్చింది సీత. ఇద్దరూ నడుచుకుంటూ కాలనీ గేటు దాకా వెళ్ళారు. కాలనీ బయటికొచ్చి కేర్ హాస్పిటల్ కి ఆటో మాట్లాడుకుని కూర్చున్నారు.

ఆటో బయల్దేరాక అడిగింది పూర్ణిమ, "ఇప్పుడు చెప్పు! ఏం జరిగింది? అసలు హార్ట్ ఎటాక్ వచ్చిందని నీకెవరు చెప్పారు?"

"కిందటి వారం లీవు లో వున్నాడతను. సోమవారం నించీ ఆఫీసుకి తిరిగి రావాలి. రాలేదు. లీవు పొడిగిస్తున్నట్టు సమాచారమూ లేదు. మధ్యాహ్నం వాళ్ళ చెల్లెలు ఫోన్ చేసారు. కిందటి వారం గుండెల్లో బాగా నొప్పిగా అనిపిస్తే హాస్పిటల్ కి

తీసికెళ్ళారట. ఆర్టరీస్ లో బ్లాక్ వుందని స్టెంట్ వేసారట. నెమ్మదించింది కానీ ఇంటిల్లిపాదీ చాలా భయపడ్డారట. ఇంకో నాలుగు రోజులు ఆస్పత్రిలో వుంచి డిశ్చార్జి చేస్తారేమో బహుశా. మా కొలీగ్స్ కొందరు నిన్న వెళ్ళి చూసొచ్చారు కానీ, నాకు నువ్వూ తోడొస్తే బాగుండనిపించి ఆగాను."

ఇంకేం మాట్లాడలేదు సీత. ఏదో ఆలోచిస్తూ వుండిపోయింది.

*******************

తలుపు దగ్గర చప్పుడుకి తలెత్తి చూసాడు ఎస్.ఆర్.కే.

"అరే! మీరా! సీతగారూ రండి. ప్లీజ్ కమిన్!" ఆశ్చర్యపోయినట్టున్నాడు.

"మా బాస్, సీత గారు. ఆవిడ ఫ్రెండు పూర్ణిమ గారు. మై వైఫ్, శోభ." పరిచయాలు చేసాడు.

"కూర్చోండి," ఆవిడ లేచి ఇద్దరికీ కుర్చీలు చూపించింది.

"అయాం సారీ ఎస్.ఆర్.కే! ఎలా జరిగిందంతా? ఇప్పుడేమీ పర్వాలేదు కదా!"

కొంచెం సేపు మౌనంగా వున్నాక అడిగింది సీత.

"ఏమోనండి! అసలు నాకెప్పుడూ ఏ ఆరోగ్య సమస్యలూ రాలేదు. పది రోజుల కింద ఎడమ భుజమూ అంతా బాగా లాగుతున్నట్టనిపించింది. ఆ రాత్రి చాలా నొప్పితో, అసౌకర్యంగా వుండి, అంబులెన్స్ పిలిచాము. రాగానే, ఈ.సీ.జీ అవీ చూసి, హార్ట్ ఎటాక్ అన్నారు. స్టెంట్ వేసారు."

"అవునా! మీ ఫామిలీ చాలా అదృష్టవంతులు. గెట్ వెల్ సూన్. పని గురించీ, ఆఫీసు గురించీ ఎలాటి టెన్షన్లూ పెట్టుకోకండి."

"అవును సీత గారూ. ఇంత దెబ్బ తగిలితే గానీ మనం ఆరోగ్యాన్నీ, జీవితాన్నీ ఎంత గ్రాంటెడ్ గా తీసుకుంటామో తెలిసి రాలేదు. ప్రాణాల మీది కొచ్చినప్పుడే, మనం రోజూ తలలు పగలగొట్టుకునే విషయాలు అసలంత పెద్దవేమీ కాదన్న జ్ఞానం వచ్చింది నాకు." నవ్వుతూ అన్నాడు శివరామ కృష్ణ.

ఇంతలో అతని చెల్లెలూ, కూతురూ కలిసి వచ్చారు.

"మా చెల్లెలు సునీతా , అమ్మాయి నిఖిల." పరిచయం చేసాడు.

"మరి ఇక మేమొస్తాం. మీరు రెస్టు తీసుకోండి," అందరికీ చెప్పి బయల్దేరారు. వాళ్ళతో పాటు కిందికొచ్చింది సునీత.

"వెళ్ళొస్తాం సునీతా. టేక్ కేర్."

"థాంక్ యూ మేడం! ఇంత శ్రధ్ధగా అన్నయ్య కొరకు వచ్చినందుకు! యూ నో! హీ అడ్మైర్స్ యూ ఏ లాట్. నన్నూ ప్రొఫెషన్లో మీలా చురుగ్గా వుండాలనీ, చాక చక్యంగా ఇంటినీ, వృత్తినీ బాలెన్సు చేసుకోవాలనీ చెప్తూంటాడు!"

"వాట్!" నిర్ఘాంతపోయింది సీత.

"మా నిఖిలకి కొంచెం చదువు మీద శ్రద్ధ తక్కువ లెండి. అదే అన్నయ్యకి కొంచెం దిగులు. ఆడైనా మగైనా, చదువు బాగా చదువుకోవాలనీ, తన కాళ్ళ మీద తను నిలబడాలనీ అన్నయ్య చెప్తూంటాడు. మా వదిన కూడా ఎం.కాం చదువుకుని బాంకులో మేనేజరుగా పని చేస్తారు."

"ఇంతకీ నువ్వేం చదువుతున్నావు సునీతా?" పూర్ణిమ అడిగింది.

"ఆరిటెక్చర్. ఫైనల్ ఇయర్. టవున్ ప్లానింగ్ లాటి ఫీల్డులో ఏదైనా వుద్యోగం దొరికితే చేయాలని వుంది. "

"వెరీ గుడ్! బెస్ట్ ఆఫ్ లక్ విత్ దట్! వుంటాం మరి."

బయటికొచ్చి ఆటో ఎక్కారిద్దరూ.

ఇంటి దగ్గర ఆటో దిగుతూ,

"లోపలికొచ్చి కొంచెం కాఫీ తాగుదువుగాని, రారాదూ?" ఆహ్వానించింది సీత.

ఇంటికెళ్ళి చేసే పెద్ద పనేమీ లేదు. శివా వచ్చేసరికి ఏడన్నా అవుతుంది. కాసేపు రిలాక్సవచ్చు అనుకుంటూ పూర్ణిమ ఆటో దిగింది.

బేగు సోఫాలో పడేసి కాఫీ పెట్టడానికి లోపలికెళ్ళింది సీత.

ఇద్దరూ కాఫీ కప్పులతో బాల్కనీలోకొచ్చి కూర్చున్నారు.

"రాజమ్మ కొడుకు డిశ్చార్జి అయ్యాడా? ఒక్కసారి వచ్చి నీకు సాయం చేద్దామంటే వీలే పడలేదు."

"పర్వాలేదులే. అయినా భలే భయపెట్టాడు. టీనేజీ పిల్లలు ఏమాలోచిస్తున్నారో, ఏం చేస్తున్నారో, కనిపెట్టడం కష్టమేమో, ఎంత శ్రద్ధగా వున్నా! "

"అవును! చక్కగా చదువుకునే పిల్లాడు. ఏదో ఉద్యోగం సంపాదించి తల్లిని సుఖపెడతాడనుకుంటే..."

"నాకు కొన్నిసార్లు భయంగా వుంటుంది తెలుసా! నీహారికా, సంజూ, వాళ్ళని నేనసలు సరిగ్గా పెంచుతున్నానా అని."

"ఛ! అవేం మాటలు! ఇద్దరూ బుద్ధిమంతులు. నీ పిల్లలు నీలాగే వుంటారు." అభిమానంగా అంది సీత.

తన పిల్లలని ఎవరైనా ప్రశంసిస్తే తల్లి మొహం లో వచ్చే వెలుగు పూర్ణిమ మొహమంతా పరచుకుంది.

"ఏమో, మనం కొంతవరకే కదా వాళ్ళని పెంచేది. ఆ తర్వాత బయట ప్రపంచమూ, మార్కెట్ శక్తులూ, మీడియా యుక్తులూ, ఒంట్లో వెల్లువలెత్తే హార్మోన్లూ, ఇన్నిటి మధ్యా చిన్న ప్రాణాలు కొట్టుకుపోవడం ఎంత సేపు!"

"అవును. అదీ నిజమే. దానికి తోడు, సరిగ్గా ఇప్పుడే మనకీ శరీరం లో వచ్చే మార్పులూ, పెద్దవాళ్ళ బాధ్యతా, వృత్తి పరమైన వత్తిళ్ళూ. దేన్నీ నిర్లక్ష్యం చేయలేని పరిస్థితి ..."

కొంచెం సేపు ఏదో ఆలోచనలో కొట్టుకుపోయింది సీత. వున్నట్టుండి అంది-

"పూర్ణిమా! చావుకీ బ్రతుక్కీ మధ్య గీత ఎంత సన్ననిది కదా?

నన్ను రోజూ విసిగించి చిరాకు పెట్టి, మనశ్శాంతి లేకుండా చేసిన ఎస్.ఆర్.కె. ఇంకొక్క పదిహేను ఇరవై నిమిషాలు ఆలస్యంగా ఆస్పత్రి చేరుకునివుంటే, మిగిలి వుండే వాడే కాదు. ఎన్నిసార్లు ఆ విషయం తలచుకున్నా అన్నిసార్లు నాకు భయంతో ఒళ్ళు జలదరిస్తుంది. మనం వుండడానికీ, వుండకపోవడానికీ మధ్య అంత సన్నని తెర వుందా? అంత సన్నని తెర ఆధారంగా మనం అంతులేని ఆశలూ, అర్థం లేని భయాలూ, గాఢమైన అనుభూతులూ.... నాకేమీ అర్థం కావడం లేదనిపిస్తుంది. లేకపోతే, అసలు అర్థం చేసుకోవడానికేమీ లేదేమో."

పూర్ణిమ ఏమీ మాట్లాడలేదు.

"Some how it is not adding up! ఇంత అన్-రిలయబుల్ జీవితం చుట్టూ మనం ఎందుకిన్ని ముళ్ళ కంచెలు పోగు చేసుకుంటున్నాం? ఒక్క నిమిషంలో మన జీవితం చుట్టూ ఆవరించుకున్న అనుభవాలు అర్థం లేకుండా అయిపోవచ్చుకదా? Then why this many hang-ups? నీకో సంగతి చెప్పనా?"

చెప్పమన్నట్టు చూసింది పూర్ణిమ.

"నాకు మూడు నాలుగు రోజులనించీ మా అత్తగారు జ్ఞాపకం వస్తున్నారు. నేను చాలా ఇన్సెక్యూర్ మనిషిని పూర్ణిమా. చిన్నప్పట్నించీ పెద్ద కుటుంబంలో పుట్టి ఉమ్మడి కుటుంబంలో పెరిగి, నాకంటూ ఒక్క వస్తువు కూడా స్వంతంగా లేకుండా పెరిగాను. పుస్తకాలూ, బట్టలూ, అమ్మా నాన్నల ప్రేమా, అన్నీ నలుగురు తోబుట్టువులతో పంచుకుంటూ నా బ్రతుకు మీద నాకేమాత్రం కంట్రోల్ లేనట్టు వుండేదాన్ని. అలాటిది వున్నట్టుండి నాకు మాత్రమే స్వంతమైన భర్తా, ఇల్లూ దొరికేసరికి పొంగిపోయాను. అతన్ని ఎవ్వరితోనూ, ఆఖరికి అతని తల్లి దండ్రులతోనూ పంచుకోవడం నాకు నచ్చలేదు. నాకు తెలియకుండానే నేను కృష్ణకీ అతని కుటుంబానికీ మధ్య దూరం ఏర్పాటు చేసాను. ఏమీ తెలియని చిన్నతనం. కనీసం నా భయాలు గుర్తించి నాకు ఎవరైనా కౌన్సెలింగ్ ఇచ్చి వుంటే మారేదాన్నేమో కానీ, మనకసలు అలాటి ఆలోచనే రాదు. మెల్లి మెల్లిగా వాళ్ళు మమ్మల్ని ఒంటరిగా ఒదిలేసారు. మా ఒంటరితనమే మాకు బాగుందనుకుంటూ, అతని బంధువులనుంచి అతన్ని రక్షిస్తున్నాననుకుంటూ నన్ను నేను మభ్య పెట్టుకుంటున్నానేమో! ఇప్పుడాలోచిస్తే నా ఇన్సెక్యూరిటీలూ భయాలూ ఎంత అర్థం లేనివి కదా అనిపిస్తూంది. మా అత్తగారూ పెద్దవారవుతున్నారు. రేపో మాపో ఆవిడా రాలిపోక తప్పదు. అప్పుడు కృష్ణ నన్ను క్షమిస్తాడా? ఈ వయసులో ఆవిడని కొడుకు దగ్గర్నించి దూరం చేసి నేను బావుకున్నదేమిటి? ఎందుకు ఆవిడతో మా ఇంటినీ, నా డబ్బునూ, కృష్ణ ప్రేమనూ ఏది పంచుకోవాలన్నా చాలా అయిష్టంగా వుండేది. అసలు 'నాది' అనుకోవడమే ఒక అర్థం లేని ఆలోచన అయినప్పుడు ఇహ పంచుకునేదేమిటి? ఏదో ఒక లాటి వైరాగ్యం చుట్టు ముడుతుంది నన్ను. కానీ ఇంతకు ముందున్న అశాంతి లేదు. ఇంతకు ముందు అన్నీ నా కంట్రోలులో లేక పోవడం ఏదో నా తప్పున్నట్టనిపించేది. ఇప్పుడు ఎవరి అధీనంలో వుండకపోవడమే జీవితపు లక్షణం అనిపిస్తోంది."

కాసేపు తన ఆలోచనల్లో తనుండి పోయింది సీత.

"అందుకే కృష్ణ కాంపు నించి రాగానే పిల్లలని తీసుకుని అత్తగారింటికి వెళ్ళి నాలుగురోజులుండి వస్తా. ఏమంటావ్?"

మనసులో అనవసరమైన కోపాలూ ద్వేషాలూ అసహనాలూ అన్నీ కడుగుతున్నట్టు సీత కళ్ళల్లోంచి నీళ్ళు కారుతున్నాయి. పూర్ణిమ సీత చేయి తన చేతుల్లోకి తీసుకొని ఆప్యాయంగా నొక్కింది.

కాలింగ్ బెల్ మోతకి ఇద్దరూ ఉలిక్కి పడ్డారు. లేచి తలుపు తెరిచింది సీత కళ్ళు తుడుచుకుంటూ. శివా లోపలికొచ్చాడు.

"ఏం లేదు! చీకటైపోయింది. పూర్ణిమ ఒక్కతీ భయపడుతుందేమో, తీసికెళ్దామని వచ్చా!" సంజాయిషీగా అన్నాడు.

ఇద్దరికీ నవ్వాగలేదు.

పూర్ణిమా, శివా, సీత ఇంటినించి బయటికొచ్చి తమ ఇంటి వైపు నడవసాగారు.

"అంతలోకే వచ్చేసారే? నేనిక్కడున్నట్టు ఎలా తెలుసు?"

" ఊరికే గెస్ చేసా. నువ్వు సీతతో కలిసి ఆస్పత్రి కెళ్తానన్నావుగా? అక్కణ్ణించి వాళ్ళింటికే వెళ్ళి వుంటావనిపించింది. ఇంట్లో పిల్లలూ లేకపోతే ఎంత బోరుగా వుంది కదా? అందుకే ఊరికే చల్లగాలికి నడుచుకుంటూ వచ్చేసా!"

నవ్వింది పూర్ణిమ. నిజంగానే అతనితో కలిసి చల్లటి గాలిలో విశ్రాంతిగా నడవడం హాయిగా అనిపించింది.

"ఏమంటూంది సీత ? ఎలా వుందా కొలీగ్ కి?"

"ఫర్వాలేదు. కానీ చాలా పెద్ద గండం గడవడంతో అందరూ ఉలిక్కి పడ్డారు."

ఇల్లు చేరుకున్నారు.

"పిల్లలెప్పుడొస్తారో! ఇల్లంతా చిన్నబోయింది."

"ఇంకెంత! రెండు వారాల్లో స్కూలు తెరుస్తారుగా. పై ఆదివారం రమ్మంటాను. నీహారిక ఈ సంవత్సరం పన్నెండో క్లాసు! మార్కుల పోటీ మొదలవుతుందేమో!" బెంగగా అంది పూర్ణిమ.

"అది బానే చదువుతుందిలే. నువ్వనవసరంగా దాని మీద వొత్తిడి తేకు. దానికి నచ్చిన కోర్సులో సీటొస్తే చాలు."

"ఇప్పుడిదాకా హాయిగా ఇక్కడ సెంట్రలు స్కూలులో నడిచిపోయింది. ఇక ముందు ముందు కాలేజీ ఖర్చులూ, కాలేజీ లైఫ్ స్టైలూ, ఎలా వుంటాయో ఏమో!"

"ఏం పరవాలేదు. అయినా ఇంజినీరింగూ, మెడిసినూ అంటూ కాకుండా జర్నలిజమో, ఫోటోగ్రఫీనో చదివితే బాగుండు మన పిల్లలు."

"చూద్దాం ఎలా అవుతుందో."

ఎదుగుతున్న వయసులో పిల్లలున ఇళ్ళల్లో జరిగే మామూలు సంభాషణ, ఎన్ని గంటలైనా అలాగే సాగిపోతూ వుంటుంది. వంటింట్లో వంట చేద్దామని ఫ్రిజులో కూరగాయలు తీస్తోంది పూర్ణిమ.

"అబ్బ పూర్ణిమా! ఇప్పుడు వంట మొదలు పెట్టావా? బాగా ఆకలిగా వుంది. బయటికెళ్ళి తినేసొద్దాం పద."

"ఇప్పుడా?"

"ఏం? ఇప్పుడు ఏడున్నరేగా అయింది? వంటయ్యేదాకా ఆగే ఓపిక లేదు. లెటజ్ గో అవుట్."

"సరే మరయితే, అయిదు నిముషాల్లో తయారవుతాను."

కార్లో వాళ్ళ కాలనీ దాటి బయట రెస్టారెంటు చేరేసరికి పావుగంటయింది.

ఖాళీగా వున్న చోటు చూసుకుని కూర్చున్నారు. మధ్యాహ్నం ఆస్పత్రి లో కలిసిన సునీతా, శోభల గురించి చెప్తోంది పూర్ణిమ.

"మీరంటే మా అన్నయ్యకి ఎంతో అడ్మిరేషన్ అని ఆ అమ్మాయి అనేసరికి మా సీతకైతే మూర్ఛ వచ్చినంత పనైంది. అది ఆయన్ని ఎన్ని తిట్లు తిడుతూ వుంటుందో రోజూ!"

నవ్వాడు శివా. ఉన్నట్టుండి ఎవర్నో చూసి చేయి వూపాడు. వెనక్కి తిరిగి చూసింది పూర్ణిమ. లోపలికొస్తున్నారు, అరుణ్, పక్కనే ఎవరో అమ్మాయి.

"ఎవరా అమ్మాయి? నీకు తెల్సా?" శివా అడిగాడు.

"లేదే, నేనూ ఎప్పుడూ చూడలేదు."

అరుణ్ పక్కనే నడుస్తూ, చాలా బాగుందా అమ్మాయి. జీన్స్ పేంటు, మంచి షర్టూ, కళకళలాడే మొహం, ఎవరబ్బా ఈ అమ్మాయి! ఆలోచనల్లోనే వాళ్ళిద్దరూ దగ్గరకొచ్చారు.

"హాయ్ పూర్ణిమా! హల్లో శివా! వాటే సర్ప్రయిజ్!" నవ్వు మొహంతో దగ్గరకొచ్చాడు అరుణ్.

పూర్ణిమ పక్కనే కూలబడ్డాడు, ఆ అమ్మాయికి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చోమని సూచిస్తూ!

"తను సారిక. మేముండే బిల్డింగ్ లో కొత్త అపార్ట్మెంట్ లో ఈ మధ్యే దిగారు. సారికా! నేను చెప్పలే, నాకు చాలా క్లోజ్ ఫ్రెండ్స్, పూర్ణిమా, శివా!" పరిచయం చేసాడు అరుణ్. మొహమాటంగా నవ్వింది‌దామె.

"మీరేంటిలా? పిల్లలు లేరని రొమాంటిక్ డిన్నర్ కొచ్చారా?"

తన మాటలకి తనే నవ్వాడు అరుణ్.

అరుణ్ మూడ్ చాలా బాగున్నట్టు అర్థమవుతూనే వుంది. మొహం వెలిగిపోతుంది. నీటుగా డ్రస్ చేసుకొని, అందంగా ఆహ్లాదంగా వున్నాడు.తనూ నవ్వుతూనే వున్నా, తన నవ్వు ఎందుకో నీరసంగా అనిపించింది పూర్ణిమకి.

"రొమాంటిక్ డిన్నర్ అంటే గుర్తొచ్చింది. మీరిద్దరూ ఇక్కడ ఎందుకు మాతో పానకంలో పుడకల్లా? అక్కడ మూలన ఇంకో టేబిల్ దగ్గర కూర్చోవచ్చుగా? మీకూ ప్రైవసీ వుంటుంది," శివా తిరిగి అంటించాడు.

ఆ అమ్మాయి మొహం సిగ్గుతో ఎర్రబడింది.

"నో! నో! అందరమూ ఇక్కడే తిందాం. ఏమంటావ్ సారికా?"

"నో ప్రాబ్లెం. అందరం కలిసి కబుర్లు చెప్తూ భోజనం చేయ్యొచ్చు," ఆ అమ్మాయి కలుపుగోలుగా అంది.

భోజనం చేస్తూ మామూలుగా కబుర్లు చెప్పుకుంటూన్నా పూర్ణిమకెందుకో మనసు మనసులో లేదు. ముడుచుకుని పోయి అస్సలు ఆ అమ్మాయితో మాట్లాడలేకపోయింది.

అరుణ్ మొహంలో సంతోషం, సారికని చూస్తూ మెరుస్తున్న అతని కళ్ళూ , నవ్వులూ, వాళ్ళిద్దరి బాడీ లాంగ్వేజీ ఆమెకెందుకో అసహనంగా అనిపిస్తున్నాయి. ఒంటికి కారం రాసుకున్నట్టనిపిస్తోంది ఎందుకో.

తనదైన బొమ్మని ఎవరో లాక్కుంటున్నట్టు నొప్పి! ఆ ఆలోచనతోనే ఉలిక్కిపడింది. ఏమాలోచిస్తుంది తను? తనకి అరుణ్ తో ఏ సంబంధముందని ఈ పొసెసివ్ నెస్? అసలు తామిద్దరి మధ్యా స్నేహం తప్ప వేరే ఏ రకమైన బంధముండటానికి ఆస్కారముంది? అతను ఇంకో అమ్మాయి వైపు ప్రేమగా చూసినందుకే తనకు కష్టంగా వుండడమేంటి? ఆ సంగతి తెలిస్తే శివా ఎంత బాధపడతాడు?

ఎంత ప్రయత్నించినా ఆ రాత్రి వాళ్ళెవరితోనూ కలిసి సరదాగా ఉండలేకపోయింది.

ఉన్నట్టుండి అరుణ్ అననే అన్నాడు, "పూర్ణిమా! ఎందుకో డల్ గా వున్నావే? ఆర్ యూ ఆల్ రైట్?" అని. గతుక్కుమంది పూర్ణిమ. ఆడవాళ్ళకి సహజంగా వుండే ఇంట్యూషన్ తో ఆ అమ్మాయి తన ఆలోచనలు పసిగడితే! సిగ్గు చేటు.

మొహానికి నవ్వు పులుముకుంది.

"ఏం లేదు అరుణ్! ఇక్కడికొచ్చేముందే పిల్లల గురించి మాట్లాడుకున్నాము. సెలవులని వాళ్ళు మా అమ్మా వాళ్ళింటికి వెళ్ళి మూడు వారాలవుతుంది. దిగులుగా అనిపిస్తూంది కదా అనుకుంటూన్నాము, ఇంతలో మీరు కనపడ్డారు. బహుశా అదే మూడ్ లో వున్నానేమో!" అంది.

"సారికా! నువ్వు వీళ్ళ నీహారికనీ, సంజూనీ చూస్తే వదిలిపెట్టవు. చాకుల్లాంటి పిల్లలు." అరుణ్ అన్నాడు.

"చాల్లే! అరుణ్! నువ్వూరికే గొప్పలు చెప్తావు. అతని మాటలేవీ నమ్మకండి." పైకి అన్నదేకానీ, పిల్లలు గుర్తొచ్చేసరికే ఆమె మనసు ప్రశాంతంగా అయింది.

భోజనం ముగించి బయటికొచ్చారు నలుగురూ.

"ఇంటికొచ్చి కాసేపు కూర్చుందురుగాని, వస్తారా?" అప్రయత్నంగా అంది పూర్ణిమ. అరుణ్ సరేననబోతూ సారిక వైపు చూసాడు. ఏమనిపించిందో కానీ,

"వద్దులే పూర్ణిమా! ఇంకోసారి వస్తాం. మళ్ళీ ఇల్లు చేరేసరికి చాలా రాత్రవుతుంది. పొద్దున్నే నీకు ఆఫీసు. నాకంటే ఇంకో వారం లీవుందనుకో!" అన్నాడు.

శివా కలగజేసుకొని, "అవును అరుణ్. జాగ్రత్తగా వెళ్ళండి. వీ విల్ మీటెగైన్. బై సారికా!" గుడ్ నైట్ చెప్పుకుని ఎవరి కారు దగ్గరికి వాళ్ళెళ్ళి పోయారు.

"ఇంతకు ముందైతే ఎప్పుడు మనం అడిగినా కాదనేవాడు కాదు అరుణ్. ఇప్పుడు చూడండి, ఆ అమ్మాయి వైపు చూస్తున్నాడు," ఉక్రోషంగా అంది పూర్ణిమ.

"చిన్నపిల్లలా మాట్లాడకు పూర్ణిమా! అందమైన వెన్నెల రాత్రి వాళ్ళిద్దరూ ఏకాంతంగా మాట్లాడుకుంటూ వెళ్ళాలనుంటుందా వుండదా? నాకైతే మన పెళ్ళయి ఇన్నేళ్ళైనా మనం హాయిగా మాట్లాడుకుంటూన్నప్పుడు మూడో వ్యక్తి వస్తే మహా చిరాగ్గా వుంటుంది. వాళ్ళు చిన్న పిల్లలు. వాళ్ళకెలా వుంటుందో ఆలోచించు!" నవ్వుతూ అన్నాడు శివా.

పూర్ణిమకి ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు. ఇక అరుణ్ కి తనతో అవసరమేమీ వుండదా! హాయిగా పెళ్ళాడి సంతోషంగా ఆ అమ్మాయితో వుంటాడు.

"*నిన్ను చూస్తే చాలు, నాకు ధైర్యం వస్తుంది పూర్ణిమా, నీ గొంతు వినడానికే నీకు ఫోన్ చేస్తాను. కొన్నిసార్లు నాకు శివాకి నా మీద కోపం వస్తుందేమో అని భయం కూడా వేస్తుంది,*" అనో

"*నిన్న నువ్వు కట్టుకున్న పసుపు రంగు చీర లాటిది కొనుక్కోమని అమ్మతో చెప్పా,*" అనో

"*అరే! కొత్త చెవి దిద్దులు పెట్టుకున్నావే! చాలా బాగున్నాయి,*" అనో అనడు.

ఆమె మనసంతా అదో లాటి వేదనతో నిండి పోయింది. పరాయి మగవాడి స్నేహం పోతుందన్న వేదనకి తాను గురవుతుందనుకుంటే చెప్పలేనంత అపరాధ భావమూ ఆమెని కలవర పెడుతూంది. పక్కనే ప్రశాంతంగా పడుకుని వున్న శివా వైపు చూసింది. ఎంత హాయిగా నిద్ర పోతున్నాడు, ఏ సమస్యా తనని అంటనట్లు! ఒక్క క్షణం అతన్ని చూస్తే ఈర్ష్యగా అనిపించింది పూర్ణిమకి.

*******

ఆఫీసులో సీరియస్ గా పని చేసుకుంటూంది పూర్ణిమ.

"హలో పూర్ణిమా!" తలెత్తి చూసింది. రూపిణి తలుపు దగ్గర నిలబడి వుంది నవ్వుతూ. మనిషి కొంచెం చిక్కినా మొహం తేటగా వుంది.

"హాయ్! రూపిణీ! ఎప్పుడొచ్చావ్? లోపలకి రా కూర్చో!"

"నో! ఇక్కడ కాదు. కాంటిన్ కెళ్దాం రా. నువ్వు బిజీగా వుంటే తర్వాత మాట్లాడదాం."

"అంత బిజీ యేం కాదులే!" పర్సు తీసుకుని బయటికి నడచింది పూర్ణిమ.

కాఫీ మగ్గులు తెచ్చుకుని ఒక మూల కూలబడ్డారిద్దరూ.

"చెప్పు రూపిణీ! ఎలా వున్నావ్? హైదరాబాద్ ఎప్పుడొచ్చావ్? అన్ని సమస్యలూ సర్దుకున్నాయా?"

"ఆగాగు! ఒక్కొకటే చెప్తా! హైదరాబద్ మొన్న శనివారం వచ్చా. వచ్చి కాస్త ఇల్లంతా సర్దుకుని రెస్టు తీసుకుని ఇవాళ్టినించే ఆఫీసుకొస్తున్నా. పొద్దుణ్ణించీ మెయిల్సూ ఉత్తరాలూ అన్నీ చూస్కుని, ఇదిగో నీతో మాట్లాడడానికి ఇప్పుడు తీరిక చిక్కింది. ముందు ఇక్కడి విశేషాలు మాట్లాడుకున్నాక నా సంగతులు చెప్తాను."

నవ్వింది పూర్ణిమ.

కాఫీ ముగించింది రూపిణి.

"పూర్ణిమా! నేను అజిత్ తో విడిపోవాలని నిశ్చయించుకున్నాను."

"తొందరపడకు రూపిణీ!"

"లేదు పూర్ణిమా! తొందరపాటు కాదు. చాలా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నాను."

"లలిత్ కి తెలుసా ఈ విషయం."

"ఏమో నాకు తెలియదు. నిజానికి నేను లలిత్ తో అహమదాబాదు వెళ్ళింతర్వాత ఒకటి రెండు ఈ మెయిల్సు తప్ప ఇంక మాట్లాడలేదు. ఇద్దరు మగవాళ్ళూ కలిసి నన్నొక ఆత్మ గౌరవం లేని దానిలా నిలబెట్టకముందే మేలుకోవాలనిపించింది."

కాసేపు మౌనం.

"నిజం పూర్ణిమా! నిజానికి నన్ను లలిత్ కంటే అజిత్ ఎక్కువ అవమానించాడనిపిస్తుంది. కట్టుకున్న భర్త నుంచి ఇష్టమో, అయిష్టమో, దేన్నైనా భరించొచ్చు కానీ, నిర్లిప్తత చాలా అవమానంగా అనిపిస్తుంది తెలుసా! ఇప్పుడనే కాదు, మా పెళ్ళయినప్పట్నించీ అంతే. మీకు నేను నచ్చలేదా, పోనీ ఇంకెవర్నైనా ప్రేమించారా అని కూడా అడిగాను. మరి నిజంగానే ఏమీ లేదో, లేక నా మీద నమ్మకాన్ని నేనే కలిగించలేకపోయానో కానీ ఏమీ లేదన్నాడు. వాళ్ళ ఇంట్లో కూడా ఎవరూ అతను నాతో ముభావంగా వుండడాన్ని పెద్ద పట్టించుకోలేదు. అతని నిర్లక్ష్యమే నన్ను లలిత్ వైపు నెట్టిందేమో నాకు తెలియదు. వాట్ ఎవర్, అహమదాబాదులో దాక్కుని వుండడం కంటే నా జీవిత వచ్చిన ప్రశ్నలకి నేనే జవాబు వెతుక్కోవడం మంచిదనిపించింది. అందుకే వచ్చేసా. మన ఇద్దరం కలిసి వుండడం కంటే విడిపోవడంలో ఎక్కువ నిజాయితీ వుంటుందని అన్నా అజిత్ తో. ఇక్కడ వుంటున్న ఇల్లు నాకు డిపార్ట్మెంట్ ఇచ్చిన క్వార్టరు కాబట్టి అతన్ని వీలైనంత తొందరలో వేరే ఇల్లు చూసుకొమ్మన్నాను. సరేనన్నాడు. ఎప్పుడూ వుండే ముభావమే! పదిహేనేళ్ళుగా మనస్ఫూర్తిగా కనీసం నాతో కలిసి నవ్వలేని మనిషితో ఎలా బ్రతికానో నాకర్థం కావడం లేదు. లలిత్ తో సంబంధం పెట్టుకోవడానికే భర్తనించి విడిపోతున్నానని అందరూ అనుకుంటారేమో. ఆ భయం కూడా కావడంలేదు నాకు. జోకేమిటో తెలుసా? ఇవాళ పొద్దున్న లలిత్ ఫోను చేసాడు. అతనితోకూడా నేనీ సంగతి చెప్పలేదు.సాయంత్రం ఏదో కచ్చేరీ వుంది వస్తావా అన్నాడు? రాననీ, ఇంకోసారెప్పుడూ నన్ను పిలవద్దనీ చెప్పాను. "

"మీ అమ్మాయి గురించి ఆలోచించావా?"

"ఆలోచించా! అసలు తనని ఆ హాస్టల్ నించి తీసుకొచ్చి ఇక్కడ నాతోపాటే వుంచుకుంటా. ఇక్కడ కాలేజీలో చదువుకుంటుంది. నాకు చాలా ఒంటరిగా అనిపిస్తుంది పూర్ణిమా! అందరూ నన్ను వాడుకుంటున్నారన్న భావన! అజిత్ కేమో నేను షోకేసులో బొమ్మలాటి దాన్ని. లలిత్ కి కాలక్షేపానికి పనికొచ్చే స్నేహితురాలు. " ఎప్పుడూ ధైర్యంగా కాన్ఫిడెంట్ గా వుండే రూపిణి కళ్ళల్లో కన్నీళ్ళు! కళ్ళు తుడుచుకుంది రూపిణి.

"నన్ను ప్రేమించడానికెవరూ లేరు అన్న భావన చాలా కృంగదీస్తుందీ మధ్య.. అందుకే దాన్ని ఇక్కడికొచ్చేయమన్నాను. వచ్చేస్తానంది కూడా. కాలేజీలు తెరిచే సమయానికి ఇక్కడుంటుంది." అంతలోనే ఆమె మొహంలో చిరునవ్వు.

"ఆల్ ది బెస్ట్ రూపిణీ. నువ్వేం చేసినా ఆలోచించే చేస్తావని తెలుసు."

ఇద్దరూ లేచి ఆఫీసులోపలికెళ్ళారు. లోపలికొస్తూ వున్నట్టుండి అంది రూపిణి,

"నిన్ను చూస్తే నాకు చాలా ఈర్ష్యగా వుంటుంది పూర్ణిమా! ఎంత అదృష్టవంతురాలివి. ప్రేమించే భర్తా, ముత్యాల్లాటి పిల్లలూ, అత్తా-మామలూ, అమ్మా-నాన్నా, అంత పెద్ద కుటుంబంలో నువ్వెంత వెచ్చగా వుండి వుంటావో నేనూహించగలను. నా ఒంటరితనం నువ్వూహించలేవు."

కంప్యూటరు తెరిచి రూపిణి మాటలగురించే ఆలోచిస్తూంది పూర్ణిమ.

*"నీకొక గుడ్ న్యూస్! సారిక నన్ను పెళ్ళి చేసుకోడానికొప్పుకుంది"*

వంద చిరునవ్వుల బొమ్మలతో అరుణ్ దగ్గర్నుంచి ఈ-మెయిలు తన గదిలోకొచ్చేసరికి ఆమె కోసం ఎదురు చూస్తోంది.

---

"పేరు? "

"పూర్ణిమ. "

"వయసు? "

"నలభై యేళ్ళు. "

"చిరునామా? "

"...."

"కూర్చోండి. హేమ గారు మిమ్మల్ని అయిదు నిమిషాల్లో పిలుస్తారు."

పూర్ణిమ వెళ్ళి కుర్చీలో కూర్చుంది. అసలు తను ఇక్కడికెందుకొచ్చిందో తనకే తెలీదు. మనసులో అశాంతిగా వుంటూ నిద్ర పట్టక అవస్థ పడుతూవుంది. ఏదో అర్థం కాని దిగులూ, నిస్పృహ. ఎవరితోనూ మాట్లాడాలన్నా నిరాసక్తంగా వుంది. ఆఫీసులో పని మీద కూడా మునుపట్లా శ్రధ్ధ పెట్టలేకపోతూంది. శివాకి చెప్పినా అర్థం చేసుకుంటాడనిపించడంలేదు.

డాక్టరు దగ్గరికెళ్తే, అన్ని పరీక్షలూ చేసి,

"ఒక్క సారి సైకాలజిస్టును కలిసి చూస్తావా? నథింగ్ టు వరీ. కొన్నిసార్లు మన మనసులో మాట చెప్పుకోవడానికి స్నేహితులూ పరిచయస్తుల కన్నా, కొత్తవారితో మాట్లాడటం వల్ల మనసు తేలికపడుతుంది. హేమ నాకు తెలిసిన సైకాలజిస్టు. చాలా మంచిది, చాలా తెలివైంది. ఒక్క సారి తనని ఊరికే కలిసి చూడు. తరవాత ఏం చేయాలో ఆలోచిద్దాం," అంది.

"నాకేదైనా సైకలాజికల్ డిజార్డరా?" ఆశ్చర్యంగా అడిగింది తను.

"నో! నో! నీకు ఒంట్లో ఏ రకమైన సమస్యా లేదు. కానీ, చాలా రెస్ట్ లెస్ గా, చిరాగ్గా వుందనీ, ఒళ్ళంతా నొప్పులుగా వుందనీ, రాత్రుళ్ళు నిద్రపట్టడం లేదనీ అంటున్నావు. మాటి మాటికీ ఏడుపొస్తుందంటున్నావు. ఆ సిమ్టంస్ మైల్డ్ ఏంక్జయిటీని సూచిస్తున్నాయి. ఒకటి రెండు సార్లు సైకాలజిస్టు తో మాట్లాడితే, యూ మైట్ ఫీల్ బెటర్."

ఓపికగా వివరించింది డాక్టరు. దాని ఫలితమే ఈ అప్పాయింట్ మెంటు.

"పూర్ణిమా!" తన పేరు వినబడి తలెత్తి చూసింది పూర్ణిమ.

"హలో! లోపలికి రండి," నవ్వు మొహంతో లోపలికి పిలిచిందొక యువతి. చేతిలో మేగజీన్ పక్కన పడేసి ఆమె వెంట గదిలోకి నడిచింది పూర్ణిమ.

"కూర్చొండి. "

కుర్చీలో కూర్చొని గదంతా కలయచూసింది పూర్ణిమ. కిటికీలు తెరిచి వుండి, గదంతా వెలుతురూ, గాలీ ధారాళంగా పరుచుకుంటున్నాయి.

"ప్లీజ్ రిలాక్స్. మంచినీళ్ళు తాగుతారా? కొంచెం కాఫీ తాగుదామా?"

"మంచినీళ్ళివండి, ప్లీజ్!"

లేచి మంచి నీళ్ళ గ్లాసందించింది. పూర్ణిమ వంక చూసి ఆహ్లాదంగా నవ్వింది.

"మీరెందుకో టెన్స్ గా వున్నారు. నన్నొక స్నేహితురాలిగా భావించి ఫ్రీగా మాట్లాడండి. ఒకవేళ మీకు మాట్లాడే మూడ్ లేకపోతే ఊరికే కబుర్లు చెప్పుకుందాం. అసలు నేను పొద్దణ్ణించీ కాఫీ తాగలేదు. ఐ విల్ గెట్ దట్ కాఫీ!"

అంటూ బయటికెళ్ళి రెండు నిముషాల్లో తిరిగొచ్చింది.

"ఏం చేస్తుంటారు మీరు?"

పూర్ణిమ చెప్పింది.

"సైంటిస్టా! హౌ ఇంట్రెస్టింగ్! మీ పని గురించీ, ఇంట్లో వాళ్ళ గురించీ చెప్పండి."

అన్యమనస్కంగా ఏదో చెప్పింది పూర్ణిమ. ఆమెకసలు అక్కణ్ణించి లేచి వెళ్ళిపోవాలని వుంది. కాఫీ వచ్చింది.

"కాఫీ తీసుకోండి. మా రిసెప్షనిస్టు పెడుతుంది. ఫర్వాలేదు, బాగానే వుంటుంది. నేను కొంచెం సేపు రాసుకునే పని వుంది. మీరు కాఫీ తాగాక మాట్లాడుకుందాం."

పది నిముషాలు మౌనంగా గడిచిపోయాయి. కాఫీ కప్పులు తీసేసి, రాసుకుంటున్న పుస్తకమూ, పెన్నూ పక్కన పెట్టేసింది హేమ. మళ్ళీ హాయిగా నవ్వింది.

"చూడండి! మీ హెజిటేషన్ నేను అర్థం చేసుకోగలను. అసలీ అమ్మాయెవరని నేను నా మనసులో మాట చెప్పాలి, అనుకుంటున్నారు. పైగా, ఊరికే నా మీద ఇంట్రస్టు నటిస్తోంది అని చిరాకు కూడా కలుగుతూండవచ్చు, అవునా?" సీరియస్ గా అడిగింది. గతుక్కుమంది పూర్ణిమ.ఏమి మాట్లాడలేదు.

"మనలో ప్రతి ఒక్కళ్ళకూ ఏదో ఒక సమస్య వుంటూనే వుంటుంది. ఏ సమస్యా లేని వాళ్ళు బహుశా ఎవరూ వుండరేమో. ఒంటికి బాధొస్తే దాన్ని సరిచేసుకోవడం చాలా సులువు. డాక్టరు దగ్గరికెళ్ళి మందులు వాడితే సరిపోతుంది. కానీ కొన్నిసార్లు మనసు బాగుండదు. ఏదో పెద్ద పేరున్న మానసికమైన జబ్బే అయివుండక్కర్లేదు. చిన్న చిన్న విషయాలు, బాధ పెట్టే విషయాలు చాలానే వుంటాయి. వాటిని తీర్చుకునేదెలాగో, ఆ సమస్యతో సర్దుకుపోయేదెలాగో తెలియని అయోమయమూ చాలా సార్లు సాధారణమే. ప్రస్తుతం మనముంటున్న కాలంలో మనకి ఉమ్మడి కుటుంబాలనించి వచ్చే సెక్యూరిటీ, స్ట్రెస్ రిలీజ్ మెకానిజమూ ఏవీ లేవు. అఫ్ కోర్స్, ఉమ్మడి కుటుంబాలనించి వచ్చే సమస్యలు కూడా లేవనుకోండి. అది వేరే సంగతి. ఇంతకీ నేను చెప్పేదేమిటంటే, మా లాటి సైకాలజిస్టులు మీరు చెప్పేది సావధానంగా వింటారు. మీతో వేరే ఎటువంటి పరిచయమూ, సంబంధమూ లేకపోవడంతో మీ సమస్య వల్ల మిమ్మలని తప్పు పట్టడమో, వేరే స్వార్థ ప్రయోజనాలకోసం సలహాలు ఇవ్వడమో జరగదు. అంటే చాలా అబ్జెక్టివ్ గా మీ సమస్యని చర్చిస్తామన్నమాట. మీరు నాతో చెప్పిన విషయాలేవీ ఈ నాలుగ్గోడలు దాటి బయటికి పోవు, అందుచేత నిర్భయంగా మీ బాధేమిటో చెప్పండి."

"బాధంటే, పెద్ద బాధేమీ కాదూ..."

"అవును! అది బాధ కూడా అయి వుండకపోవచ్చు. వాట్ ఎవర్ ఇట్ ఈజ్, మీ మనసు మీద ప్రస్తుతం వున్న విషయం చెప్పండి. మీరన్నట్టు అది పెద్ద బాధ కాదనుకోండి, ఆ సంగతే నేనూ చెప్తా, అంతే కదా?"

మెల్లిగా మాట్లాడడం మొదలు పెట్టింది పుర్ణిమ.

యేణ్ణర్థం కింద అరుణ్ తో పరిచయమూ, అతనికి వున్న డిప్రెషనూ, అతను తన మీద మానసికంగా ఆధారపడటమూ, అతన్ని ఆస్పత్రిలో జేర్చడమూ, మెల్లి మెల్లిగా అతను తేరుకుంటూ తనకి దూరమై పోవడమూ, అతను కాబోయే భార్యని పరిచయం చేయగానే తనలో కలిగిన అలజడీ, అన్నీ... ఏదీ వదలకుండా చెప్పింది.

"..అతనితో పరిచయానికి ముందు నాకు అప్పుడప్పుడూ వంటరిగా అనిపించేది. ఇప్పుడు ఎప్పుడూ చాలా ఒంటరిగా అనిపిస్తుంది. అసలు నాకేమవుతుంది? నా మనసులో వున్నదేమిటి? కుటుంబం లో కొంచెం నా మీద ఒత్తిడి పెరిగేసరికి నేను ఇంకొక మనిషి మీద ఇష్టాన్ని పెంచుకున్నానా? ప్రేమించే భర్తా, ముచ్చటైన కుటుంబమూ వున్నా ఇంకొక మగవాడు, అందులోనూ నాకు తమ్ముడి వయసు వాడు, అతనితో అనుబంధాన్ని ఎలా పెంచుకున్నాను? అసలు అరుణ్ నీ సారికనీ కలిపి చూస్తే నా మనసులో ఇంత

మంట ఎందుకు రాజుకుంటూంది? ఆ విషయం తెలిస్తే నన్నందరూ ఎంత అసహ్యించుకుంటారు? అరుణ్ చేసే ఫోన్ కాల్స్లూ, నాతో కలిసి కాఫీ తాగే సమయాలూ, మా ఇంటికొచ్చి నాతో స్నేహంగా వుండే సందర్భాలూ అన్నీ నేను మిస్సవడం ఏమిటి? అసలు వినడానికే ఎంత వెగటుగా వుంది? నాకు పదహారేళ్ళ కూతురుంది. దాని ప్రవర్తనని సరిదిద్దుతూ దానికొక రోల్ మోడల్ లా నిలబడాల్సిన బాధ్యతుంది. అలాటిది నేను ఇలాటి మానసిక స్థితిలో వున్నానంటే ఎంత సిగ్గు చేటు!"

వెక్కి వెక్కి ఏడుస్తోంది పూర్ణిమ. హేమ మౌనంగా ఒక పేపర్ టిష్యూ అందించింది. కళ్ళు తూడుచుకుంది పూర్ణిమ.

"ఇంకొంచెం మంచి నీళ్ళిస్తారా?"

గ్లాసు నిండా మంచి నీళ్ళు తాగింది. మనసంతా ఖాళీ అయిపోయినట్టనిపించింది.

"బాత్రూం లోకెళ్ళి మొహం కడుక్కుంటారా?" హేమ అడిగింది.

"అలాగే!"

అయిదు నిముషాల్లో బయటికొచ్చి కుర్చీలో సర్దుకుని కూర్చుంది.

"ఆర్యూ ఫీలింగ్ బెటర్?"

మొహమాటంగా నవ్వింది పూర్ణిమ.

"మీ సమస్య నా కర్థం అయింది. ముందుగా మీరు మిమ్మల్ని తప్పు పట్టుకోవడం మానేయండి. ఒక మనిషి మీద ఆకర్షణ కలగడం, అది ఇష్టంగా మారడం, ఇవన్నీ ప్రకృతి మనలో హార్డ్ కోడ్ చేసి పెట్టిన సంగతులు. మనం నియమించుకున్న సాంఘిక నియమాలూ, స్వయం నియంత్రణలూ అన్నీ ఆ పైన మనం నిర్మించుకొన్నవే. చాలా సార్లు మన బుద్ధి మీద ప్రకృతి జయించడం కూడా అసహజమేమీ కాదు. చాలా సహజంగా మీలో రేగే ఆకర్షణలకీ, నేర్చుకున్న సంప్రదాయాలకీ మధ్య సంఘర్షణ లో అలిసిపోతున్నారంతే. జస్ట్ గివ్ యువర్ సెల్ఫ్ సం టైం. మీరే సర్దుకుంటారు. ప్రలోభాలూ, ఆశలూ, ఆకర్షణలు ఇవ్వన్నిటి వల్ల మనం మంచి వాళ్ళమా చెడ్డ వాళ్ళమా అన్నది తేలదు. కేవలం మనమూ మనుషులమే అన్న విషయం మాత్రం అర్థమవుతుంది. కాబట్టి జరిగిందాంట్లో మీ తప్పేమీ లేదు. ఆ సంగతి మీరు మనసుకి నచ్చ చెప్పుకుంటే ఈ సంఘర్షణ నించి బయట పడడం పెద్ద కష్టమేమీ కాదు." చెప్పడం ఆపింది హేమ.

ఆమె మాటలు వింటూ ఆలోచిస్తూంది పూర్ణిమ.

"అంతే కాదు! మీకింకో విషయం చెప్తాను. ఒక క్రైసిస్ లోంచో, గాఢంగా అనిపించే అనుభవం లోంచో ప్రయాణించేటప్పుడు శరీరం చాలా రసాయనాలు విడుదల చేస్తుంది. ఆ పరిస్థితి లోంచి బయటపడ్డా వొంట్లోంచి రసాయనాలు అంత త్వరగా తగ్గిపోవు. శరీరం మళ్ళీ మునుపటి స్థితికి చేరుకోవడానికి కొంత సమయం పడుతుంది. ఉదాహరణకి, పెద్ద ఆక్సిడెంటు కాబోయి తప్పిందనుకోండి. బయటికొచ్చినా ఇంకొన్ని క్షణాలు గుండె గబ గబా కొట్టుకుంటుంది, కాళ్ళు వొణుకుతూనే వుంటాయి, అలాగన్నమాట.

మానసికంగా జబ్బు పడ్డ మనిషికి తోడుండం చాలా కష్టమైన పని. వింతేమిటో తెలుసా? బలహీనమైన మనుషులకి చాలా బలం వుంటుంది. వాళ్ళ బలహీనతే వాళ్ళ బలం. వాళ్ళ చేయి పట్టుకున్న మనిషిని కిందకి లాగేంత బలం వుంటుంది. అలాగే అరుణ్ మీ చేతిని బలంగా పట్టుకున్నాడు. అతనితో పాటు పరిగెత్తి మీరూ ఆ సమస్యలో పాలు పంచుకున్నారు. ఇప్పుడతనూ, అతని సమస్యా మిమ్మల్నొదిలి పోయినా, మీ శరీరమూ, మనసూ ఇంకా పూర్వపు స్థితికి రాలేదన్నమాట! నేను చెప్తుంది మీకర్థమవుతుందా?"

శ్రద్ధగా వింటూంది పూర్ణిమ. అర్థమవుతుందన్నట్టు తలాడించిది.

"ఇప్పుడే గూగుల్ లో మీరు పబ్లిష్ చేసిన పేపర్ల వివరాలు చూసాను. అంతంత పెద్ద విషయాలే అర్థమయ్యే మీకు, నేను చెప్తున్న విషయాలు చాలా తేలికగా అర్థమవుతాయి! అవునా?" నవ్వింది హేమ. మళ్ళీ మొదలు పెట్టింది.

"ఈ పరిస్థితిలో నా సలహా ఏమిటంటే- ఒక వారం రోజులు సెలవు పెట్టి మీ వారితో పిల్లలతో ఎటైనా వెళ్ళి రండి. తర్వాత మీకు చాలా నచ్చే పని, ఏదైనా సరే, హాబీలా పెంచుకోండి. వీలైనంతగా, ఇంతవరకూ మీరు చేయనిది, మొక్కల పెంపకమో, వాకింగ్ క్లబ్బులో చేరడమో, లైన్ డాన్సింగ్ చేయడమో, ఏదైనా సరే, మీరింతవరకూ చేయనిది మొదలు పెట్టండి. ఏదీ తోచకపోతే, చివరికి జిం లో చేరడమైనా సరే. శారీరక శ్రమ మెదడులో చాలా న్యూరో ట్రాన్స్మిటార్లని విడుదల చేస్తుంది. అది మనసుకి చాలా ఆహ్లాదాన్నిచ్చి రాత్రి పూట బాగా నిద్ర పట్టేలా చేస్తుంది. అన్నిటికంటే ముఖ్యమైన సలహా- బీ జెంటిల్ ఆన్ యువర్ సెల్ఫ్. మీ మనసులో రేగే అపరాధ భావనలనీ, కోప తాపాలనీ కొంచెం డిటాచ్మెంట్ తో ఒక పక్కకి జరిగి గమనించండి. అవే తగ్గిపోతాయి." మాట్లాడడం ఆపింది హేమ.

"ఏమైనా మందులు వాడాల్సొస్తుందా?"

"అబ్బే! ఏమీ అవసరం లేదు. యూ ఆర్ పర్ఫెక్ట్లీ ఆల్ రైట్. ఎనీ హౌ, నేను సైకాలజిస్టుని మాత్రమే. సైకియాట్రిస్టుని కాదు. నేను మందులివ్వలేను. కేవలం కౌన్సెలింగ్ చేసి సలహాలివ్వడం మాత్రమే నేను చేయగలిగిందీ, చేయవలిసిందీ. మందులు వాడాల్సిన పరిస్థితొస్తే ఒక సైకియాట్రిస్టుకి రెఫర్ చేయగలను. మీకసలు ఏ మందులూ అవసరం లేదు. కొంచెం టైమూ, చిన్న చిన్న మార్పులతో మీరు మునుపట్లాగవుతారు. ఆల్ ది బెస్ట్!"

లేచి బయటికి నడవబోయింది పూర్ణిమ.

"ఇంకొక్క విషయం!" ఏమిటన్నట్టు చూసింది.

"మీరు నాతో చెప్పిన ఏ విషయమూ ఈ నాలుగు గోడలు దాటి బయటికి రాదు. నేను బయట ఎక్కడైనా ఎదురు పడ్డా మీతో పరిచయం లేనట్టే వుంటాను. మీకు మళ్ళీ నాతో ఎప్పుడైనా మాట్లాడాలనిపించినా, మీరు రావొచ్చు."

నవ్వి, ఆమె దగ్గర వీడ్కోలు తీసుకొని బయటికొచ్చింది పూర్ణిమ.

************

సైకాలజిస్టు దగ్గర్నించి ఆఫీసుకెళ్ళింది. హేమ చెప్పినట్టే ఆ పై వారం సెలవు పెట్టాలనుకుంది. పిల్లలూ ఇంకొక వారంలో స్కూలు తెరిచే సమయానికొచ్చేస్తారు. వాళ్ళతో కలిసి బట్టలూ పుస్తకాలూ షాపింగ్ చేస్తూ గడిపేస్తే బాగుంటుంది. పిల్లలు గుర్తు రాగానే మనసు హాయిగా అయినట్టు అనిపించింది.

హేమతో మాట్లాడింతరవాత ఆమెకి మనసు కొంచెం తేలిక పడ్డట్టయి, దిగులు కొంచెం తగ్గింది. నిజమే, తనేం తప్పు చేసిందని అంతలా కృంగి పోతుంది? చిన్న చిన్న సమస్యలని మనసులోనే దాచుకుని నరకం అనుభవించే కంటే, ఇలా ఒక కౌన్సెలర్ తో మాట్లాడడం మంచి ఆలోచన. చాలా సార్లు మనకి తెలిసిన విషయాలే ఇంకొక వ్యక్తి చెప్తూంటే కొత్త ఆలోచనలు రేకెత్తిస్తాయి.

తలుపు దగ్గర చప్పుడైతే తలెత్తి చూసింది. సీత! లోపలికొచ్చి కూర్చుంది.

"పన్లో వుంటే డిస్టర్బ్ చేస్తున్నానా? పొద్దున్న బస్సులో రాలేదు? నిన్నా రాలేదు? ఎక్కడికెళ్ళావ్? ఏమైందోనని చూడడానికొచ్చా!"

"ఏమీ లేదు. చిన్న పనుండి బయటికెళ్ళాల్సొచ్చింది? నువ్వెలా వున్నావ్? ఆ రోజు తర్వాత మనం కలిసిందే లేదు! ఎస్.ఆర్.కే ఆఫిసుకొస్తున్నాడా?"

"అప్పుడు చెప్పినట్టే పిల్లల్ని తీసుకుని మా అత్తగారింటికెళ్ళి వారం రోజులు ఉండొచ్చా! దట్ వాజ్ ఎ గుడ్ డెసిషన్. వచ్చింతర్వాత ఆఫీసు పనితో కొంచెం బిజీ! ఎస్.ఆర్.కే పై వారం నించి వస్తాడేమో ఆఫీసుకి. అన్నట్టు తెలుసా? నిన్న రాజమ్మ కనిపించింది. నీకు ఒంట్లో బాలేదని చెప్పింది. ఏమయింది?"

"ఏం లేదు. కొంచెం అలసటా, నిద్ర లేమి అంతే. "

"అవును! నీ మొహం కూడా కొంచెం పాలి పోయింది. డాక్టరు దగ్గరికెళ్దామా పోనీ?" ఆమె వంక పరీక్షగా చూస్తూ అంది సీత.

"అబ్బా! ఏం లేదు సీతా. ఎండలకి కొంచెం అలసటగా వుంది. అంతే! ఇంతకీ అశోక్ ఎలా వున్నాడో అడిగావా రాజమ్మని?"

"ఆ బానే వున్నాడట! రిజల్ట్స్ వచ్చేస్తాయి కదా ఇంకొన్ని రోజుల్లో. ఆ తరవాత కాలేజీ అడ్మిషన్లూ!"

ఇంకేదో చెప్పబోయిన సీత తలుపు చప్పుడవ్వడంతో ఆపి, తలెత్తి చూసింది.

"హలో! మే ఐ కమిన్?" నవ్వు మొహంతో తలుపు దగ్గర నిలబడి వున్నాడు అరుణ్.

"సరే పూర్ణిమా! సాయంత్రం బస్సులో కలుస్తా."

అరుణ్ వంక వింతగా చూస్తూ వెళ్ళి పోయింది సీత.

" రా అరుణ్. కూర్చో!"

" బాగున్నావా పూర్ణిమా? ఎన్నిరోజులయింది నీ కేబిన్లోకొచ్చి!"

“బాగున్నా! నువ్వెలాగున్నావ్? ఇవాళ్టినించేనా ఆఫీసుకి రావడం?”

“అవును. అబ్బ! ఆరేడు నెలలయింది మళ్ళీ ఆఫీసు మొహం చూసి. ఇట్ ఈజ్ గుడ్ టు బి బేక్. అది సరే, సారికతో పెళ్ళి సెటిలయిందని ఈమెయిలు వేస్తే జవాబే ఇవ్వలేదు నువ్వు! నీకు సారిక నచ్చలేదా?” అతను ఆత్రంగా అడుగుతూంటే నవ్వొచ్చింది.

“ఎంత పిచ్చిగా మాట్లాడతావ్ వరుణ్! నా నచ్చడంతో పనేమిటి?నీకు నచ్చింది కదా! అయినా నచ్చకపోవడానికేముంది? ఆ రోజు తర్వాత ఇటు వైపు రాలేదు. పూర్తిగా లేబోరేటరీలోనే వుండి పోయాను. దాంతో ఈ మెయిలు పంప లేకపోయాను. పైగా కొంచెం పని హడావిడి, అంతే! ”

“ అమ్మయ్య! అంతేనా? నీకు సారిక నచ్చలేదేమో నని బలే టెన్షన్ పడ్డాను. ఫోన్ చేద్దామనుకున్నా కానీ, ఈ మధ్య నీకు ఫోన్ చేస్తే నిన్ను డిస్టర్బ్ చేస్తున్నాననిపిస్తుంది. ”

చిన్న పిల్లాడిలా అంటూన్న అతన్ని చూసి నవ్వింది.

“పూర్ణిమా! నిన్న రాత్రి సైకియాట్రిస్టు దగ్గరకి వెళ్ళా ను. అబ్బే, ఏం లేదు, రెగ్యులర్ కన్సల్టేషన్. చాలావరకు నేను బాగయిపోయాననీ, ఇంకొక రెండు మూడు నెలల్లో మందులు కూడా మానేసే అవకాశం వుందనీ అన్నాడు.”

“ఈ సంగతంతా సారికకి తెలుసా?”

“తెలుసు! అయినా ఒప్పుకుంది! నాకెంత సంతోషంగా అనిపించిందో చెప్పలేను.”

తనూ మనస్ఫూర్తిగా సంతోషపడడానికి ప్రయత్నించింది పూర్ణిమ.

“గుడ్! ఆమెకి ముందే అంతా చెప్పి మంచి పని చేసావు.”

“అంతే కాదు. తననీ ఒక సారి సైకియాట్రిస్టు దగ్గరికి తీసికెళ్ళ మని అడిగింది. ఆయనతో మాట్లాడి నా గురించి అంతా తెలుసుకుంది. చాలా శ్రధ్ధగా అంతా విన్నది. ఈజింట్ షీ ఎ వండర్ ఫుల్ గల్?”

“అఫ్ కోర్స్! ఇక్కడ ఆఫీసులో అంతా ఎలా వుంది?”

“అసలు విషయం చెప్పడమే మర్చిపోయాను! ” తల మీద కొట్టుకున్నాడు.

“నన్ను చెన్నై ట్రాన్ఫ్సరు చేసారు. వచ్చే నెలలోగా జాయినవ్వాలి.”

“వాట్!” అదిరిపడింది పూర్ణిమ.

“అవును. ఆ మధ్య ఒకసారి డాక్టరు నాతో స్థలం మార్పు వుంటే నేనేమైనా మారతానేమోనని ట్రాన్ఫ్సరు కి అప్లై చేయమన్నారు. చేసి ఆ సంగతే మర్చిపోయాను. కిందటి వారం నాకింకా ఇంట్రస్టు వుంటే అక్కడ ఒక గ్రూపులో నన్ను తీసుకుంటారని చెప్పారు. సారికకీ అక్కడికి మారడం చాలా తేలికట. అందుకని ముందు నేను వెళ్ళి జాయినవుతాను. పెళ్ళి జరిగింతర్వాత సారికా అటొచ్చేస్తుంది.”

" పెళ్ళెప్పుడంటున్నారు?"

"బహుశా ఆగస్టులో వుండొచ్చు. నువ్వు తప్పక వస్తావుగా?"

"ఎందుకు రాను? ఇంకా ఏమిటి విశేషాలు? అమ్మా నాన్నా అంతా బాగున్నారా?"

"ఏమీ లేవు! పిల్లలెలా వున్నారు? శివా?"

"పిల్లలు ఇవాళో రేపో వచ్చేస్తారు. స్కూళ్ళూ కాలేజీలూ తెరుస్తారుగా!"

"మార్కులెలా వొచ్చాయి?"

"బానే వొచ్చాయి కానీ, ఇక ఈ సంవత్సరం నించీ ట్యూషను పెట్టించాలి, తప్పదు."

నవ్వాడు అరుణ్.

"కొన్నిసార్లు నువ్వచ్చం మా అమ్మలా మాట్లాడతావు."

తనూ నవ్వింది పూర్ణిమ.

"సరే, వస్తా పూర్ణిమా. మళ్ళీ మండే నించి ఆఫీసుకొస్తా."

లేచి వెళ్ళాడు.

"అరుణ్!"

వెనక్కి తిరిగాడు.

"ఏమిటి?"

"ఏమీ లేదు. గుడ్ లక్! "

" థాంక్స్! " తీయగా నవ్వి బయటికెళ్ళాడు.

కాసేపు కళ్ళు మూసుకుంది పూర్ణిమ. మనసంతా ఖాళీ అయిపోయిన భావన. "అరుణ్! నీకు సహాయం చేయడానికీ, కష్టకాలంలో నీకు తోడుండడానికీ, నా వ్యక్తిత్వంలోంచీ , జీవితం లోంచీ ఒక భాగాన్ని తీసిచ్చాను. దాన్నంత తేలిగ్గా తీసుకోకు. నన్ను మర్చిపోకు. అన్నిటికంటే ముఖ్యంగా, నీ ఆరోగ్యం శ్రద్ధగా చూసుకో! మళ్ళీ పాడయితే నేను సహాయం చేయగలనో లేదో!"

చెప్పాలనుకున్న మాటలు చాలాసార్లు అసలు గొంతుదాటి బయటికే రావు.

అయిదు నిముషాల తర్వాత లేచి లేబ్ లోంచి బయటపడింది ఇంటికెళ్ళడానికి.

******************

ఇంటికొచ్చి తాళం తీసున్న తలుపులు చూసి ఆశ్చర్య పోయింది. శివా తలుపు తెరిచాడు నవ్వుతూ.

"అదేంటి? ఇవాళ ఇంత త్వరగా వచ్చేసారే?"

"సర్ప్రైజ్! ఎవరొచ్చారో చూడు!"

"అమ్మా!" గొల్లుమని అరుస్తూ నీహారికా, సంజూ మీద పడ్డారు.

"మీరెప్పుడొచ్చారు?"

"పొద్దున్నే! అసలు ఆదివారం వద్దామనుకున్నాం కానీ, నాన్న నువ్వు డల్ గా వున్నావని ఇవాళే వచ్చేయమన్నారు. బస్టాండుకు నాన్నొచ్చి తీసుకొచ్చారు."

"అమ్మమ్మ వాళ్ళ ఇంట్లో అంతా బాగున్నారా?"

"అంతా బానే వున్నారు. అమ్మా, షాపింగుకెళ్ళాలి. బట్టలూ, పుస్తకాలూ కొనుక్కోవాలి. వీ హేవ్ టు బి రెడీ ఫర్ స్కూల్!"

పిల్లలు ఉత్సాహంతో గంతులేస్తున్నారు. ఏదో వేరే ప్రపంచానికెళ్ళి తిరిగి తన ప్రపంచంలోకొచ్చినట్టుంది ఆమెకి. ఆ రాత్రి పడుకునేముందు అరుణ్ పెళ్ళీ ట్రాన్స్ఫర్లగురించీ శివాతో చెప్పింది పూర్ణిమ.

"పోనీలే! స్థలం మారీ, పెళ్ళి జరిగీ అతనూ స్థిరపడితే చాలు. ఆల్ ఈజ్ వెల్ దట్ ఎండ్స్ వెల్!" అన్నాడు శివా.

ఎప్పటికైనా నేను అరుణ్ ని మనసులో నొప్పి లేకుండా తలచుకునే రోజొస్తే అంతే చాలు, అనుకుంది పూర్ణిమ.

జీవితం చాలా పెద్దది. చాలా ప్రేమించిన వాళ్ళనీ, ఆఖరికి కన్న తల్లి దండ్రులనీ పోగొట్టుకుని కూడా తేరుకోగలుగుతాం. అలాటిది, ఏదో ఒక యేడాది స్నేహం చేసిన మనిషిని మరిచిపోవడం పెద్ద సమస్య కాకపోవచ్చు. ఐ జస్ట్ నీడ్ సం టైం, అనుకుంటూ నిద్రపోయింది. ఆ రాత్రంతా కలత నిద్రే మిగిలిందామెకి.

********************

*ఆరు నెలల తర్వాత-*

"ఓ అమ్మా! ఇవాళ సాయంత్రం నేను రాను. అన్ని అంట్లూ రేప్పొద్దునొచ్చి తోమేస్తా!" రాజమ్మ మాటలకి కళ్ళు తెరిచింది పూర్ణిమ.

ఎప్పుడూ లేనిది ఇంతాలస్యంగా లేచింది తను! వామ్మో! ఆఫీసు, వంట. గబుక్కున మంచం దిగి గడియారం చుసి కెవ్వుమంది. ఎనిమిదిన్నర!

"రాజమ్మా! చచ్చేంత లేటయింది. తర్వాత మాట్లాడతా. అసలింత ఆలస్యం అయితే ఎవరూ లేపనన్నా లేదు! నేను లేస్తే కానీ ఈ ఇంట్లో మనుషులు లేవరు. ఇప్పుడు పరిగెత్తాలి బాబోయ్!" బట్టలు వెతుకుతూ అంటోంది పూర్ణిమ.

బుగ్గలు నొక్కుకుంది రాజమ్మ!

"ఏందమ్మా! శనివారం ఆఫీసుందా? సెలవేనని పండుకున్నవనుకున్నా!"

ఇవాళ శనివారమా? హమ్మయ్య! నవ్వేసింది.

"సారీ రాజమ్మా! మర్చిపోయాను. పొద్దున్నే ఎంత చల్లని వార్త చెప్పావు. సారు నిద్ర లేచారా? ఎక్కడున్నారు?"

"కిచెన్లో కాఫీ చేస్తున్నరేమో."

కిచెన్లోకెళ్ళింది పూర్ణిమ. టేబిల్ దగ్గర కూర్చొని పేపర్ చదువుతూ కాఫీ తాగుతున్నాడు శివా.

"నాకేది కాఫీ?"

"గిన్నెలో వుంది పోసుకొని తాగు," తలెత్తకుండానే అన్నాడు. కోపంగా చూసి లేచి వెళ్ళి తన కాఫీ తెచ్చుకుంది.

ఫోన్ మోగింది. రూపిణి.

"పూర్ణిమా! ఇవాళ సాయంత్రం రవీంద్ర భారతిలో ఒక ప్రోగ్రాం కెళ్తున్నాను. వుడ్ యూ లైక్ టు కం? సీత గార్ని కూడా తీసుకురండి. మూడు టిక్కట్లతో నేనక్కడ ఎదురుచూస్తూంటా."

"సీతని కూడా అడిగి, గంట సేపట్లో మళ్ళీ ఫోన్ చేస్తా! సరేనా?"

సాయంత్రం ముగ్గురూ రవీంద్ర భారతి దగ్గర కలుసుకున్నారు.

"సీత గారూ! యూ కుడ్ మేకిట్. నాకు చాలా సంతోషంగా వుంది. పదండి, లోపలికెళ్దాం."

"ఇదిగో, రానంటే ఊర్కోదు పూర్ణిమ. పిల్లలు వాళ్ళ నాన్నతో కలిసి నానమ్మ ఇంటికెళ్ళారు. ఒక్కదాన్నే ఇంట్లో వుండి చేసేదేముందని ఇలా..."

"నువ్వెళ్ళలేదేం మీ అత్తయ్యా వాళ్ళింటికి?"

"నాకు వెళ్దామంటే తలనొప్పి.." నసిగింది సీత.

సీత వంక చూసి ఆమె రహస్యం తెలుసన్నట్టు నవ్వింది పూర్ణిమ. తనూ నవ్వేసింది సీత.

"ఓ,కే! వాళ్ళకీ కొంచెం ప్రైవసీ కావాలేమో కొడుకుతో కబుర్లాడడానికి అని నేను ఆగిపోయాను!" ఈసారి నిజాయితీగా అంది.

"అయినా నువ్వేగా ఈసారి పాట కచేరీకి రాకపోతే వూరుకునేది లేదన్నావ్?"

వాళ్ళ మాటలకి అడ్డొచ్చింది రూపిణి.

"గుడ్ డెసిషన్. పూర్ణిమా, మీ చీర చాలా బాగుంది!"

"మీరిద్దరే నా చీరలు మెచ్చుకోవాలి. మా రాజమ్మయితే నా చీరలసలు మెచ్చనే మెచ్చదు." నవ్వింది పూర్ణిమ.

"రాజమ్మంటే గుర్తొచ్చింది, అశోక్ కాలేజీలో చేరాడా?" రూపిణి వున్నట్టుండి అడిగింది.

"ఆ, చేరాడు. బుద్ధిగా చదువుకుంటాననీ చెప్పాడు."

"అవునూ, అరుణ్ కేదో సమస్య అన్నావా మధ్య. ఏమయింది?"

"ఈ మధ్య అతను కనబడడమే లేదు! " కుతూహలంగా అడిగింది సీత.

"చెప్పాగా, ఏదో పెళ్ళి సంబంధం సమస్యలని. ఇప్పుడా అబ్బాయికి పెళ్ళి కుదిరిపోయింది. చెన్నై వెళ్ళిపోయాడు ట్రాన్స్ఫర్ మీద, అందుకే కనిపించడం లేదు."

"పెళ్ళికూతురెవరు? నీకు తెల్సిన అమ్మాయేనా?"

"ఉష్! తర్వాత మాట్లాడదాం, లోపలికెళదాం పద, ప్రోగ్రాం మొదలవుతోంది."

ముగ్గురూ లోపలికెళ్ళారు, కమ్మగా వినిపిస్తూన్న తంబూరా నాదం లోకి.

**(సమాప్తం)**

కౌముది